www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 10-8-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 133 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి మ.12.10 తదుపరి విదియ; నక్షత్రం: ధనిష్ఠ మ.1.53 తదుపరి శతభిషం; వర్జ్యం: రా.8.49-10.21; దుర్ముహూర్తం: సా.4.59-5.49; అమృతఘడియలు: ఉ.6.03-7.36; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.40 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

6 పాక్ యుద్ధ విమానాలు
కూల్చేశాం



- వాటిలో ఎఫ్-16లు కూడా ఉన్నాయి
- ఎస్400 గేమ్ చేంజర్.. వైమానిక దళాధిపతి ఏపీ సింగ్
- మరి.. హఠాత్తుగా పాక్‌పై యుద్ధం ఎందుకు ఆపేశారు?
- ఏ ఒత్తిడి పనిచేసింది?.. ప్రధాని మోదీకి కాంగ్రెస్ ప్రశ్నలు
- ఒక్క విమానాన్నీ కూల్చలే.. భారత్‌ది అసంబద్ధ వాదన: పాక్
- భారత్, పాక్ యుద్ధంలో 6 విమానాలు కూలాయి: ట్రంప్

బెంగళూరు, ఆగస్టు 9: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో వాయుసేన కీలక పాత్ర పోషించిందని ఎయిర్‌చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. దాయాది దేశానికి చెందిన ఓ పెద్ద విమానం సహా 6 యుద్ధవిమానాలను నేలకూల్చామని చెప్పారు. ఉపరితలం నుంచి గగనతల లక్ష్యాలపై జరిపిన దాడుల్లో ఇదే అతి పెద్దదని పేర్కొన్నారు. బెంగళూరులో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో అమర్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్ వైమానిక సామర్థ్యాన్ని దెబ్బతీశామన్నారు. పలు ఎఫ్16ఎస్ యుద్ధ విమానాలను నేలకూల్చడంతోపాటు, ఒక హ్యాంగర్‌ను కూడా ధ్వంసం చేశామని తెలిపారు. అదేవిధంగా ఒక పెద్ద విమానాన్ని కూడా కూల్చివేసినట్టు వెల్లడించారు. మానవ రహిత వైమానిక

మిగతా 12వ పేజీలో...





ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న మంత్రి కొండా సురేఖ. చిత్రంలో మంత్రి సీతక్క, నేరెళ్ల శారద; సీఎంతో ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్

గేట్ వే ఆఫ్ హైదరాబాద్

అత్యంత ఎత్తుగా ఐకానిక్ టవర్

- హిమాయత్‌సాగర్ వద్ద ఓఆర్ఆర్‌పై హైదరాబాద్ స్వాగత తోరణం
- ఓఆర్ఆర్‌కు ఓవైపు ఎకోథీమ్‌పార్కు, మరోవైపు ఐకానిక్ టవర్
- తాగునీరు, వరదనీరు నిర్వహణకు వీలుగా మూసీ పునరుజ్జీవనం
- రెండు నెలల్లో టెండర్లు పిలిచేలా పనుల్లో వేగం పెంచాలి
- మూసీ అభివృద్ధి పనులపై సమీక్షలో అధికార్లకు సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం ఓఆర్ఆర్‌పైన 'గేట్ వే ఆఫ్ హైదరాబాద్' పేరుతో అత్యంత ఎత్తైన ఐకానిక్ టవర్‌ను నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం తన నివాసంలో పురపాలక శాఖ అధికారులతో సమావేశమైన సీఎం.. మూసీ అభివృద్ధి పనులపై సమీక్ష జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే పర్యాటకులకు స్వాగతం పలికేలా హైదరాబాద్ ముఖద్వారం ఉండాలని సీఎం పేర్కొన్నారు. దీన్ని హిమాయత్ సాగర్ గాంధీ సరోవర్ దగ్గర ఓఆర్ఆర్‌పై 'గేట్ వే ఆఫ్ హైదరాబాద్'గా నిర్మించాలని ఆదేశించారు. ఓఆర్ఆర్‌కు ఒక వైపున ఎకో థీమ్‌పార్క్ అభివృద్ధి చేసి, మరో వైపున బాహ్య ఘాట్ దిశగా భారీ ఐకానిక్

మిగతా 13వ పేజీలో...

రూ. 80 వేల కోట్లు

- సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు ఎన్టీపీసీ సిద్ధం
- సీఎంకు తెలిపిన సీఎండీ గురుదీప్ సింగ్

రాష్ట్రంలో బీసీ సీఎం ఖాయం

- కాంగ్రెస్ హయాంలోనే అది సాధ్యం
- రేవంత్ పదేళ్లు సీఎంనడం తప్పుకాదు
- ప్రజల్లో విశ్వాసం పెంచేందుకే ఆ వ్యాఖ్యలు
- 23 తర్వాత మళ్లీ జనహిత పాదయాత్ర
- బీసీల నుంచి కిషన్‌రెడ్డి 2 పదవులు లాక్కున్నారు.. బండి, ఈటల నోరు విప్పాలి
- మీడియాతో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

13

పీ-4 పిచ్చిలో చంద్రబాబు!

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ తలమాసిన సలహాలు ఇవ్వడానికి ఎవరో ఒకరు తయారవుతారు. ఆచరణ సాధ్యం కాని ఇలాంటి ఆలోచనలంటే చంద్రబాబుకు మా చెడ్డ ఇష్టం. ఈ బలహీనతను గుర్తించిన కొందరు ప్రతి టర్మ్‌లో పక్కన చేరి దిక్కుమాలిన ప్రణాళికలు రూపొందించి ఆయనను అందులోకి లాగుతారు. దీంతో పుణ్యానికి పోతే పాపం ఎదురైనట్టు ఆయనకు రాజకీయంగా నష్టం జరుగుతుంది.

4

జగన్ రెడ్డి స్వయంకృతాపరాధంతో 2024లో చంద్రబాబు కనీవినీ ఎరుగని మెజారిటీతో అధికారంలో వచ్చారు. ఈ పర్యాయం అయినా ఆయన ప్రాక్టికల్‌గా, రాజకీయ నాయకుడిగా మారి ప్రజానాయకుడిగా గుర్తింపు పొందే ప్రయత్నం చేస్తారని అందరూ ఆశించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గత అనుభవాలు మరచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంటూ ఊదరగొట్టారు. ఇంతలోనే ఆయన పీ-4 అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. ఈ దిక్కుమాలిన సలహాను ఆయనకు ఎవరిచ్చారో తెలియదు గానీ 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా పీ-4 విధానాన్ని అమలు చేస్తానని చంద్రబాబు చెబుతున్నారు.

ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో ఉన్న 20% పేదలను రాష్ట్రంలో ఉన్న 10% ధనవంతులు ఆదుకోవాలని, ఆయా కుటుంబాలను సదరు ధనవంతులు దత్తత తీసుకోవాలని సీఎం కోరుకుంటున్నారు. 2029 నాటికి రాష్ట్రంలో జీరో పావర్టీ అన్న లక్ష్యం ఆచరణ సాధ్యమా? అని కనీస ఆలోచన చేయకుండా మార్గదర్శులకు బలవంతంగా బాధ్యతలు అప్పగిస్తున్నారు. చిన్నా చితకా వ్యాపారాలు చేసుకుంటున్న వారిని కూడా మార్గదర్శులుగా ఎంపిక చేస్తున్నారు. పేదరికం లేని సమాజం ప్రపంచంలో ఎక్కడైనా ఉందా? ఉంటుందా? మన దగ్గర ఎలా సాధ్యం అన్న సందేహం ఎందుకు కలగలేదో తెలియదు.

రాష్ట్రంలో పేదరికంలో ఉన్న కుటుంబాల సంఖ్య ఎంత? అన్నది ప్రభుత్వం వద్ద సమాచారం లేదు. తెల్ల రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటే రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను కట్టే మరికొందరిని మినహాయిస్తే మిగతా అందరూ పేదరికంలో ఉన్నట్టే! కనీసం కోటి కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేయవలసి ఉంటుంది. ప్రస్తుతానికి పదకొండు లక్షల కుటుంబాలను గుర్తించినట్టు ప్రభుత్వం చెబుతోంది. అలా అయితే మిగతా 89 లక్షల కుటుంబాల పరిస్థితి ఏమిటి? వారంతా ప్రభుత్వానికి దూరం కారా?

పేదలను ఆదుకోవడం వేరు.. పేదరికమే లేకుండా చేయడం వేరు. పేదరికం లేని సమాజం సృష్టించడం అంత సులువైతే సంపన్న దేశాల్లోనూ పేదరికం ఎందుకు ఉంటోంది. అక్కడ కూడా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు కదా! నిర్బంధ విధానం ఏదీ కూడా సక్సెస్ కాదు. మంత్రులు గానీ, సీనియర్ అధికారులు గానీ ఈ పథకం మంచిచెడులను ముఖ్యమంత్రికి చెప్పలేకపోతున్నారు.



కొత్త పలుకు

కూటమి తరఫున ఎన్నికైన కొందరు ఎమ్మెల్యేలు ప్రజాకంటకులుగా మారారు. వైసీపీకి చెందిన ఎమ్మెల్యేల కంటే అరాచకంగా వ్యవహరిస్తున్నారన్న భావన ఇప్పుడిప్పుడే ప్రజల్లో ఏర్పడుతోంది. నియోజకవర్గాలలో ఏ పనులు జరగాలన్నా ఎమ్మెల్యేల అనుమతి తప్పనిసరి చేశారు. ఏ పని కోసం అధికారుల వద్దకు వెళ్లినా ఎమ్మెల్యే గారితో చెప్పించండి అని అంటున్నారు.

రిజిస్ట్రేషన్లు జరగాలన్నా, మున్సిపాలిటీలలో ఇంటి ప్లాన్ ఆమోదం పొందాలన్నా కూడా ఎమ్మెల్యేల జోక్యం ఏమిటి? ఇక రెవెన్యూ వ్యవహారాలలో ఎమ్మెల్యేల జోక్యం సంగతి చెప్పాల్సిన పనిలేదు. లేఔట్లు వేసి వ్యాపారం చేయాలన్నా, భూ వినియోగ మార్పిడి జరగాలన్నా ఎమ్మెల్యేలకు కప్పం కట్టాలా? కేవలం ఐదేళ్ల కాలానికే తాము ఎన్నికయ్యామన్న స్పృహ లేకుండా విర్రవీగుతున్నారు.

రాజధాని అమరావతి విషయంలో కూడా గందరగోళం నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయమై వెంటనే దృష్టిసారించాలి. లేని పక్షంలో మీపై పూలు చల్లిన రైతులే రాళ్లు విసిరినా ఆశ్చర్యం లేదు. సీఆర్‌డీఏ నిబంధనల గురించి రైతులకు పూర్తిగా తెలియదు. తెలిస్తే వారు ఆందోళన చేస్తారు. నమ్మిన రైతులను అధికారుల దయాదాక్షిణ్యాలకు వదిలేయడం మంచిది కాదు.



ట్యాపింగ్ కేసులో కవితను విచారించాలి

- ట్యాప్ చేయలేదని కేటీఆర్ ప్రమాణం చేస్తారా?
- సిట్ పరిధి పరిమితం.. కేసును సీబీఐకి ఇవ్వాలి
- అధికారులపై నమ్మకం ఉంది.. సర్కారుపై లేదు
- కేటీఆర్ ఇచ్చే లీగల్ నోటీసులకు భయపడను
- నేను నోటీసులు ఇస్తూ పోతే కేసీఆర్, కేటీఆర్ జీవితాంతం జైల్లోనే ఉంటారు: బండి సంజయ్

కరీంనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కూతురు కవితను విచారించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ట్యాపింగ్ జరిగిందని స్వయంగా కవితనే చెప్పారని అన్నారు. శనివారం కరీంనగర్‌లో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని తాను దేవుడి సాక్షిగా ప్రమాణం చేసేందుకు సిద్ధమని అన్నారు. ట్యాపింగ్ చేయలేదని కుటుంబ సభ్యులతో కలిసి గుడిలో ప్రమాణం చేసే దమ్ముందా..? అని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఫోన్ ట్యాపింగ్ జరగలేదని హరీశ్‌రావు కూడా ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ ఇచ్చే లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని సంజయ్ తేల్చి చెప్పారు. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక లీగల్

మిగతా 2వ పేజీలో...



పోటెత్తిన వరదతో అమీర్‌పేట మెట్రో స్టేషన్ వద్ద చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి

హైదరాబాద్‌లో కుంభవృష్టి

హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం కుండపోతగా వర్షం పడింది. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని చోట్లనైతే కాలనీలు, రోడ్లు చెరువులను తలపించాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కాగా, 13, 14, 15 తేదీల్లో రాష్ట్రంలో అతి భారీ వర్షాలు, ఆది, సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

13

అయ్యో.. రొయ్య!

- ట్రంప్ దెబ్బకు ఆక్వా రంగం విలవిల
- ఎగుమతుల్లో దేశంలోనే ఏపీ టాప్
- ఉత్పత్తిలో అమెరికాకు 40 శాతం
- సుంకంతో రొయ్యల ధర పతనం
- రైతులకు టన్నుకు 40 వేలు నష్టం
- ఏపీ అగ్రి ఎగుమతులపైనా ప్రభావం
- బియ్యం, ఆహార పదార్థాలపై 50%
- ఫార్మాకూ సుంకాల ముప్పు!?
- ప్రస్తుతానికి మినహాయింపు
- భవిష్యత్తులో తప్పదన్న ట్రంప్

12

మచిలీపట్నం/ఆకివీడు రూరల్/పాలకొల్లు/కలిదిండి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ ఎగుమతులపై భారీగా సుంకాలు విధించడం ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా ఆక్వా రంగంపై ఇప్పటికే భారీదెబ్బ పడింది. సుంకాల దెబ్బకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ఆక్వా రైతులు అల్లాడిపోతున్నారు. ఈ నెల7 నుంచి అమల్లోకి వచ్చిన 25% సుంకాల దెబ్బకే విలవిలలాడుతున్న

మిగతా 12వ పేజీలో...

15న పుతిన్‌తో భేటీ అవుతున్నా

- పుతిన్, జెలెన్‌స్కీ శాంతి కోరుకుంటున్నారు
- ఇరు దేశాల మధ్య భూభాగాల మార్పిడి: ట్రంప్

అనుబంధానికి బ్రేక్!

- ఈసారి కేటీఆర్‌కు రాఖీ కట్టని కవిత
- 'అన్నా.. రాఖీ కట్టేందుకు ఇంటికి రానా'.. ఒక రోజు ముందే కేటీఆర్‌కు కవిత మెసేజ్
- 'నేను ఔట్ ఆఫ్ స్టేషన్' అంటూ కేటీఆర్ రిప్లై
- ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్‌కు రాఖీలు కట్టిన ఆయన సోదరీమణులు

3



కేసీఆర్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి లక్ష్మీబాయి

హృదయం.. జర పైలం

గుండెజబ్బుకు.. ముందస్తు హెచ్చరికలు

- పలు సంకేతాలను ఇచ్చే శరీరం.. వాటిని గమనించి అప్రమత్తం కాకపోతే ముప్పు
- కడుపు, ఛాతీలో నొప్పి, మంట..
- నడిచినా, మెట్లెక్కినా ఆయాసం
- గుండెలో ఇన్ఫెక్షన్‌తో తీవ్ర జ్వరం
- గ్యాస్ట్రిక్ సమస్య అనుకుని నిర్లక్ష్యం చేయొద్దు
- సొంత వైద్యంతో ముప్పు: వైద్య నిపుణులు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బు.. గుండె పోటు..! ఒకప్పుడు నడివయసు దాటిన తర్వాత వచ్చే హృదయ సంబంధ రుగ్మతలు ఇప్పుడు చిన్న వయసు వారినీ వదిలిపెట్టట్లేదు. పట్టుమని మూడు పదులు కూడా దాటని యువత గుండెపోటుతో చనిపోతున్న ఉదంతాలు ఇటీవల పెరుగుతున్నాయి. పనిభారం, మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం.. కాలంతో పాటు పరుగులు తీసేలా వృత్తి, ఉద్యోగాలకు అంకితమవ్వడం వంటివి యువతలో గుండెపోటుకు

మిగతా 2వ పేజీలో...

కాస్ట్‌లీ.. గురూ..



ఇకపై ఐసీఐసీఐ కనీస బ్యాలెన్స్ రూ.50 వేలు

- పట్టణాల్లో కొత్త సేవింగ్స్ ఖాతాలకు వర్తింపు
- చిన్న పట్టణాల్లోనైతే రూ. 25 వేలు
- జన్‌ధన్ ఖాతాలు ఎప్పట్లాగే జీరో బ్యాలెన్స్

10

డిస్కౌంట్ సేల్



సంపుగ వేళ రైల్వే బంపర్ ఆఫర్

- రానూపోనూ టికెట్ బుక్ చేస్తే తిరుగు ప్రయాణంపై 20% తగ్గింపు
- అక్టోబరు 13-26 జర్నీ, 17 నవంబరు-డిసెంబరు 1 రిటర్న్ జర్నీలకు వర్తింపు

10

7 ఇంజిన్లు.. 354 వ్యాగన్లు!

- దేశంలోనే అత్యంత పొడవైన గూడ్స్ రైలు 'రుద్రాస్త్ర'.. 4.5 కిలోమీటర్ల పొడవు
- ప్రారంభించిన భారతీయ రైల్వే

10

చిరంజీవ

ఆయుష్షు పోస్తున్న అవయవదానం

- రాష్ట్రంలో 12 ఏళ్లలో 6,309 అవయవ మార్పిళ్లు
- 2024లో దేశంలోనే అగ్రస్థానం
- తెలంగాణలో సగటున ప్రతి 10 లక్షల మందిలో 4.88 మంది దాతలు
- జాతీయ సగటు.. కోటికి 8 మంది మాత్రమే

14

గ్రీన్ ఎనర్జీ

పంచాయతీ-సచివాలయం దాకా సౌర విద్యుత్ ప్లాంట్లు

- పెద్దఎత్తున సోలార్ పవర్ ఉత్పత్తికి చర్యలు
- వేగిరంగా 'ఇందిర సౌర గిరిజల వికాసం'
- కలెక్టర్లకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

14

పుస్తకాలు చూసి సర్జరీలు చేయవద్దు!

- పూర్తి అనుభవం వచ్చాకే చేయాలి
- లేకపోతే పేషంట్లకు ఇన్ఫెక్షన్లు, ఇతరత్రా సమస్యలు
- ఇతర ఆపరేషన్లకు సౌందర్య శస్త్రచికిత్సలకు తేడా ఉంది
- అందాన్ని మెరుగుపర్చాలేగానీ చెడగొట్టొద్దు
- ప్లాస్టిక్ సర్జన్లకు డాక్టర్ సంజయ్ పరాశర్ పిలుపు
- హైదరాబాద్‌లో 'సేఫ్ ప్లాస్ట్-2025' సదస్సు ప్రారంభం



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చూసి శస్త్రచికిత్సలు చేయవద్దని, పూర్తిస్థాయిలో అనుభవం వచ్చిన తర్వాతే చేయాలని ప్లాస్టిక్ సర్జన్లకు దుబాయికి చెందిన సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సంజయ్ పరాశర్ పిలుపునిచ్చారు. 'మిగిలిన విభాగాలలో చేసే చికిత్సలు వేరు. ప్లాస్టిక్ సర్జన్లు, డెర్మటాలజిస్టులు చేసే చికిత్సలు వేరు. కాస్త అందంగా కనపడాలని, ఉన్న లోపాన్ని సరిచేయించుకోవాలని వచ్చే వాళ్లకు మనం పూర్తి సంతృప్తి ఇవ్వగలగాలి. అంతేతప్ప ఉన్నదాన్ని మరింత చెడగొడితే ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయి. చికిత్స తర్వాత ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అవి రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా లైపోసక్షన్, కాస్మొటిక్ శస్త్రచికిత్సలు, ముక్కు, గడ్డం, బుగ్గలు వంటివి సరిచేయించుకునే చికిత్సలు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటివి చాలా సున్నితమైనవి. వీటి విషయంలో రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి' అని సూచించారు. హైటెక్ సిటీలోని టీ-హబ్ వేదికగా రెండురోజుల పాటు జరిగే 'సేఫ్ ప్లాస్ట్-2025 సదస్సు' శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్ పరాశర్ ప్రసంగించారు. ప్లాస్టిక్, ఈస్థటిక్ సర్జరీలు చాలా సంక్లిష్టమైనవని, నూటికి నూరుశాతం కృషిచేసినా కూడా కొన్ని సందర్భాల్లో అనుకోని అవాంతరాలు ఎదురవుతాయన్నారు. సమగ్రమైన అనుభవం ఉంటేనే వాటిని అధిగమించగలమని, కేవలం పుస్తకజ్ఞానంతో సాధ్యం కాదని హితవు పలికారు. డాక్టర్ గురుకర్ణ వేముల మాట్లాడుతూ.. ఈ చికిత్సలు చేయించుకోవడానికి ముందు సరైన వైద్యులు, ఆస్పత్రుల గురించి పేషంట్లు సమాచారం సేకరించి ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవాలన్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లాంటివాటిలో నమోదయ్యారా అన్నది సరిచూసుకోవాలని సూచించారు. తగిన శిక్షణ లేని వాళ్ల చికిత్సలు చేయడం వల్ల పలురకాల సమస్యలు వస్తున్నాయన్నారు. సౌందర్య శస్త్రచికిత్సల గురించి మనదేశంలో వైద్యులకు ఇంకా శిక్షణ మెరుగుపడాలని, శిక్షణ కార్యక్రమాలు పెంచాలని సూచించారు. ప్లాస్టిక్ సర్జరీ చేసేటప్పుడు అనుక్షణం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

'గిరిజన' ఉపాధ్యాయులకు బదిలీలు!

- పదోన్నతులూ చేపట్టేందుకు కసరత్తు
- ప్రభుత్వానికి వివరాలు అందజేసిన గిరిజన సంక్షేమశాఖ

హైదరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఖాళీలు, ఉపాధ్యాయుల వివరాలను ప్రభుత్వానికి పంపింది. నారాయణపేట్ జిల్లా మినహా రాష్ట్రంలో గిరిజన విద్యార్థులకు 323 ఆశ్రమ పాఠశాలలు, 136 ప్రీ మెట్రిక్ వసతి గృహాలున్నాయి. ఆశ్రమ పాఠశాలల్లో లక్షమందికిపైగా గిరిజన విద్యార్థులు చదువుతుండగా.. ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లో 45 వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాలల్లో 157 మంది పీజీహెచ్‌ఎంలు, దాదాపు 1200 మంది వరకు స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ), మరో 2300 మంది వరకు సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)లు పనిచేస్తున్నారు. వీరికి మిగిలిన ఉపాధ్యాయులతో కాకుండా ప్రత్యేకంగా పదోన్నతులు, బదిలీలను నిర్వహిస్తారు. స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నవారికి పీజీహెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించనున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టేవాళ్లు. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పీజీహెచ్‌ఎంలుగా పదోన్నతులు, వారి బదిలీలను కమిషనరేట్ పరిధిలోకి తీసుకొచ్చింది. మిగిలిన క్యాడర్ ఎస్ఏ, ఎస్జీటీల బదిలీలను జిల్లా కలెక్టర్లే నిర్వహించనున్నారు. పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన వివరాలతో కూడిన ఫైల్‌ను గిరిజన సంక్షేమశాఖ అధికారులు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వ అనుమతి రాగానే.. గతేడాదిలో మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆగస్టులోనే షెడ్యూల్ ఖరారు చేసుకుని గిరిజన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి.. బదిలీలను నిర్వహించనున్నారు.

గుండెజబ్బుకు ముందస్తు హెచ్చరికలు

(మొదటిపేజీ తరువాయి)



కారణాలుగా వైద్యులు చెబుతున్నారు. అయితే.. ఇదేమీ అకస్మాత్తుగా జరిగిపోదని.. అలసిన గుండె ఆగిపోవడానికి ముందు శరీరం పలు హెచ్చరికలు జారీ చేస్తుందని.. వాటిని పెడచెవిన పెడితే ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జిమ్‌లో ట్రెడ్‌మిల్‌పై నడుస్తూనే కుప్ప కూలిపోవడం.. బ్యాడ్మింటన్ ఆడుతూ ఉన్నఫళంగా పడిపోవడం.. కన్నడ సినీనటుడు పునీత్ డెడ్‌లిఫ్ట్ చేస్తూ చనిపోవడం వంటి ఘటనలు.. శరీరం ఇచ్చే సంకేతాలను నిర్లక్ష్యం చేయడం వల్ల జరిగినవేనని చెబుతున్నారు.

ఇవీ సంకేతాలు..

గుండెపోటు రావడానికి ముందు చాలా సంకేతాలు కనిపిస్తాయని.. విపరీతమైన నీరసం వాటిలో ప్రధాన లక్షణమని వైద్యులు చెబుతున్నారు. ఆ నీరసం రోజంతా కష్టపడి పనిచేయడం వల్లనో, పని ఒత్తిడితో అలసిపోవడం వల్లనో వచ్చిందని భావిస్తారని, కానీ అది గుండె పోటుకు కూడా సిగ్నల్ కావొచ్చని పేర్కొన్నారు. నీరసంతోపాటు.. కడుపులో మంట.. ఛాతీ నొప్పి, కళ్లు మసకబారడం, ఆయాసం, బీపీ తగ్గడం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యుల వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారు. రక్తంలో క్రమంగా కాల్షియం పెరిగి, గడ్డ కట్టి రక్తనాళాలు బ్లాక్ అవ్వడంతో కొందరిలో గుండె వైఫల్యం సంభవిస్తుందని.. ఇలా రక్తనాళాలు బ్లాక్ అవుతుంటే.. కడుపులో మంట, ఛాతీ నొప్పి వస్తాయని వైద్యులు వివరించారు. చాలా మంది దీన్ని గ్యాస్ట్రిక్ సమస్యగా భావించి.. సొంత వైద్యం చేసుకోవడమో.. మెడికల్ దుకాణానికి వెళ్లి మందులు తీసుకోవడమో చేస్తుంటారని.. మరికొందరైతే సోడా, శీతల పానీయాలతో సరిపెట్టుకోవడానికి ఇష్టపడతారని, అలా 7-8 నెలల పాటు పట్టించుకోకుండా ఉంటే.. ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పరీక్షలు తప్పనిసరి

వయసుతో సంబంధం లేకుండా.. పై లక్షణాలు కనిపించినవారు వైద్యులను సంప్రదించి ఈసీజీ, 2డి ఎకో వంటి పరీక్షలు చేయించుకోవాలని హృద్రోగ నిపుణులు చెబుతున్నారు. 40-45 ఏళ్లు దాటినవారు తప్పనిసరిగా ఈ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. కొంత మందిలో గుండె నొప్పికి సంబంధించిన లక్షణాలు పైకి కనిపించవని, అలాంటి వారి గుండె కవాటాల్లో ఇబ్బందులు ఉంటాయని వివరించారు. ఈ పరీక్షలు చేయించుకోవడం వల్ల గుండె పనితీరును తెలుసుకోవచ్చని, గుండెలో విద్యుత్తు ప్రేరేపణలు అసాధారణంగా ఉంటే హృదయ స్పందనలు ఎక్కువగా ఉంటాయని గుర్తుచేస్తున్నారు. దీంతో ఉన్నఫళంగా హృదయ స్పందనలు పెరిగి.. మరణానికి దారి తీస్తుందని చెబుతున్నారు. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికోసారైనా లిపిడ్ ప్రొఫైల్, హెచ్‌బీఏ1సీ వంటి పరీక్షలు తప్పనిసరి గా చేయించుకోవాలని.. ఎప్పటికప్పుడు రక్తపోటును చెక్ చేసుకుని అదుపులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. అధిక రక్తపోటును, మధుమేహాన్ని నియంత్రణలో పెట్టుకోవడం ద్వారా గుండెజబ్బులకు దూరంగా ఉండొచ్చని వివరిస్తున్నారు.

ఈ లక్షణాలుంటే.. జాగ్రత్తపడాలి



గుండెపోటుకు ముందు ఆయాసం రావడం, బీపీ తగ్గడం వంటి సంకేతాలు కనిపిస్తాయి. గుండెలో ఇన్ఫెక్షన్ ఉంటే తీవ్ర జ్వరం వస్తుంది. కడుపు, ఛాతీలో నొప్పి ఉంటుంది. ఛాతీలో నొప్పి ఇతర భాగాలకు పాకుతుంది. కొందరికి ఎడమ చేతి వద్ద ఒక చోట నొప్పి మొదలై.. మెల్లిగా ఇతర ప్రాంతాలకు విస్తరిస్తుంది. మరికొందరిలో చెమటలు బాగా పడతాయి. ఇంకొందరిలో.. మెట్లు ఎక్కినా, కొద్ది దూరం నడిచినా ఆయాసం వస్తుంది. ఉదయం పూట ఆయాసం, అకస్మాత్తుగా కళ్లు మసకబారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే కార్డియాలజిస్టును సంప్రదించాలి.

- డాక్టర్ రాజేశ్ దేశ్‌ముఖ్, కార్డియోథోరాసిక్, వ్యాస్కులర్ సర్జన్, కామినేని ఆస్పత్రి

గ్యాస్ట్రిక్ సమస్యగా భావించి..




ఓ పేషెంట్ వయసు 37 ఏళ్లు.. కడుపులో మంట వస్తుండడంతో గ్యాస్ట్రిక్ సమస్యగా భావించాడు. పది రోజులు గడిచినా పరిస్థితిలో మార్పులేకపోవడంతో మా దగ్గరకు వచ్చాడు. పరీక్షలు చేయగా అతనికి పెద్ద స్థాయిలో గుండెపోటు వచ్చిందని నిర్ధారణ అయ్యింది. అతనికి అవసరమైన చికిత్స అందించాం. గుండెపోటు అంటే.. చాలా మంది తీవ్రమైన నొప్పి అని, చాలా సేపు వస్తుందని భావిస్తారు. చిన్న నొప్పులను నిర్లక్ష్యం చేస్తారు. గుండె నొప్పి లక్షణాలు ఏ రూపంలో అయినా రావచ్చు. ఒకటి, రెండు నిమిషాలు వచ్చి తగ్గిపోవచ్చు. దాని ప్రభావం మాత్రం గుండెపై తీవ్రంగా ఉంటుంది. ఛాతీలో పట్టేసినట్లు అనిపించడం, ఆయాసం, గుండెదడ, నాలుగు అడుగులు వేయలేక ఇబ్బంది పడడం వంటి లక్షణాలను గుండె నొప్పి సిగ్నల్స్‌గా భావించాలి.

- డాక్టర్ శివప్రసాద్, చీఫ్ ఇంటర్వెన్షల్ కార్డియాలజిస్ట్, వన్ కార్డియాక్ సెంటర్ ఆస్పత్రి

రేపు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

- తల్లిదండ్రులు చొరవతీసుకోవాలి: దామోదర



హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలో 1-19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయనున్నట్లు వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఈ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. చిన్నారుల పేగుల్లో ఉండే నులిపురుగులను నివారించి, వారిలో రక్తహీనతను అధిగమించేందుకు, రోగ నిరోధకశక్తి పెంపొందించేందుకు ఈ మాత్రలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 1-19 సంవత్సరాల వయసున్న పిల్లలందరూ నులిపురుగుల నివారణ మాత్ర వేసుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని కోరారు. మరోవైపు ఈ మాత్రల పంపిణీ కోసం వైద్య ఆరోగ్య శాఖ ఇప్పటికే అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 96,17,111 మంది పిల్లలకు ఈ మాత్రలను వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

లోకం తీరు



రాజకీయాలు వద్దనుకుంటున్నా..!

- బీఆర్ఎస్‌లోనే ఉన్నా.. ఇక ఏవైపు చూసే పరిస్థితి లేదు : మల్లారెడ్డి

బోయినపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇక రాజకీయాలు వద్దనుకుంటున్నానని.. ఇక ఏ పార్టీ వైపు కూడా చూసే పరిస్థితి లేదని చెప్పారు. 'రాజకీయంగా బీజేపీ వైపా.. తెలుగుదేశం వైపా కాదు.. బీఆర్ఎస్‌లోనే ఉన్నాను. నాకు ఇప్పుడు 73 ఏళ్లు. నేనిప్పుడు ఏ వైపు చూసేటట్టు లేదు. ఎంపీగా, మంత్రిగా చేశాను. మరో 3 ఏళ్లు ఎమ్మెల్యేగా కొనసాగుతాను. ఇక రాజకీయాలు వద్దనుకుంటున్నా.. ప్రజా సేవ చేసేందుకు వర్సిటీ, కాలేజీలు నడిపిద్దామనుకుంటున్నా..' అని వ్యాఖ్యానించారు. రాఖీ వేడుకల అనంతరం మల్లారెడ్డి మాట్లాడారు. తన జీవితంలో రాఖీ పండగ ప్రత్యేకమని, రాఖీ రోజే తన తొలి ఇంజనీరింగ్ కాలేజీని ప్రారంభించి పాల మల్లారెడ్డిని కాస్తా విద్యావేత్తగా ఎదిగానని చెప్పారు. దేశవ్యాప్తంగా డీమ్డ్ వర్సిటీలు, ఆస్పత్రులు స్థాపించి పేద ప్రజలకు విద్య, వైద్యాన్ని అందించే దిశగా కృషి చేస్తున్నానన్నారు. ఈ రాఖీ పండగ రోజున అందరికి అందుబాటులో ఉండే విధంగా వన్ హెల్త్ పేరిట మెడికల్ షాప్‌లు, అంబులెన్సులను ప్రారంభిస్తున్నామని తెలిపారు.

ట్యాపింగ్ కేసులో కవితను విచారించాలి

(మొదటిపేజీ తరువాయి)



నోటీసులతో బెదిరించాలనుకుంటున్నారని తెలిపారు. తాను నోటీసులు ఇస్తూ పోతే తండ్రీ కొడుకులిద్దరూ జీవితాంతం జైలులోనే ఉంటారని అన్నారు. కేసీఆర్ చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశామని రాధాకిషన్‌రావు వాంగ్మూలం ఇచ్చారని సంజయ్ చెప్పారు. టెలికం రెగ్యులేటరీ అథారిటీ నిబంధనలను ఉల్లంఘించి కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసిందని ఆరోపించారు. కేంద్ర హోం శాఖకు కేసీఆర్ తప్పుడు సమాచారమిచ్చి ఎస్ఐబీ చీఫ్‌గా ప్రభాకర్‌రావును నియమించారని తెలిపారు. మావోయిస్టుల పేరు చెప్పి రాజకీయ ప్రముఖులు, సినీ తారలు, వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేశారని.. ఆ డేటాతో బ్లాక్ మెయిల్ చేసి వసూళ్లకు పాల్పడ్డారని సంజయ్ మండిపడ్డారు. ఆ డబ్బుల లావాదేవీలు వెలుగులోకి రావాలంటే ఈడీ విచారణతోనే సాధ్యమవుతుందని అన్నారు. జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు సిట్ ఆధారాలతో సహా వెల్లడించిందని చెప్పారు. జడ్జీలను పిలిచి స్టేట్‌మెంట్ రికార్డు చేసే అధికారం సిట్‌కు ఉందా..? అని ప్రశ్నించారు. సిట్ పరిధి పరిమితమైందని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల ఫోన్లను గత ప్రభుత్వం ట్యాప్ చేసిందని అన్నారు. ఆ ఆధారాలు సిట్ వద్ద ఉన్నాయని, అలాంటప్పుడు సీఎంకు నోటీసులిచ్చి విచారణకు రమ్మని ఆదేశించే సాహసం సిట్ చేయగలదా..? అని ప్రశ్నించారు. కేంద్ర సంస్థలు నేరుగా ఈ అంశంపై విచారణ జరిపే అవకాశం లేదన్నారు. అందుకే తాము సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తున్నామని అన్నారు. సిట్ అధికారులపై నమ్మకం ఉంది కాని, రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం లేదన్నారు. కేంద్ర హోం శాఖ నిబంధనల ప్రకారం ఫోన్ ట్యాపింగ్‌కు సబంధించి సేకరించిన డేటాను ఏటా జనవరి, జూన్‌లో ధ్వంసం చేయాలని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ఏళ్ల తరబడి వేలాది మంది ఫోన్లను ట్యాప్ చేసి ఆ డేటాను భద్రపరచుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయాక నవంబరు, డిసెంబరు నెలల్లో ఆ డేటాను ధ్వంసం చేసిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం, రోషం ఉంటే ఆ పార్టీని వదిలి బయటకు రావాలన్నారు. ఆనాడు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సహా అందరి ఫోన్లు ట్యాప్ చేశారని సంజయ్ మండిపడ్డారు.

విద్యుత్ కమిషన్ నివేదిక ఏమైంది..?

బీఆర్ఎస్ పదేళ్ల అవినీతికి కాంగ్రెస్ ప్రభుత్వం రక్షగా నిలుస్తోందని సంజయ్ విమర్శించారు. ఒకరికొకరు అవినీతి, దోపిడీలకు రక్షగా నిలుస్తూ ప్రజలను వంచిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను క్యాబినెట్‌లో చర్చించిన రేవంత్ ప్రభుత్వం.. విద్యుత్ కొనుగోళ్ల కమిషన్ నివేదికను క్యాబినెట్‌లో ఎందుకు చర్చించలేదన్నారు. పెద్దఎత్తున వాటాలు ముట్టినందునే కమిషన్ నివేదిక గురించి పెదవి విప్పడం లేదని మండిపడ్డారు. కాళేశ్వరం అవినీతిపై ఎన్డీఎస్ఏ, విజిలెన్స్, జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికలు ఇచ్చాయన్నారు. దీనిపై క్యాబినెట్‌లో చర్చ కూడా జరిగిందని, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.

నేడు బీజేపీలోకి గువ్వల

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆదివారం బీజేపీలో చేరనున్నారు. ఇటీవలే ఆయన బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఉదయం 11 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు సమక్షంలో ఆయన కాషాయ గూటికి చేరనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

'సృష్టి' మోసాలు.. 10 కేసులు నమోదైనా..
పట్టించుకోని పోలీసులు

- ఆ అలసత్వంతో జోరుగా నమ్రత అక్రమాలు
- తెలుగు రాష్ట్రాల్లో కేసులను.. పరిశీలిస్తున్న హైదరాబాద్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సృష్టి ఫర్టిలిటీ క్లినిక్‌పై గతంలోనే 10 దాకా కేసులు నమోదైనా.. పోలీసులు పట్టించుకోకపోవడంతోనే నమ్రత అరాచకాలు పెరిగిపోయినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. పిల్లలు లేని దంపతులను లక్ష్యంగా చేసుకొని సరగసి పేరుతో డాక్టర్ నమ్రత సృష్టించిన అరాచకాలను చూసి పోలీసులే అవాక్కవుతున్నారు. సికింద్రాబాద్ గోపాలపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్న సృష్టి ఫర్టిలిటీ మోసం కేసులో అనేక అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. సృష్టి ఫర్టిలిటీపై గతంలోనే కేసులు నమోదైనా.. ఏడేళ్ల క్రితమే సృష్టి క్లినిక్ లైసెన్స్‌ను వైద్యాధికారులు రద్దు చేసినా.. నమ్రత అరాచకాలు ఆగలేదు. ఈ చర్యలతో సృష్టి మోసాలకు కొంత వరకు తెరపడ్డా.. ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌కు మకాం మార్చిన నమ్రత.. అక్కడ కార్యకలాపాలను కొనసాగించారు. అక్కడ కూడా ఆమెపై కేసులు నమోదవ్వగా.. కొవిడ్ సమయంలో పోలీసులను మేనేజ్ చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. దాంతో నమ్రత విజయవాడ, నెల్లూరుతోపాటు.. కర్నాటక, ఒడిసా, కోల్‌కతాల్లోనూ బ్రాంచిలను ఏర్పాటు చేసి.. అక్రమాల దందాను కొనసాగించారు. ఎక్కడికక్కడ ఏజెంట్లను నియమించుకుని.. టెస్ట్‌ట్యూబ్, సరగసిపై ఆన్‌లైన్, సోషల్ మీడియాల్లో విస్తృతంగా ప్రచారం చేసుకునేవారు.

అప్పుడే స్పందించి ఉంటే..

సృష్టిలో నమ్రత అక్రమాలపై రెండు తెలుగు రాష్ట్రాల్లో నమోదైన కేసులను పోలీసులు, వైద్యాధికారులు పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. అప్పట్లోనే నమ్రతపై చర్యలు తీసుకుని ఉంటే.. అక్రమాలకు ఎప్పుడో తెరపడి ఉండేదని తెలుస్తోంది. దీంతో హైదరాబాద్ పోలీసులు విశాఖలోని మహారాణిపేట, టూటౌన్, గుంటూరు, హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ, గోపాలపురం ఠాణాల్లో నమోదైన కేసులపై దృష్టి సారించినట్లు తెలిసింది. ఆయా కేసుల్లో ఫిర్యాదుదారులతో మాట్లాడి.. ఈ కేసులో బలమైన ఆధారాలను సేకరించనున్నట్లు సమాచారం.

వైజాగ్ కేంద్రమే కీలకం

తెలంగాణలో క్లినిక్ లైసెన్సు రద్దవ్వడంతో నమ్రత ఇతర ప్రాంతాల్లోనే తనదందాపై దృష్టి సారించేవారు. సికింద్రాబాద్‌లో దంపతులకు కేవలం కౌన్సెలింగ్ ఇచ్చేవారు. వైజాగ్‌లోనే అంతా జరిగేది. విశాఖకు దంపతులను తీసుకెళ్లి.. అక్కడ వీర్యం, అండాలను సేకరించేవారు. దాన్ని సరగసి తల్లి గర్భంలోకి చేర్చి, ఆమె నిర్వహణ ఖర్చుల పద్దులను చూపిస్తూ.. అంతా సవ్యంగానే జరుగుతోందని నమ్మబలికేవారు. ఒప్పందం ప్రకారం.. 9 నెలల తర్వాత ఆ దంపతులకు చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాల నుంచి కొనుగోలు చేసే శిశువులను అంటగట్టేవారు. ఇలా ఇప్పటి వరకు 80 మంది శిశువులను సరగసి పేరుతో పిల్లల్లేని దంపతులకు అంటగట్టినట్లు సమాచారం.



ఇంద కట్టుకో.. హెల్మెట్టు పెట్టుకో

కొత్తపేట (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ పెట్టుకోకుండా బైక్ తోలొద్దు సోదరా.. అంటూ వాహనదారులకు సందేశాన్నిచ్చారు ఆ ట్రాఫిక్ మహిళా కానిస్టేబుళ్లు! హెల్మెట్టు లేని బైకర్లను గుర్తించి.. ఆపి వారి చేతికి రాఖీ కట్టారు. హెల్మెట్ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే కొన్నిసార్లు అది కుటుంబసభ్యులకు శరాఘాతం అవుతుందని.. తప్పకుండా శిరస్త్రాణం ధరించాలంటూ రాఖీ కడుతూ చెప్పారు. ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో అల్కాపురి చౌరస్తాలో ఈ వినూత్న అవగాహన కార్యక్రమం స్థానికులను ఆకట్టుకుంది.

40ఏళ్లకు అన్నకు రాఖీ



కథలాపూర్, (ఆంధ్రజ్యోతి): ఆమె మాజీ మావోయిస్టు. నలభై ఏళ్ల తర్వాత తొలిసారిగా అన్నకు రాఖీ కట్టి మురిసిపోయింది. ఆమే జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం సిరికొండకు చెందిన పసుల వసంత. ఆమె నలభై ఏళ్లు దండకారణ్యంలో ఉన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యురాలిగా, బస్తర్ డివిజన్ ఇన్‌చార్జిగా పనిచేశారు. అనారోగ్య సమస్యల కారణంగా ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌లో పోలీసుల ఎదుట లొంగిపోయారు. శనివారం పండుగ సందర్భంగా అన్న బత్తుల రాజంకు ఆమె రాఖీ కట్టారు. ఇక... ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా ఎర్రబోరు గ్రామంలో మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోతే.. అక్కడే వారి స్మృత్యర్థం ఐదేళ్ల క్రితం విగ్రహాలు పెట్టారు. జవాన్ల విగ్రహాలకు వారి సోదరీమణులు పండుగ సందర్భంగా రాఖీ కట్టారు.



రాఖీ.. రైట్ రైట్!

డ్యూటీలో ఉన్నాను.. ప్చ్.. రాఖీ సంబురానికి దూరమయ్యానే అన్న దిగులు ఆ ఆర్టీసీ డ్రైవర్‌కు దూరమైంది. ఆయన చెల్లెలే బస్టాండ్‌కు వచ్చి.. అన్న నడుపుతున్న బస్సు కోసం ఎదురుచూసి మరీ రాఖీ కట్టింది. నారాయణ అనే డ్రైవర్‌దీ కొండత సంతృప్తి. ఆయన కామారెడ్డి డిపోలో పనిచేస్తున్నారు. సోదరి మెదక్ జిల్లా రామయంపేటలో ఉంటున్నారు. డ్యూటీలో భాగంగా నారాయణ రామాయంపేట మీదుగా వెళుతున్నాడని తెలుసుకొని ఆమె అక్కడి బస్‌స్టాండ్‌కు వెళ్లారు. అన్న రాగానే ఆమె ఆయనకు బొట్టు పెట్టి రాఖీ కట్టారు. ఇదీ కదా.. అన్నాచెల్లెళ్ల అనురాగం అంటూ ప్రయాణికులు భావోద్వేగానికి గురయ్యారు.




రాంచందర్‌రావు, కిషన్‌రెడ్డికి రాఖీ కడుతున్న మేకల శిల్పారెడ్డి

ఈ బంధం నిర్వచించలేనిది!

సీతక్కతో నా అనుబంధం ప్రతి రాఖీ పండుగ రోజు మరింతగా వికసిస్తుంది

- ఎక్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావోద్వేగం
- సీఎంకు, ఆయన మనుమడికి రాఖీలు కట్టిన సీతక్క
- సీఎంకు రాఖీ కట్టిన కొండా సురేఖ, గీతారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహిళా మంత్రులు సీతక్క, కొండా సురేఖ, మాజీ మంత్రి గీతారెడ్డి రాఖీలు కట్టారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వెళ్లి ఆయన నుదుటన తిలకం దిద్ది రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్తలు, బ్రహ్మకుమారీ సంస్థలకు చెందిన మహిళలు రాఖీ కట్టేందుకు తరలిరావడంతో సీఎం నివాసం సందడిగా మారింది. మంత్రి సీతక్క సీఎం మనుమడికి కూడా రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సీతక్కకు రేవంత్ నూతన వస్త్రాలు బహూకరించారు. అనంతరం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. "అక్షరాలతో రచించలేనిది.. మాటలతో నిర్వచించలేనిది.. సీతక్కతో నా అనుబంధం! ప్రతి రాఖీ పౌర్ణమి రోజు ఆ బంధం మరింతగా వికసిస్తూనే ఉంటుంది" అని రేవంత్ పోస్టు పెట్టారు. కాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్‌కు కూడా సీతక్క రాఖీలు కట్టారు. మంత్రి తుమ్మలకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు. ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మహిళా కానిస్టేబుళ్లు రాఖీలు కట్టారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నంకు మహిళా కార్యకర్తలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కాగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి ఆధ్వర్యంలో మహిళా నేతలు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ విదేశీ వస్తువులకు స్వస్తి పలికి స్వదేశీ ఉత్పత్తులను మరింతగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణకు చెందిన విద్యార్థినులు రాష్ట్రపతి ముర్ముకు రాఖీ కట్టారు. రాష్ట్రపతిభవన్ ఆహ్వానం మేరకు దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల నుంచి 31 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి హైదరాబాద్ మలక్‌పేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు శశినందిత, హర్షిత, రాధిక, భవాని.. పెద్దపల్లి జిల్లా అంతర్గావ్ కేజీబీవీ విద్యార్థులు అమూల్య, అక్షర, ఈ. సహస్ర, సౌమ్య, బి.సహస్రతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తనకు రాఖీ కట్టిన బాలికలకు ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. వారికి బహుమతులు అందించారు.

ఆ అనుబంధానికి బ్రేక్!

- ఈసారి అన్న కేటీఆర్‌కు రాఖీ కట్టని కవిత
- కేసీఆర్‌కు రాఖీలు కట్టిన సోదరీమణులు


రాఖీ కట్టిన సోదరీమణులతో కేసీఆర్, ఆయన సతీమణి శోభ

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి రాఖీ పండుగకు సోదరుడు కేటీఆర్‌కు రాఖీ కట్టి.. ఆయన్నుంచి ఆశీర్వాదం తీసుకొని అభిమానాన్ని చాటుకునే కల్వకుంట్ల కవిత ఈసారి సంప్రదాయానికి బ్రేక్ చెప్పారు. ఈసారి కేటీఆర్‌కు ఆమె రాఖీ కట్టలేదు. ఈ విషయంపై సామాజిక మాధ్యమాల్లో తెగ చర్చ నడుస్తోంది. ఈ అంశంపై కవిత వర్గీయులు మరో విధంగా స్పందించారు. పండుగకు ఒకరోజు ముందే.. అంటే శుక్రవారమే 'అన్నా.. రాఖీ కట్టేందుకు నేను ఇంటికి రానా!' అని కేటీఆర్‌కు కవిత మెసేజ్ చేశారని చెబుతున్నారు. కేటీఆర్ మాత్రం శుక్రవారం తన ఇంటి నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ రాఖీ వేడుకలు జరగ్గా.. లగచర్ల గిరిజన మహిళలు ఆయనకు రాఖీ కట్టారు. అనంతరం అక్కడి నుంచి కేటీఆర్ నేరుగా బెంగళూరు చేరుకున్నారు. ఆ తర్వాత కవిత పంపిన మేసేజ్‌కు ఆయన రిప్లై ఇచ్చినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. 'నేను అవుటాఫ్ స్టేషన్' అంటూ ఆయన కవితకు తిరిగి మేసేజ్ పెట్టినట్లు ఆ వర్గాలు చెబుతున్నాయి. శనివారం కూడా ఆయన హైదరాబాద్‌లో లేరని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లో రాఖీ పండుగ ఘనంగా నిర్వహించినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. అక్కడ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన సోదరీమణులు రాఖీ కట్టారు. అక్కలు లక్ష్మీబాయి, జయమ్మ.. చెల్లెలు వినోదమ్మ కలిసి కేసీఆర్‌కు హారతి పట్టి, రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించారు.



తమ్ముడూ.. నేనున్నాను రా!

- ఎముకమజ్జ దానం చేసి ప్రాణాలు నిలబెట్టిన అక్క
- ఆస్పత్రిలోనే రాఖీ.. కిమ్స్ ఆస్పత్రిలో భావోద్వేగ ఘట్టం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఐదేళ్ల తమ్ముడికి తీవ్ర అనారోగ్య సమస్య వస్తే.. ఇంటర్ చదువుతున్న ఆ అక్క విలవిల్లాడిపోయింది. ఎముక మజ్జ దానం చేసి తమ్ముడికి ప్రాణ దానం చేసింది. పూర్తిగా కోలుకున్న ఆ చిన్నారికి ఆస్పత్రిలోనే రాఖీ కట్టి 'నీకు నేను రక్ష..' అనే పండుగ సందేశాన్ని నిజం చేసింది. మహబూబ్‌నగర్‌కు చెందిన హస్మిత అనే బాలిక, ఎల్‌కేజీ చదువుతున్న తన తమ్ముడైన భరత్ రాంసింగ్ విషయంలో చాటుకున్న అనురాగమిది. కిమ్స్ ఆస్పత్రిలో భరత్ రాంసింగ్‌కు శస్త్రచికిత్స నిర్వహించారు. శనివారం ఆస్పత్రికొచ్చిన హస్మిత వైద్యుల సమక్షంలోనే సోదరుడికి రాఖీ కట్టింది. ఇక.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో పూలమ్మ, జయమ్మ, దేవ, నాగమ్మ నీలమ్మ అనే మహిళలు తమ సోదరుడికి 'చివరిసారిగా' రాఖీ కడుతూ కన్నీళ్లపర్యంతమయ్యారు. వీరి తమ్ముడు యాకన్న(50) అనారోగ్యంతో చనిపోయాడు. ఆయన చేతికి ఐదుగురు సోదరీమణులు రాఖీలు కట్టి కడసారి వీడ్కోలు పలికారు. రాఖీ పండుగ ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. నిర్మల్ జిల్లా బాసరకు చెందిన వర్గంటి సాయిబాబా(19) అక్కతో రాఖీ కట్టుకునేందుకు నిజామాబాద్‌లోని గాజులపేట్‌కు స్కూటీపై వెళ్లాడు. గ్రామానికి తిరిగివస్తుండగా ఓ కంటెయినర్‌ను స్కూటీ ఢీకొనడంతో మృతిచెందాడు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కలకొడిమ గ్రామంలో ఓ మహిళ అన్నకు రాఖీ కట్టేందుకు పుట్టింటికొచ్చి గుండెపోటుతో మృతిచెందింది. మధిర మండలం ఆత్మకూరుకు చెందిన హుస్సేన్‌బీ (52) ఇద్దరు అన్నలకు రాఖీ కట్టేందుకు కలకొడిమకొచ్చింది. పెద్దన్నకు రాఖీ కట్టి.. చిన్నన్న ఇంటికొచ్చి అతడికి రాఖీ కడుతూ కుప్పకూలి మృతిచెందింది.



పచ్చదనానికి రక్షాబంధనం

పెనుబల్లి (ఆంధ్రజ్యోతి): రాఖీ అనుబంధాలు, అనురాగాల సమాహారమే కాదు.. ఇదిగో ఇలా చక్కని సందేశాలకు వారధి కూడా! ప్రకృతిని పరిరక్షిస్తే.. అది మనకు గొడుకు పడుతుందన్న మేసేజ్ ఇచ్చారు ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం బ్రహ్మళకుంట గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన మహిళలు. అడవినే నమ్ముకొని బతికే ఆ మహిళలు, చెట్లనే తోబుట్టువులుగా భావించి రాఖీ కట్టారు. పసుపు, కుంకుమ పెట్టి మొక్కారు. అక్రమంగా చెట్లను నరికేవారు వాటికి ఉన్న రాఖీలను చూసైనా గొడ్డలి వేటు వేయకుండా ఉంటారని అనుకుంటున్నామని ఆ మహిళలు చెప్పారు.

శంషాబాద్‌లో విమాన రాకపోకలకు అంతరాయం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పలు జాతీయ, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాంకేతిక లోపం, వాతావరణం అనుకూలించకపోవడంతో సర్వీసులను ఆలస్యంగా నడపడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. జీఎంఆర్ అధికారుల వివరాల మేరకు.. అబుధాబీ నుంచి రావాల్సిన ఎతిహాద్ విమానం, సింగపూర్ నుంచి రావాల్సిన ఇండిగో విమానం, దుబాయ్ నుంచి రావాల్సిన రెండు విమానాలతో పాటు మరో రెండు అంతర్జాతీయ సర్వీసులు ఆలస్యమయ్యాయి. అలాగే అహ్మదాబాద్ నుంచి రావాల్సిన ఇండిగో విమానం 4 గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.45 గంటలకు శంషాబాద్‌కు చేరుకుంది. ఇక్కడి నుంచి రాజ్‌కోట్‌కు వెళ్లాల్సిన విమానం కూడా ఆలస్యమైంది.

హరిత విప్లవ సారథి స్వామినాథన్: వెంకయ్య

న్యూఢిల్లీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): హరిత విప్లవం సాధించే విషయంలో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ సారథిగా నిలిచారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. పర్యావరణానికి నష్టం కలగకుండా ఉత్పాదకతను పెంచే విధానాలను రూపొందించి దేశ రూపురేఖల్ని మార్చారని కీర్తించారు. ఢిల్లీలో ఎంఎస్ స్వామినాథన్ రీసర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో వెంకయ్య ప్రసంగించారు. వ్యవసాయ శాస్త్రంలో ఏక వ్యక్తి సంస్థగా స్వామినాథన్ వ్యవహరించారని, పర్యావరణాన్ని, సాంకేతికతను మిళితం చేశారని చెప్పారు.

ఎయిర్ ఇండియాలో పైలెట్ల పదవీ విరమణ వయస్సు పెంపు

- పైలెట్లకు 65, ఇతర సిబ్బందికి 60కి పెంపు

ముంబయి, ఆగస్టు 9 : ఎయిర్ ఇండియా పైలెట్ల పదవీ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంచుతూ ఆ సంస్థ నిర్ణయం తీసుకుంది. అలాగే ఇతర సిబ్బంది(నాన్ ఫ్లైయింగ్) పదవీ విరమణ వయస్సును 60 ఏళ్లకు పెంచింది. ఈ రెండు విభాగాల వారి పదవీ విరమణ వయస్సు ప్రస్తుతం 58 ఏళ్లుగా ఉంది. ఈమేరకు ఎయిర్ ఇండియా సీఈవో, ఎండీ కాంప్‌బెల్ విల్సన్ ప్రకటించినట్లు సమాచారం. అయితే దీనిపై ఆ సంస్థ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాగా ఈ నిర్ణయంతో ఎయిర్ ఇండియా పైలెట్ల పదవీ విరమణ వయస్సు విస్తారా ఎయిర్‌లైన్స్ పైలెట్లతో సమానంగా ఉంటుంది. ఎయిర్ ఇండియాలో మొత్తం 24,000 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 3,600 మంది పైలెట్లు. 9,500 మంది క్యాబిన్ క్రూ సిబ్బంది. ఇటీవల కాలంలో కొందరు పైలెట్లు, క్యాబిన్ క్రూ సిబ్బంది ఆ సంస్థను వీడారు. టాటాలు, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌ల జాయింట్ వెంచర్ అయిన విస్తారా ఎయిర్ లైన్స్‌ను 2024 నవంబరులో ఎయిర్ ఇండియాలో విలీనం చేశారు. విస్తారాలో పైలెట్ల పదవీ విరమణ వయస్సు అధికంగా ఉండడంపై ఎయిర్ ఇండియా పైలెట్లు కొందరిలో అసంతృప్తి నెలకొంది.

జంగల్.. జమీన్.. జగడం

పోడు పంటలపై అటవీ అధికారుల కర్కశత్వం.. విషపు మందులు చల్లి పచ్చని పంటలు ధ్వంసం


ఉమ్మడి ఇందూరు జిల్లాలో ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం

కామారెడ్డి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పోడు భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్న అన్నదాతలపై అటవీ అధికారులు కర్కశంగా వ్యవహరిస్తున్నారు. సీజన్ ప్రారంభంలోనే రైతులకు అవగాహన కల్పించి సామరస్యంగా సాగును అడ్డుకోవాల్సింది పోయి.. తీరా పంటలు వేశాక విషపు మందులు చల్లి పచ్చని చేలను ధ్వంసం చేస్తున్నారు. దీంతో తట్టుకోలేక రైతులు ఆత్మహత్యాయత్నం చేస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అటవీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలు, తండాల్లోని అన్నదాతలు ఏళ్లుగా పోడు భూముల్లో పంటలు వేసుకుంటున్నారు. ఏటా వర్షాకాలం రాగానే పోడు, అటవీ భూముల్లో పంటలు సాగు చేయవద్దని అటవీ అధికారులు అవగాహన కల్పిస్తూ వస్తున్నారు. సాగు చేస్తున్న రైతులను అడ్డుకుంటున్నారు. ఈ సీజన్ మొదట్లో అటవీ భూముల్లో పంటలు సాగు చేయకుండా కందకాలు తవ్వడంతో పాటు, ముళ్ల కంచె వేయడం, మొక్కలు నాటడం చేశారు. ఈ సమయంలో అటవీ అధికారులు, రైతుల మధ్య వాగ్వాదం, కొన్ని చోట్ల స్వల్ప ఘర్షణలు జరిగాయి. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం సీతాయిపల్లికి చెందిన మల్లయ్య కొన్నేళ్లుగా పోడు భూముల్లో పంటలు వేసుకుంటున్నాడు. ఈ సీజన్‌లో సుమారు నాలుగు ఎకరాల్లో వరి సాగు చేయగా అందులో మూడు గుంటలు అటవీ పరిధిలో ఉందంటూ ఫారెస్ట్ సెక్షన్ అధికారి పంటకు నిషేధిత గడ్డి మందును చల్లించింది. దీంతో ఆందోళనకు గురైన బాధిత రైతు ఈ నెల 6న గడ్డి మందు తాగాడు. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం బైరాపూర్ అటవీ భూముల్లో ప్రకాశ్ అనే రైతు పంటలను సాగు చేయగా ఈ నెల 5న అటవీ సిబ్బంది విషపు గడ్డి మందులు చల్లించి నాశనం చేశారు. దీంతో బాధిత రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటనపై సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌భాస్కర్‌రావు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేసి, అటవీ అధికారులపై మండిపడ్డారు. చేతికి వచ్చిన పంటపై విషపు మందులు చల్లి నాశనం చేయడం సరికాదన్నారు. పంట వేసే ముందే అధికారులు అడ్డుకోవాల్సిందని చెప్పారు. ఆ రైతులిద్దరూ ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ రెండు ఘటనలపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి, అటవీ అధికారులదే తప్పిదమని తేల్చారు.


నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం బైరాపూర్‌లో మక్కకు విషపుమందు చల్లుతున్న అటవీ సిబ్బందిని అడ్డుకుంటున్న రైతులు

పంటలు సాగు చేసేదాకా ఏం చేస్తున్నట్లు?

అటవీ భూములను కబ్జా చేసి పంటలు సాగు చేయడం తప్పిదమే. పంటలు వేసేముందు ఆ భూములపై అటవీ అధికారులు నిఘా పెట్టి అప్రమత్తంగా ఉండాలి. సీజన్ ముందు అటవీ ప్రాంత గ్రామాల రైతులకు భూముల కబ్జాలపై అవగాహన కల్పించాలి. అయితే కొందరు రైతులు ఆనవాయితీగా ఎప్పటిలాగే ప్రతి సీజన్‌లో పోడు, అటవీ భూముల్లో పంటలు సాగు చేస్తూ వస్తున్నారు. విత్తనాలు చల్లి, నాట్లు వేసి, పురుగు మందులు చల్లి పంట ఎదిగే క్రమంలో అటవీ సిబ్బంది దాడులు చేయడం సరికాదనే విమర్శలు వస్తున్నాయి. అటవీ భూముల్లో రైతులు పంటలు సాగు చేసే వరకు అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో అటవీ భూముల్లో పంటల సాగుకు కొందరు అటవీ సిబ్బంది సహకరించడంతో రైతులు ఆనవాయితీగా సాగు చేస్తున్నారనే వాదన వినిపిస్తోంది. చేతికొచ్చే పంటలపై విషపు మందులు చల్లడం అత్యంత అమానవీయమని పౌర, రైతు సంఘాలు మండిపడుతున్నాయి.



రైళ్లు కిటకిట!

పండుగలు, వరుస సెలవులతో ప్రధానస్టేషన్లలో ప్రయాణికుల రద్దీ

హైదరాబాద్ సిటీ/కొండపాక/చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పండుగలు, శుభ ముహూర్తాలకు వరుస సెలవులు కూడా తోడవడంతో హైదరాబాద్‌లోని ప్రధాన రైల్వేస్టేషన్లు కిటికిటలాడుతున్నాయి. ఆయా స్టేషన్ల మీదుగా దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు ప్రయాణికులు పోటెత్తుతున్నారు. ఏసీ తరగతులతో పాటు స్లీపర్ క్లాస్‌లోనూ రిజర్వేషన్ దొరకకపోవడంతో కొందరు జనరల్ కోచ్‌ల్లో నిలబడే వెళ్తున్నారు. శుక్రవారం వరలక్ష్మి వ్రతం, ఆపై రెండో శనివారం రాఖీ పండుగ, ఆదివారం సెలవు కావడంతో పాటు వచ్చేవారంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం, శనివారం కృష్ణాష్టమి, ఆపై ఆదివారం స్కూళ్లకు, పలు ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలకు సెలవులు వచ్చాయి. దీంతో సొంతూళ్లకు వెళ్లే జనంతో పాటు టెకీలు, కార్పొరేట్ ఉద్యోగులు సెలవులు తీసుకొని తమ కుటుంబీకులతో తరలివెళ్తున్నారు. సికింద్రాబాద్-విశాఖపట్నం మార్గంలో జన్మభూమి, విశాఖ, కోణార్క్, గరీబ్‌రథ్, గోదావరి, ఈస్ట్‌కోస్ట్, గౌతమి ఎక్స్‌ప్రెస్‌లలో రిజర్వేషన్ కోసం ప్రయత్నించిన వారికి గత రెండ్రోజులుగా రిగ్రెట్ బోర్డులే దర్శనమిచ్చాయి. పలు రైళ్లలో ఇదే పరిస్థితి నెలకొనడంతో కొందరు ప్రయాణికులు ప్రైవేటు బస్సులు, అద్దె కార్లు వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తున్నారు. అయితే రైల్వే చార్జీలతో పోల్చితే బస్సుల్లో రెండింతలు, కార్లలో మూడింతల సొమ్ము చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీ

పండుగలు, వరుస సెలవులతో పలు టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీ పెరిగింది. శనివారం రాఖీ పండుగ నేపథ్యంలో సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ టోల్ ప్లాజా వద్ద సాయంత్రం వాహనాలు బారులుదీరాయి. హైదరాబాద్ నుంచి సిద్దిపేట, కరీంనగర్ వైపు వెళ్లే వారి వాహనాలు పెద్ద సంఖ్యలో వచ్చాయి. సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచాయి. ఇటు హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనాల సంఖ్య కూడా పెరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని హైదరాబాద్-విజయవాడ 65వ నంబరు జాతీయ రహదారిపై కూడా విజయవాడ వైపు వాహనాలు బారులు తీరాయి. శుక్రవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన వాహనాల జోరు శనివారం సాయంత్రం వరకు కొనసాగింది.

చందాలు వేసుకొని రోడ్డుకు మరమ్మతులు


బాగు చేయక ముందు రోడ్డుపై గుంతలు


కాలనీవాసులు చందాలు వేసుకొని బాగు చేయించిన రోడ్డు

నిజామాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నిజామాబాద్ నగర శివారు మూడో డివిజన్‌లోగల మహాలక్ష్మి కాలనీ సాయిటవర్స్ వాసులు చందాలు వేసుకొని తమ కాలనీ రోడ్డు శనివారం బాగు చేసుకున్నారు. కొద్దికాలంగా ఈ రోడ్డు గుంతలమయంగా మారి ఇబ్బందులు పడుతున్నారు. గుంతల వల్ల రాత్రి సమయాల్లో ఈ రోడ్డుపై వెళ్లిన అనేక మంది గాయపడిన ఘటనలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డంతా మరింత గుంతలమయంగా మారి చిన్న పాటి చెరువును తలపించింది. ఈ నేపథ్యంలో అపార్ట్‌మెంట్ వాసులు మున్సిపల్ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించినా వారు స్పందించలేదు. దీంతో అపార్ట్‌మెంట్ వాసులే ముందుకు వచ్చి సొంత డబ్బులతో రోడ్డును బాగు చేయించుకున్నారు. కాగా తమ కాలనీకి డ్రెయినేజీ, తాగునీటి సౌకర్యాలు లేవని.. అధికారులు స్పందించి వెంటనే ఆ వసతులు కల్పించాలని లేదంటే స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఇంటి పన్నులు సైతం చెల్లించబోమని సొసైటీ ప్రతినిధులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

• ఆర్కే RK

30 ఏళ్ల క్రితం అమలు చేసిన జన్మభూమి పథకానికీ పీ–4కీ పోలిక లేదు. మీరు ఇన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఒత్తిడి చేస్తే మార్గదర్శులుగా ఎంపికవుతున్న వారికి కోపం రాకుండా ఉంటుందా? జిల్లా కలెక్టర్లకు టార్గెట్లు విధించడం వల్ల వారు వివిధ శాఖల అధికారులకు ఆ టార్గెట్లు పంచుతున్నారు. ఇప్పుడు గ్రామ స్థాయిలో కూడా మార్గదర్శులను ఎంపిక చేయమంటున్నారట! ఇందుకోసం రెవెన్యూ అధికారులను ప్రయోగిస్తున్నారు. దీంతో ప్రభుత్వ అధికారులపై కూడా వ్యతిరేకత ఏర్పడుతోంది. గ్రామాలలో రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో మనకు తెలిసిందే. రైతులను ఆదుకోవడానికి 'అన్నదాత సుఖీభవ' అమలు చేస్తున్నారు. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్న రైతులకు బంగారు కుటుంబాల బాధ్యత అప్పగించాలని అనుకోవడం ఏమిటి? ఇలాంటి తల తిక్క పనుల వల్లే కదా ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడేది? ఈ నెల 19న ఈ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈ లోపు చంద్రబాబు మేల్కొని పీ–4 అమలు వల్ల తనకు లాభమా? నష్టమా? అన్నది సమీక్షించుకోవడం మంచిది.

పీ-4 పిచ్చిలో చంద్రబాబు!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పుడప్పుడూ నేల విడిచి సాము చేయాలని ఉబలాటపడుతుంటారు. ఆయన అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ తలమాసిన సలహాలు ఇవ్వడానికి ఎవరో ఒకరు తయారవుతారు. ఆచరణ సాధ్యం కాని ఇలాంటి ఆలోచనలంటే చంద్రబాబుకు మా చెడ్డ ఇష్టం. ఈ బలహీనతను గుర్తించిన కొందరు ప్రతి టర్మ్‌లో పక్కన చేరి దిక్కుమాలిన ప్రణాళికలు రూపొందించి ఆయనను అందులోకి లాగుతారు. దీంతో పుణ్యానికి పోతే పాపం ఎదురైనట్టు ఆయనకు రాజకీయంగా నష్టం జరుగుతుంది. ఏ నాయకుడైనా ప్రజల ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి గానీ, ప్రజలకు దూరమయ్యే సలహాలు, సూచనలు ఎవరు అందించినా పట్టించుకోకూడదు. జగన్‌రెడ్డి పాలనలో అష్టకష్టాలు పడి చివరకు జైలుకు కూడా వెళ్లిన చంద్రబాబు నాయుడు, ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చారు. దీంతో గతంలో చేసిన పొరపాట్లను పునరావృతం కానివ్వనని, 1995–1999 మధ్య కాలంలో తాను ఎలా వ్యవహరించానో ఇకపై అలాగే వ్యవహరిస్తానని ఆయన నమ్మబలికారు. 1999–2004 మధ్య కీర్తి కండూతికి అలవాటు పడిన ఆయన సంస్కరణల పేరిట ప్రజలకు దూరమయ్యారు. ప్రజా నాయకుడిగా కాకుండా రాష్ట్రానికి సీఈవో అని పిలిపించుకోవడానికే ఇష్టపడ్డారు. దీంతో 2004లో అధికారం కోల్పోయిన ఆయన రాష్ట్ర విభజన తర్వాత 2014లో గానీ తిరిగి అధికారంలోకి రాలేకపోయారు. ఆ సమయంలో రియల్ టైం గవర్నెన్స్ అంటూ రాజకీయాలను విడిచిపెట్టి సమావేశాలు, సమీక్షలతో గడిపేశారు. ప్రత్యర్థుల రాజకీయ ఎత్తుగడలను పట్టించుకోలేదు. ఫలితంగా 2019లో 23 సీట్లకే పరిమితం అయ్యారు. జగన్మోహన్‌రెడ్డి స్వయం కృతాపరాధంతో 2024లో చంద్రబాబు కనీవినీ ఎరుగని మెజారిటీతో అధికారంలో వచ్చారు. ఈ పర్యాయం అయినా ఆయన ప్రాక్టికల్‌గా, రాజకీయ నాయకుడిగా మారి ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందే ప్రయత్నం చేస్తారని అందరూ ఆశించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గత అనుభవాలు మరచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంటూ ఊదరగొట్టారు. దీనిపై విమర్శలు రావడంతో ఈ మధ్యే తన ధోరణిని మార్చుకున్నారు. ఇంతలోనే ఆయన పీ–4 అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. ఈ దిక్కుమాలిన సలహాను ఆయనకు ఎవరిచ్చారో తెలియదు గానీ 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా పీ–4 విధానాన్ని అమలు చేస్తానని చంద్రబాబు చెబుతున్నారు. 2029 నాటికి రాష్ట్రంలో జీరో పావర్టీ తమ లక్ష్యమని ఆయన చెప్పుకొంటున్నారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో ఉన్న 20 శాతం పేదలను రాష్ట్రంలో ఉన్న పది శాతం ధనవంతులు ఆదుకోవాలని, ఆయా కుటుంబాలను సదరు ధనవంతులు దత్తత తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నారు. లబ్ధి పొందే కుటుంబాలను 'బంగారు కుటుంబాలు', దత్తత తీసుకొనే ధనికులను 'మార్గదర్శులు' అని ముద్దుగా పేర్లు పెట్టుకున్నారు. ఇప్పటి వరకు పది లక్షలా 92 వేల బంగారు కుటుంబాలను, లక్షా 67 వేల మంది మార్గదర్శులను గుర్తించినట్టు ప్రభుత్వం చెబుతోంది. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం చేయాల్సిన కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా మార్చివేశారు. 2029 నాటికి రాష్ట్రంలో జీరో పావర్టీ అన్న లక్ష్యం ఆచరణ సాధ్యమా? అని కనీస ఆలోచన చేయకుండా మార్గదర్శులకు బలవంతంగా బాధ్యతలు అప్పగిస్తున్నారు.

చెంపదెబ్బ.. గోడదెబ్బ!

పేదరికం లేని సమాజం ప్రపంచంలో ఎక్కడైనా ఉందా? ఉంటుందా? మన దగ్గర ఎలా సాధ్యం అన్న సందేహం ఎందుకు కలగలేదో తెలియదు. ప్రభుత్వాన్ని భ్రష్టుపట్టించే ఇలాంటి సలహాలు ఇచ్చినవారి జ్ఞానం ఏపాటిదో దీన్ని బట్టి అర్థమవుతోంది. 1995లో ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చినప్పుడు చంద్రబాబు నాయుడు జన్మభూమి కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. అప్పట్లో దీనికి మంచి స్పందన వచ్చింది. ఆయా గ్రామాల్లో పుట్టి పెరిగి ఉన్నత స్థానాలకు చేరినవారు ప్రేరణ పొంది తమ స్వగ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం 'కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)' పథకాన్ని తీసుకురాలేదు. ఆ తర్వాత కార్పొరేట్ కంపెనీలు తమ లాభాల్లో రెండు శాతం మొత్తాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఎంపిక చేసిన కార్యక్రమాలకు విధిగా ఖర్చు చేయాలని కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. దీంతో లాభాలు ఆర్జిస్తున్న కంపెనీలు, సంస్థలు తమ లాభాల్లో రెండు శాతాన్ని సమాజ హితం కోసం ఖర్చు చేస్తున్నాయి. ఇప్పుడు ఈ పథకం అమలులో ఉండగానే వ్యక్తులకు లబ్ధి చేకూర్చే పీ–4 పథకాన్ని చంద్రబాబుకు ఎవరు అంటగట్టారు? నిజానికి సీఎస్‌ఆర్ నిబంధన లేనప్పుడు కూడా మనసున్న దాతలు ముందుకు వచ్చి పేదలను ఆదుకున్నారు. విద్య–వైద్య రంగాలకు తమ వంతు సాయం చేసేవారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేయాల్సిన సహాయాన్ని నిర్బంధం చేయాలనుకోవడమే తప్పు. ప్రభుత్వం–ప్రైవేట్–ప్రజల భాగస్వామ్యంతో కూడినదే పీ–4. దీంతో ఇది కలగాపులగంగా మారింది. ముందుగా ఈ పథకం వల్ల ప్రభుత్వానికి రాజకీయంగా జరిగే నష్టం విషయానికి వద్దాం. రాష్ట్రంలో పేదరికంలో ఉన్న కుటుంబాల సంఖ్య ఎంత? అన్నది ప్రభుత్వం వద్ద సమాచారం లేదు. తెల్ల రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటే రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను కట్టే మరికొందరిని మినహాయిస్తే మిగతా అందరూ పేదరికంలో ఉన్నట్టే! వారందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోంది. ఈ లెక్కన కనీసం కోటి కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేయవలసి ఉంటుంది. ప్రస్తుతానికి పదకొండు లక్షల కుటుంబాలను గుర్తించినట్టు ప్రభుత్వం చెబుతోంది. అలా అయితే మిగతా 89 లక్షల కుటుంబాల పరిస్థితి ఏమిటి? వారంతా ప్రభుత్వానికి దూరం కారా? ఏ పథకాన్నయినా అందరికీ వర్తింపజేసినప్పుడే రాజకీయంగా ఫలితాలు లభిస్తాయి. అరకొరగా అమలు చేస్తే ప్రతికూల ఫలితాలు ఎదురవుతాయి. తాను స్వయంగా 250 బంగారు కుటుంబాలను కుప్పంలో దత్తత తీసుకుంటానని చంద్రబాబు చెప్పారు. అలా అయితే కుప్పం నియోజకవర్గంలో ఉన్న మిగతా పేద కుటుంబాలు కినుక వహించవా? కాగా, బంగారు కుటుంబాల ఎంపిక కూడా శాస్త్రీయంగా జరగడం లేదు. కొన్నిచోట్ల మార్గదర్శిగా గుర్తించిన వారికంటే అధిక ఆస్తులు కలిగి ఉన్న వారిని కూడా బంగారు కుటుంబాల జాబితాలో చేర్చారు. ఒక మార్గదర్శికి కొన్ని కుటుంబాల వంతున ప్రభుత్వం కేటాయిస్తుంది. బంగారు కుటుంబాల సంఖ్య పెరిగేకొద్దీ మార్గదర్శుల సంఖ్య కూడా పెరగాల్సి ఉంటుంది. దీంతో జిల్లా స్థాయి అధికారులకు మార్గదర్శుల సంఖ్య విషయంలో టార్గెట్ పెట్టారు. బంగారు కుటుంబాల ఎంపిక గందరగోళంగా ఉందనుకుంటే మార్గదర్శుల ఎంపికకు కూడా టార్గెట్లు విధించడంతో సహాయం చేయాలనుకున్న వారు కూడా ప్రభుత్వాన్ని తిట్టిపోస్తున్నారు. దీంతో ప్రభుత్వం పరిస్థితి 'చెంపదెబ్బ–గోడదెబ్బ'గా మారుతోంది. బంగారు కుటుంబంగా ఎంపిక కాని వారు ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టకుండా ఉంటారా? అదే సమయంలో తమను బలవంతంగా మార్గదర్శులుగా ఎంపిక చేయడాన్ని దాతలు కూడా ఆక్షేపిస్తున్నారు. మద్యం షాపులు నడిపే వారిని, చిన్నా చితకా వ్యాపారాలు చేసుకుంటున్న వారిని కూడా మార్గదర్శులుగా ఎంపిక చేస్తున్నారు. స్వచ్ఛందంగా సాగాల్సిన కార్యక్రమాలలో ప్రభుత్వం తలదూరిస్తే ఇలాగే ఏడుస్తుంది. బంగారు కుటుంబాల ఎంపిక బాధ్యతను గ్రామ సచివాలయాలకు కూడా అప్పగించారట. వారు తమ గ్రామంలో నిరుపేద కుటుంబాలు ఉన్నాయా అని పరిశీలించి ఎంపిక చేయకుండా ఎమ్మెల్యేల నుంచి వస్తున్న జాబితాలను పైస్థాయి అధికారులకు పంపుతున్నారు. ఇప్పటివరకు ఎంపికైన బంగారు కుటుంబాలలో 26 శాతం వరకు అనర్హులని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. లోతుగా పరిశీలిస్తే ఇంకెంత మంది అనర్హులు తేలుతారో తెలియదు. లబ్ధిదారులుగా మారబోతున్న బంగారు కుటుంబాలకు ఏ అవసరాలు ఉంటాయో తెలుసుకోవడానికి ప్రాథమిక సర్వే చేయగా 31 శాతం మంది ఉద్యోగాలు కావాలని, 22 శాతం మంది వైద్య సహాయం కావాలని, 9 శాతం మంది వ్యాపారం చేసుకోవడానికి పెట్టుబడి కావాలని కోరగా, మిగతా వారు తమ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. అంటే, ఒక బంగారు కుటుంబం భారాన్ని మొత్తం మార్గదర్శి భరించాలన్నమాట. ఆర్థికంగా

> **కొంత మంది ఎమ్మెల్యేలు కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారు. వారిని ఎలా కట్టడి చేయాలో కూటమి భాగస్వామ్య పక్షాలు ఆలోచించుకోవాలి. ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోగలిగితే దిద్దుబాటు చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది. ప్రజలు ఎదురొచ్చి మీ పని తీరు బాగోలేదని ఎప్పుడూ చెప్పరు. చెప్పాల్సిన రోజే చెబుతారు.**

ఉన్నత స్థానంలో ఉన్నవారు పేదరికంలో ఉన్న తమ రక్త సంబంధీకులను కూడా పట్టించుకోని రోజులివి! ఏదైనా ఒక పథకానికి రూపకల్పన చేసే ముందు అది ఎంతవరకు ఆచరణ సాధ్యం? సదరు పథకం వల్ల ప్రజలకు జరిగే మేలెంత? ప్రభుత్వానికి రాజకీయంగా కలిగే ప్రయోజనం ఎంత? అని బేరీజు వేసుకోవాలి కదా? ప్రజలతో సంబంధం లేకుండా క్షేత్ర స్థాయి పరిస్థితులు తెలియనివారు ఇచ్చే సలహాలను గుడ్డిగా ఆచరించి అమలు చేస్తే నష్టం తప్పదు. ఇటు పేదలను పూర్తి స్థాయిలో సంతృప్తిపరచలేని విధంగా, అటు మార్గదర్శులుగా ఎంపిక చేస్తున్న వారికి నిర్బంధంగా బాధ్యతలు అప్పగించడం వల్ల ఉభయభ్రష్టత్వం తప్పదు.

ప్రకృతి విరుద్ధ ఆలోచన!

పేదలను ఆదుకోవడం వేరు.. పేదరికమే లేకుండా చేయడం వేరు. ఇలాంటి ఆలోచనే ప్రకృతి విరుద్ధం. పేదరికం లేని సమాజం సృష్టించడం అంత సులువైతే సంపన్న దేశాల్లోనూ పేదరికం ఎందుకు ఉంటోంది. అక్కడ కూడా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు కదా! నిర్బంధ విధానం ఏదీ కూడా సక్సెస్ కాదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు పీ–4ను పట్టుకొని వేలాడుతున్నారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులను పిలిపించుకొని గంటలకొద్దీ చర్చలు జరుపుతున్నారు. సదరు సమావేశాలలో ఒకరిద్దరు పారిశ్రామికవేత్తల గొప్పదనాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావిస్తుండటంతో మిగతా వారు చిన్నబుచ్చుకుంటున్నారు. ముఖ్యమంత్రితో జరిగిన సమావేశాలకు వెళ్లిన వారిలో పలువురు ఇదెక్కడి తద్దినం అని తిట్టుకుంటున్నారు. బంగారు కుటుంబాలుగా ఎంపికైన వారికి సంక్షేమ పథకాలు ఆపేస్తారా? అంటే అదీ లేదు. అంటే, వారికి డబుల్ బొనాంజా అన్న మాట! అలాంటప్పుడు మిగతా వారికి కడుపు మంట ఉండటం సహజం. 30 ఏళ్ల క్రితం అమలు చేసిన జన్మభూమి పథకానికీ దీనికీ పోలిక లేదు. మీరు ఇన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఒత్తిడి చేస్తే మార్గదర్శులుగా ఎంపికవుతున్న వారికి కోపం రాకుండా ఉంటుందా? జిల్లా కలెక్టర్లకు టార్గెట్లు విధించడం వల్ల వారు వివిధ శాఖల అధికారులకు ఆ టార్గెట్లు పంచుతున్నారు. ఈ క్రమంలోనే టీచర్లు కూడా మార్గదర్శులుగా మారాలంటూ కొన్నిచోట్ల ఉత్తర్వులివ్వడాన్ని చూశాం. దీనిపై విమర్శలు రావడంతో అధికారులు వెనక్కి తగ్గారు. ఇప్పుడు గ్రామ స్థాయిలో కూడా మార్గదర్శులను ఎంపిక చేయమంటున్నారట! ఇందుకోసం రెవెన్యూ అధికారులను ప్రయోగిస్తున్నారు. దీంతో ప్రభుత్వ అధికారులపై కూడా వ్యతిరేకత ఏర్పడుతోంది. గ్రామాలలో రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో మనకు తెలిసిందే. రైతులను ఆదుకోవడానికి 'అన్నదాత సుఖీభవ' అమలు చేస్తున్నారు. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్న రైతులకు బంగారు కుటుంబాల బాధ్యత అప్పగించాలని అనుకోవడం ఏమిటి? ఇలాంటి తల తిక్క పనుల వల్లే కదా ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడేది? ఈ నెల 19న ఈ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈ లోపు చంద్రబాబు మేల్కొని పీ–4 అమలు వల్ల తనకు లాభమా? నష్టమా? అన్నది సమీక్షించుకోవడం మంచిది. ముఖ్యమంత్రి మెప్పు కోసం ఎవరెవరో ఏవేవో సలహాలు ఇస్తుంటారు. అలా వచ్చే సలహాలలో వేటిని పరిగణనలోకి తీసుకోవాలి? వేటిని విస్మరించాలి? అన్న ఇంగితం ప్రభుత్వానికి ఉండాలి కదా? ఈ పథకం అమలు పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన సంస్థకు వైస్ చైర్మన్‌గా సి.కుటుంబరావు అనే ఆయనను నియమించారు. ఆయన ముఖ్యమంత్రి మెప్పు పొందడం కోసం జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులకు ఫోన్లు చేసి టార్గెట్లు విధిస్తున్నారని చెబుతున్నారు. మార్గదర్శుల ఎంపిక కోసం వ్యాపారులు, ఇతర సంపన్న వర్గాలతో ప్రభుత్వపరంగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశాలకు వెళుతున్న ముఖ్యమంత్రి గంటలకొద్దీ సమయం వెచ్చిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఖర్చు తప్పితే పెద్దగా ప్రయోజనం ఉండటం లేదని అధికారులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులు అసలు పనులు వదిలేసి మార్గదర్శుల వేటలో బిజీగా ఉంటున్నారు. మంత్రివర్గ సమావేశంలో కూడా ఈ పథకం గురించి చర్చించిన దాఖలాలు లేవు. స్వచ్ఛందంగా దాతలు ముందుకు వచ్చి చేయాల్సిన పనులను ప్రభుత్వ కార్యక్రమాలుగా మార్చడమే తప్పు. విచిత్రం ఏమిటంటే, మంత్రులు గానీ, సీనియర్ అధికారులు గానీ ఈ పథకం మంచిచెడులను ముఖ్యమంత్రికి చెప్పలేకపోతున్నారు. ఈ కారణం వల్లనే ఆచరణ సాధ్యం కాని పథకాలు పురుడుపోసుకుంటాయి. చివరికి రాజకీయంగా మూల్యం చెల్లించుకుంటారు.



> **ఏ పథకాన్నయినా అందరికీ వర్తింపజేసినప్పుడే రాజకీయంగా ఫలితాలు లభిస్తాయి. అరకొరగా అమలు చేస్తే ప్రతికూల ఫలితాలు ఎదురవుతాయి. తాను స్వయంగా 250 బంగారు కుటుంబాలను కుప్పంలో దత్తత తీసుకుంటానని చంద్రబాబు చెప్పారు. అలా అయితే కుప్పం నియోజకవర్గంలో ఉన్న మిగతా పేద కుటుంబాలు కినుక వహించవా? కాగా, బంగారు కుటుంబాల ఎంపిక కూడా శాస్త్రీయంగా జరగడంలేదు. కొన్నిచోట్ల మార్గదర్శిగా గుర్తించిన వారికంటే అధిక ఆస్తులు కలిగి ఉన్న వారిని కూడా బంగారు కుటుంబాల జాబితాలో చేర్చారు. ఒక మార్గదర్శికి కొన్ని కుటుంబాల వంతున ప్రభుత్వం కేటాయిస్తుంది. బంగారు కుటుంబాల సంఖ్య పెరిగేకొద్దీ మార్గదర్శుల సంఖ్య కూడా పెరగాల్సి ఉంటుంది. దీంతో జిల్లా స్థాయి అధికారులకు మార్గదర్శుల సంఖ్య విషయంలో టార్గెట్ పెట్టారు. బంగారు కుటుంబాల ఎంపిక గందరగోళంగా ఉందనుకుంటే మార్గదర్శుల ఎంపికకు కూడా టార్గెట్లు విధించడంతో సహాయం చేయాలనుకున్న వారు కూడా ప్రభుత్వాన్ని తిట్టిపోస్తున్నారు. దీంతో ప్రభుత్వం పరిస్థితి 'చెంపదెబ్బ–గోడదెబ్బ'గా మారుతోంది. బంగారు కుటుంబంగా ఎంపిక కాని వారు ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టకుండా ఉంటారా?**

అరాచకానికి అడ్డుకట్ట పడాలి!

ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఫోకస్ చేయాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి. దారి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెడతారని ప్రజలు ఆయనను ఎన్నుకున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తారన్న నమ్మకం ప్రజలకు ఆయనపై ఉంది. ఈ దిశలో ఫలితాలు రావాలంటే సమయం పడుతుంది. ప్రజలు కూడా అర్థం చేసుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి నాయకులు తమది మంచి ప్రభుత్వం అని చెప్పుకొంటున్నారు. మంచి ప్రభుత్వంలో ప్రజలను పీడించకూడదు. కూటమి తరఫున ఎన్నికైన కొందరు ఎమ్మెల్యేలు ప్రజాకంటకులుగా మారారు. వైసీపీకి చెందిన ఎమ్మెల్యేల కంటే అరాచకంగా వ్యవహరిస్తున్నారన్న భావన ఇప్పుడిప్పుడే ప్రజల్లో ఏర్పడుతోంది. నియోజకవర్గాలలో ఏ పనులు జరగాలన్నా ఎమ్మెల్యేల అనుమతి తప్పనిసరి చేశారు. ఏ పని కోసం అధికారుల వద్దకు వెళ్లినా ఎమ్మెల్యే గారితో చెప్పించండి అని అంటున్నారు. అధికారులు రొటీన్‌గా చేయాల్సిన పనులకు ఎమ్మెల్యే సమ్మతి ఎందుకు? రిజిస్ట్రేషన్లు జరగాలన్నా, మున్సిపాలిటీలలో ఇంటి ప్లాన్ ఆమోదం పొందాలన్నా కూడా ఎమ్మెల్యేల జోక్యం ఏమిటి? ఇక రెవెన్యూ వ్యవహారాలలో ఎమ్మెల్యేల జోక్యం సంగతి చెప్పాల్సిన పనిలేదు. లేఔట్లు వేసి వ్యాపారం చేయాలన్నా, భూ వినియోగ మార్పిడి జరగాలన్నా ఎమ్మెల్యేలకు కప్పం కట్టాలా? మా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి మహాప్రభో అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు కనిపించిన వారినందరినీ వేడుకుంటున్నారు. ఎమ్మెల్యేలు మాత్రం తమ నియోజకవర్గంలో పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేద్దామనుకుంటున్న వారిని 'మా సంగతి ఏమిటి?' అని వేధిస్తున్నారు. ప్రభుత్వపరమైన పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను బెదిరించడం వంటివి ఇవాళ కొత్త కాదు. కొంతమంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో తామే చక్రవర్తులం అన్నట్టుగా భావిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో కేసు కట్టాలన్నా ఎమ్మెల్యే అనుమతి ఉండాలా? ఈ దుష్ట సంస్కృతి నానాటికీ వికృత రూపం సంతరించుకుంటోంది. ఇలాంటి చెత్త పనులు చేయడం వల్లనే గతంలో ఎమ్మెల్యేలుగా ఉన్నవారు ఓడిపోయారు అని తెలిసి కూడా ఆత్మపరిశీలన ఎందుకు చేసుకోరో తెలియదు. కేవలం ఐదేళ్ల కాలానికే తాము ఎన్నికయ్యామన్న స్పృహ లేకుండా విర్రవీగుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటింది. తమ ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం ఎలా ఉందో తెలుసుకొనే ప్రయత్నాన్ని కూటమి నాయకులు వెంటనే చేయాలి. ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఫీల్‌గుడ్ భావన ఉందో లేదో తెలుసుకోవాలి. అలాంటి భావన లేని పక్షంలో సంక్షేమ పథకాలు అమలు చేసినా, అభివృద్ధి చేసినా ఫలితం ఉండదు. ప్రస్తుతానికి కొంత మంది ఎమ్మెల్యేలు కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారు. వారిని ఎలా కట్టడి చేయాలో కూటమి భాగస్వామ్య పక్షాలు ఆలోచించుకోవాలి. ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోగలిగితే దిద్దుబాటు చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది. ప్రజలు ఎదురొచ్చి మీ పని తీరు బాగోలేదని ఎప్పుడూ చెప్పరు. చెప్పాల్సిన రోజే చెబుతారు. పీ–4 పథకం విషయమే తీసుకుందాం. బంగారు కుటుంబాల బాధ్యత తీసుకోవడానికి ఎంపిక అవుతున్న మార్గదర్శుల అభిప్రాయం తెలుసుకొనే ప్రయత్నం చేస్తే ఆ పథకం విషయంలో ముందుకు వెళ్లాలో లేదో తెలిసిపోతుంది. ఉపాధి కల్పించండి అని వ్యాపార, పారిశ్రామికవేత్తలను కోరడం వేరు. దత్తత తీసుకొని వారి ఆలనా పాలనా మొత్తం చూడాలని కోరడం ఏమిటి? ప్రజలను పని సంస్కృతికి దూరం చేయడం వల్ల జరుగుతున్న అనర్థాలను తెలుగు రాష్ట్రాలు అనుభవిస్తున్నాయి. గ్రామాలలో వ్యవసాయ పనులకు కూలీలు కూడా దొరకడం లేదు. ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాలకు చెందినవారు వచ్చి మన దగ్గర పనులు చేసుకుంటున్నారు. వారు కూడా లభించని రోజున పరిస్థితి ఏమిటో ఊహించుకోండి. పని సంస్కృతిని పెంపొందించకుండా కూర్చోబెట్టి పెట్టాలనుకోవడం బాధ్యతారాహిత్యం. మన పిల్లల్ని అలాగే పెంచుతామా? చంద్రబాబుతో వచ్చిన తంటా ఏమిటంటే, ఆయన ఏది పట్టుకుంటే దాని వెనకాలే పరిగెడతారు. ఇంకోవైపు చూడరు. 1999–2004 మధ్య ప్రజలను సమాయత్తం చేయకుండా సంస్కరణలను అమలుచేసి దెబ్బతిన్నారు. ఇప్పుడు వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో పేదరికమే ఉండకూడదన్న పాట పాడుతున్నారు. అలా చెయ్యడం సాధ్యం అని ఎవరు చెప్పారో తెలియదు గానీ వారి పేరు తెలుసుకోవాలని ఉంది. గత ప్రభుత్వం ఎందుకు అధికారం కోల్పోయిందో ఒక పుస్తకంలో రాసుకుంటే, ఇప్పుడు తాము ఏం చేయాలో, ఏమి చేయకూడదో, ప్రజలు తమ నుంచి ఏమి ఆశిస్తున్నారో కూటమి నాయకులకు తెలుస్తుంది. అలా కాకుండా నేల విడిచి సాము చేస్తామని మంకుపట్టు పడితే పర్యవసానాలకు కూడా సిద్ధం కావాలి. ఫలానా వారికి, ఫలానా జిల్లాలో పీ–4 బాధ్యత అప్పగిస్తున్నానని చంద్రబాబు ఆ మధ్య ప్రకటించారు. ఒకరో ఇద్దరో వారు ఏ స్థాయి పారిశ్రామికవేత్తలైనా ఒక జిల్లాలో పేదరికం లేకుండా చేయగలరా? అది అంత సులువైతే అంతటి మహత్తర సలహా ఇచ్చినవారిని సన్మానించాల్సిందే. ప్రపంచ దేశాలకు కూడా మీరు ఆదర్శం అవుతారు. దిక్కుమాలిన సలహాలు ఇచ్చేవారి విషయంలో కూటమి నేతలు జాగ్రత్తగా ఉండాలి. సలహాలు ఇచ్చేవారు సేఫ్‌గానే ఉంటారు. ఆచరణ సాధ్యంకాని సలహాలను అమలు చేస్తే మునిగేది కూటమి పార్టీ నాయకులే.

ప్రజల మనసెరిగి మెలగాలి!

రాజధాని అమరావతి విషయంలో కూడా గందరగోళం నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయమై వెంటనే దృష్టిసారించాలి. లేని పక్షంలో మీపై పూలు చల్లిన రైతులే రాళ్లు విసిరినా ఆశ్చర్యం లేదు. సీఆర్‌డీఏ నిబంధనల గురించి రైతులకు పూర్తిగా తెలియదు. తెలిస్తే వారు ఆందోళన చేస్తారు. నమ్మిన రైతులను అధికారుల దయాదాక్షిణ్యాలకు వదిలేయడం మంచిది కాదు. తన కళ్లకు గంతలు కట్టాలనుకుంటున్న వారి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అలెర్ట్‌గా ఉండాలి. అంతా నాకు తెలుసులే అని అనుకుంటే అది ఆయన ఇష్టం. నేల విడిచి సాము చేసే ప్రయత్నాలకు స్వస్తి చెప్పి ప్రభుత్వ వ్యవహారాలలో, అంటే అనుమతుల మంజూరులో విచక్షణాధికారాలను రద్దు చేయడంతో పాటు ఎమ్మెల్యేల జోక్యం లేకుండా చేయగలిగితే ప్రజలు హర్షిస్తారు. ప్రజల్లో ఫ్రెండ్లీ ప్రభుత్వం అన్న భావన కలిగేలా పాలనా సంస్కరణలు తీసుకువచ్చి వేధింపుల నుంచి ప్రజలను విముక్తి చేయడంపై చంద్రబాబు దృష్టి సారించాలి. ప్రజల మెప్పు పొందినప్పుడే రాజకీయంగా మేలు జరుగుతుంది. ప్రజల మనసెరిగి వ్యవహరించండి!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

సాహిత్య భావుకుని మేధో దీప్తిధార

నివాళి

విశిష్ట సాహిత్య కృషి చేసిన అరుదైన ధీమంతుడు కోడూరి శ్రీరామమూర్తి. సాహిత్య విమర్శ, కథ, నవల, బాల సాహిత్యం, పరిశోధన, పత్రికా రచనలో తనదైన ముద్ర వేసిన మేధావి కోడూరి. గాంధేయవాద చింతకుడే అయినా భగత్‌సింగ్ విప్లవాదర్శాలు, మానవేంద్రనాథ్ రాయ్ నవ్యమానవవాదం, వల్లభ్ భాయ్ పటేల్ రాజనీతిజ్ఞత గురించి కూడా తెలుగువారికి స్ఫూర్తిదాయకంగా చెప్పిన విశాల భావుకుడు కోడూరి. ప్రపంచ మేధావులైన బెర్ట్రాండ్ రస్సెల్, హెన్రీ డేవిడ్ థోరో, జాన్ రస్కిన్, జాన్ స్టువర్ట్‌మిల్ వంటి వారి గురించి తెలుగులో మొదటిసారిగా విలువైన రచనలు చేసిన అపూర్వ ఆలోచనాశీలి. ఎన్ని అవాంతరాలు ఎదురైనా కడవరకూ తాను నమ్మిన మానవతావాద సిద్ధాంతానికి సాహిత్య రంగంలో చోటు కల్పించి, మనసా వాచా కర్మణా మనిషి ఉన్నతికి పాటుపడిన రచయిత కోడూరి శ్రీరామమూర్తి.

1941, సెప్టెంబరు 29న రాజమండ్రిలో దేశభక్తుల కుటుంబంలో కోడూరి జన్మించారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా రాజమహేంద్రవరంలో మొదటిసారి తన స్వగృహంపై జాతీయ జెండా ఎగరవేసిన దేవతా శ్రీరామమూర్తి ఆయన తాతగారు. ప్రభుత్వం తనపై పెట్టిన అక్రమకేసుల్ని ఎదుర్కొని 'జెండా ఎగరేయడం నా జన్మహక్కు' అని దేవతా శ్రీరామమూర్తి స్వయంగా కోర్టులో వాదించుకుని కేసు గెలిచారు. ఆయన స్ఫూర్తితో రాజమహేంద్రి వాసుల గృహాలు మువ్వన్నెల జెండాతో రెపరెపలాడాయి. దేవతా శ్రీరామమూర్తిని 'జెండా ప్లీడరు' అని రాజమహేంద్రీయులు గౌరవించేవారు. దేశభక్తుడైన తాతగారి పేరే సాహితీవేత్త అయిన మనవడి పేరు.

కోడూరి శ్రీరామమూర్తి తండ్రి పుల్లేశ్వరరావు. తల్లి లీలావతిదేవి. బాల సాహిత్య సృజనలో కీర్తిగాంచిన తల్లి లీలావతి ప్రభావంతో మన కోడూరి చిన్న వయసులోనే 'నేనూ–నా చెల్లెలు' అనే రచన చేశారు. శ్రీరామమూర్తి విద్యార్థి దశ నుంచీ గాంధేయవాది. రవీంద్రనాథ్ ఠాగూర్ శతజయంతి సందర్భంగా 14 అధికారిక భాషల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన పుస్తక రచన పోటీల్లో కోడూరికి మొదటి బహుమతి వచ్చింది. అప్పటికి ఆయన వయసు కేవలం 19 ఏళ్ళు మాత్రమే. కోడూరి రచనా వ్యాసంగం అలా ప్రారంభమయింది.

అమెరికన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ వారి ప్రోత్సాహంతో పలు అనువాదాలు చేసిన శ్రీరామమూర్తి 'ఉదయరేఖ' అనే సాహిత్య పత్రికను స్వయంగా నిర్వహించారు. మూడు దశాబ్దాలకు పైగా బొబ్బిలి కళాశాలలో ఆర్థిక శాస్త్రం బోధించారు. అప్పట్లో కోడూరి శ్రీరామమూర్తి వ్యాసాలు 'భారతి'లో ఎక్కువగా వస్తుండేవి అంటే ఆయన సాహిత్య వ్యాసంగానికి ఆనాడే ఎంతటి గుర్తింపు లభించిందో అర్థం చేసుకోవచ్చు. ఆయన రాసిన, 'తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ' నాటికీ నేటికీ కూడా ఆ అంశం మీద తెలుగులో ఉన్న ఏకైక ఉద్గ్రంథం. ఆయన నవల 'నీటిలో నీడలు' వాషింగ్టన్‌లోని కాంగ్రెస్ లైబ్రరీలో ఎంపిక చేసి ఉంచిన అరుదైన తెలుగు పుస్తకాల్లో ఒకటి. వెలుగు వెన్నెల అనే వ్యాస సంపుటి, తెలుగు కథ నాడు– నేడు, మా మంచి తెలుగు కథ, రాగమాలిక, తెర తీయగరాదా కథా సంపుటి, బాలసాహిత్యంలో రవికవి, మహనీయుల జీవితంలో కథ కాని కథలు మొదలైనవి ఆయన ఇతర రచనలు. హేతు



కోడూరి శ్రీరామమూర్తి
29 సెప్టెంబర్ 1941 – 5 ఆగస్టు 2025

చింతనతో కూడిన జిజ్ఞాస కోడూరి రచనల్లో సువ్యక్తమవుతుండేది. వ్యక్తిగత నమ్మకాలతో సంబంధం లేకుండా శాస్త్రీయ దృష్టితో చరిత్రని, సాహిత్యాన్ని, సమాజాన్ని సమీక్షించడం కోడూరి ప్రత్యేకత. గాంధీజీ ప్రతిపాదించిన నూతన విద్యావిధానం, నైతిక ప్రవర్తనావళి, పౌర చైతన్యం, సామాజిక న్యాయం, సహాయ నిరాకరణోద్యమం, సహకార సంఘాలు, సర్వోదయ సిద్ధాంతం వంటివి యువత లోతుగా అధ్యయనం చేయాలని కోడూరి ఆశించేవారు.

గాంధీ జీవితం, బోధనల గురించి కోడూరి తన జీవిత పర్యంతం సమున్నతమైన కృషి చేశారు. మహాత్మాగాంధీని బహుముఖ కోణాలలో ఆవిష్కరించిన తొలి తెలుగు రచయిత కోడూరి. కేవలం స్వాతంత్ర్య సమరయోధుడుగా మాత్రమే కాక ఒక సత్యాన్వేషిగా, పాత్రికేయుడిగా, పర్యావరణవేత్తగా, దార్శనిక ఆలోచనశీలిగా, రాజకీయవేత్తగా ఎన్నో రూపాల్లో మనకు తెలియని మహాత్ముడి గురించి ఆయన విస్తృతంగా రాశారు. బహుశా మరే ఇతర భారతీయ భాషా సాహిత్యంలో కూడా మహాత్మాగాంధీ గురించి ఇంత విలక్షణంగా వివరించినవారు ఎవరూ ఉండరేమో? అలనాటి 'ఆంధ్రజ్యోతి' వార పత్రికలో 'గాంధీజీ కథావళి' రాశారు. 'నేటికీ గాంధేయ మార్గం ఎలా అవసరమో' చెబుతూ ఒక సుప్రసిద్ధ దినపత్రికలో ఒక వ్యాస పరంపర రాశారు. గాంధీజీ దృక్పథానికి కట్టుబడి మొత్తం పదిహేను వరకూ పుస్తకాలు రాశారు.

'ఇప్పుడు నా వయస్సు ఎనిమిది దశాబ్దాలు దాటి తొమ్మిదో దశాబ్దంలో దాదాపుగా సగానికి వొచ్చింది. జారిపోకుండా ఉన్న జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకుందామనే ఉద్దేశంతో ఆత్మకథ వ్రాయడం ప్రారంభించాను. ఇది చాలా విలువైనదని చెప్పడం లేదు. కానీ, ఒక తరంలో జీవించిన, ఇంకా జీవిస్తున్న ఒక వ్యక్తి జ్ఞాపకాలు కాబట్టి కొత్త తరం పాఠకులకు కొంతైనా ఉపయోగకరంగా ఉండవచ్చునని ఇది రాస్తున్నాను...' అంటూ 'తెగిన జ్ఞాపకాలు' పేరిట స్వీయ చరిత్ర మొదలుపెట్టిన కోడూరి శ్రీరామమూర్తి ఆగస్టు 5న సాయంత్రం అస్తమించారు. అముద్రితంగా ఉండిపోయిన ఆయన విశేష పరిశోధన 'స్వాతంత్ర్యానంతర యుగంలో వచన సాహిత్యం : సంప్రదాయం, ప్రయోగం'ను వెన్వెంటనే వెలుగులోకి తీసుకురావలిసిన అవసరమున్నది.

కోడూరి శ్రీరామమూర్తి సాత్విక స్వభావి. నైతిక విలువలతో నిండారిన, విప్పారిన సార్థక జీవితం ఆయనది. భారత స్వాతంత్రోద్యమ చరిత్ర, ఫ్రెంచ్ విప్లవం మొదలైన చారిత్రక అంశాలపై సాధికారికంగా రచించగల, ఉపన్యసించగల అరుదైన తెలుగు సాహిత్యకారుడు. జీవన సహచరి భారతి ఆకస్మిక మరణం అంతిమ దశలో ఆయన్ని కుంగదీసింది. ఆ దిగులుతోనే చివరివరకూ రచనా వ్యాసంగానికే అంకితమై అక్షరాలతోనే సహజీవనం చేస్తూ అంతిమ శ్వాస విడిచారు. రాజకీయ విప్లవాలు, భావ ఉద్యమాలు అన్నింటిపట్లా స్నేహపూరిత దృక్పథంతో వ్యవహరించిన కోడూరి నికార్సయిన ప్రజాస్వామ్యవాది. ఆయన మరణంతో గాంధేయవాదానికి సంబంధించిన ఒక ప్రత్యేక చింతనాశీలిని తెలుగు సమాజం కోల్పోయింది.

• గౌరవ్

రైతు బీమా ప్రక్రియ షురూ..

- ఈనెల 13వ తేదీ వరకు పూర్తి
- 14 నుంచి 8వ పాలసీ సంవత్సరం
- పాతవారి రెన్యూవల్‌కు డాటా పరిశీలన
- బీమా కిందకు కొత్తగా 1.50 లక్షల మంది

7



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క

పరిమళించిన అనుబంధం

సీఎంకు రాఖీలు కట్టిన మంత్రులు సురేఖ, సీతక్క

వరంగల్ సిటీ/ ములుగు, ఆగస్టు 9: (ఆంధ్రజ్యోతి) సోదరీ సోదరుల అనురాగ బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ వేడుక సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన మహిళా మంత్రులు కొండా సురేఖ, సీతక్క ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టి అనుబంధాన్ని చాటుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో సీఎంను ఆయన నివాసంలో కలుసుకున్నారు. రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. కాగా, మంత్రి సీతక్క... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కూడా రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సోషల్ మీడియాలో సీతక్కతో తనకున్న అనుబంధాన్ని రాఖీ పౌర్ణమి వెన్నెలతో పోలుస్తూ పోస్టు చేశారు. సీతక్కతో తనకున్న అనుబంధం మాటల్లో నిర్వచించలేనిదని పేర్కొన్నారు.


ఘనంగా భద్రకాళి పవిత్రోత్సవాలు

పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు



అమ్మవారికి పవిత్రోత్సవాలతో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం మూడు రోజుల పాటు చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మహా పూర్ణాహుతితో శనివారం ముగిశాయి. శ్రావణ పౌర్ణమి తిథిని పురస్కరించుకొని భద్రకాళి శేషు అర్చకుల ఆధ్వర్యంలో అర్చక బృందం అమ్మవారికి పవిత్రములు వివిధ రకాల నూలుతో తయారు చేసిన మాలలను ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశంలోనే భద్రకాళి అమ్మవారి ఆలయంలో వైదిక ఆగమానుసారం జరుపబడే పూజా విధానానికి ఈ పవిత్రోత్సవాలను నిర్వహిస్తారు. ఏ ఉత్సవం నిర్వహించిన శాస్త్రాధారం వైదిక ఆగమ సంప్రదాయంతోనే నిర్వహించబడునని భద్రకాళి శేషు తెలిపారు. రక్షాబంధనాన్ని శ్రావణ పౌర్ణమి రోజున జరుపాలని భవిష్య పురాణంలో ఉన్నట్లు శేషు తెలిపారు. ఈ నేపథ్యంలో అర్చక బృందం అమ్మవారికి పూజలు నిర్వహించి పవిత్రోత్సవ అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డాక్టర్ బి.శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తుపాకులగూడెం బ్యారేజీ (ఫైల్)



దేవాదుల.. గట్టెక్కేనా!?

పాతికేళ్లుగా అసంపూర్తిగా భూ సేకరణతో పాటు ఫేజ్-3 పనులు

- ఇటీవలే రూ.521 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- తుపాకులగూడెం బ్యారేజీకి ఎన్‌వోసీ ఇవ్వని చత్తీస్‌గఢ్ ప్రభుత్వం
- బ్యారేజీ నిర్మించినా నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి
- జల విద్యుత్ ఉత్పత్తికి అడుగులు పడని వైనం
- తుపాకులగూడెం బ్యారేజీ వద్ద 240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఏర్పాట్లు
- బ్యారేజీపై చత్తీస్‌గఢ్ అభ్యంతరాలు.. నిలిచిన జల విద్యుత్ ఉత్పత్తి...
- ఇటీవల దావోస్‌లో సన్ పెట్రో కెమికల్స్ కంపెనీతో హైడ్రో విద్యుత్‌పై ఒప్పందం
- ప్రభుత్వం దృష్టి పెడితే జలవిద్యుత్‌తో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఛాన్స్
- నేటి మంత్రుల బృందం పర్యటనపై ఎన్నో ఆశలు

ఉమ్మడి వరంగల్ జిల్లాకు వర ప్రదాయినిగా చెప్పుకునే దేవాదుల ప్రాజెక్టు పాతికేళ్లు గడిచినా పూర్తి కావటం లేదు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఆగుతూ.. సాగుతున్న దేవాదుల ప్రాజెక్టు పనులు ఇప్పటి వరకు దాదాపు 90శాతం పూర్తయ్యాయి. భూసేకరణతో పాటు దేవాదుల ఫేజ్-3లో మిగిలిన పనులు పూర్తి కావాల్సి ఉంది. మరో వైపు దేవాదుల ఎత్తిపోతలకు నీటిని నిల్వ చేసేందుకు నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీకి చత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఎన్‌వోసీ ఇవ్వటం లేదు. దీంతో రూ.2,121కోట్ల వ్యయంతో నిర్మించిన బ్యారేజీలో నీటిని నిల్వ చేసే పరిస్థితి లేదు. అలాగే బ్యారేజీతో పాటు 24 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తిని చేసే ప్రాజెక్టు పనులు సైతం అర్ధాంతరంగా నిలిచి పోయాయి. చత్తీస్‌గఢ్ నుంచి సమ్మక్క బ్యారేజీకి ఎన్‌వోసీ రాకపోవటంతో జలవిద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ధనసరి సీతక్క ఆదివారం దేవాదుల, సమ్మక్క బ్యారేజీ పరిశీలనకు వస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. వారి భవిష్యత్తు కార్యాచరణ ఏమిటనేది ఆసక్తికరంగా మారింది.

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఉమ్మడి వరంగల్ జిల్లా రైతాంగానికి సాగునీటిని అందించాలనే లక్ష్యంతో 204-05లో అప్పటి ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. అయితే గత పాలకుల నిర్లక్ష్యం, నిధుల కొరతతో గత పాతికేళ్లకు పైగా పనులు ఆగుతూ.. సాగుతున్నాయి. రూ.6,016 కోట్ల అంచనా వ్యయంతో మొదలైన దేవాదుల ప్రాజెక్టు వ్యయం రూ.17,500కు పెరిగింది. ఇప్పటి వరకు రూ.14,188కోట్లు ఖర్చు చేశారు. దాదాపుగా 90శాతంకు పైగా పనులు పూర్తయ్యాయి. దేవాదులలో కీలకమైన మూడో దశ పనులు కూడా దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఇటీవలే దేవన్నపేట వద్ద మూడో విడత పంపులను రన్ చేశారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి స్టేషన్‌ఘనపూర్, జనగామ, పాలకుర్తి, వర్ధన్నపేట, ఆలేరు, సిద్దిపేట తదితర నియోజకవర్గాలకు నీటిని లిఫ్టు చేసేందుకు కావాల్సిన సబ్ రిజర్వాయర్‌లు, కాలువలు తదితర పనులు కొన్ని చోట్ల పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు 33,224 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా, సుమారు 30,268 ఎకరాల వరకు భూసేకరణ పూర్తి చేశారు. మిగతా సుమారు 3వేల ఎకరాల భూమిని సేకరించటంలో జాప్యం జరుగుతోంది. ప్రధానంగా భూములకు ధరలు పెరగటంతో 2005 నాటి ధరకు రైతులు భూములు అప్పగించేందుకు ముందుకు రావటం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం (మిగతా 7వ పేజీలో)

ఇదీ మంత్రుల పర్యటన షెడ్యూల్..

ములుగు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క సాగర్ బ్యారేజీ, దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సహా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకి టి శ్రీహరి, ధనసరి సీతక్క ఆదివారం పరిశీలించనున్నారు. నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై వాటి స్థితిగతులను సమీక్షించనున్నారు. మంత్రులు కన్నాయిగూడెం మండల కేంద్రానికి మధ్యాహ్నం 3.45గంటలకు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. తుపాకులగూడెంలోని సమ్మక్కసాగర్ బ్యారేజీ, దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టును పరిశీలించనున్నారు. సాయంత్రం 5.45 గంటలకు అధికారులతో సమావేశమై ప్రాజెక్టు స్థితిగతులపై సమీక్షిస్తారు. సాయంత్రం 6 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరుతారు. కాగా, కన్నాయిగూడెంలో మంత్రులు పర్యటన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లను చేపట్టింది. కలెక్టర్ దివాకర శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. సభావేదిక, రోడ్లు, లైటింగ్, సీటింగ్ ఏర్పాట్లను పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు.

పండుగ వేళ ఆర్టీసీ షాక్

- ప్రత్యేక బస్సుల పేరుతో ప్రయాణికులపై బాదుడు
- టికెట్ చార్జీలు 50 శాతం పెంపు
- రేపటి వరకు వరకు అమల్లో ఉంటాయన్న అధికారులు
- వరంగల్ రీజియన్‌లో 130 ప్రత్యేక బస్సులు



హనుమకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వరలక్ష్మి వ్రతం, రాఖీ పండుగ మర్నాడు ఆదివారం.. ఇలా వరుస సెలవులు రావడంతో సహజంగానే ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈ బస్సుల పేరుతో అదనపు చార్జీలను కూడా బాదుతోంది. ప్రత్యేక బస్సులపై ఏకంగా 50 శాతం మేరకు చార్జీలను పెంచడంతో ప్రయాణికులు షాక్‌కు గురవుతున్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ఇప్పటికే ఆర్టీసీ బస్సులు వారితో కిటకిటలాడుతున్నాయి. ఇక శ్రావణ మాసం అందులోనూ ప్రత్యేకంగా వారికి సంబంధించిన పండుగలైన వరలక్ష్మి వ్రతం, రాఖీ పండుగలు రావడంతో రద్దీ మరింత పెరిగింది. ఆదివారం కలుపుకొని వరుసగా మూడు రోజుల సెలవులు రావడంతో మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి తమ పుట్టిళ్లు, బంధువుల ఇళ్లు, దేవాలయాలు, ఇతర పుణ్యక్షేత్రాలకు ప్రయాణం కట్టడంతో ఈనెల 7వ తేదీ నుంచి వరంగల్ రీజియన్‌లో 9 బస్సు డిపోల పరిధిలోని బస్‌స్టేషన్లలో ప్రయాణికులు కిటకిటలాడుతూ కనిపిస్తున్నారు. శుక్ర, శనివారాల్లో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈనెల 7వ తేదీన 70, 8న 130, 9న 105 ప్రత్యేక బస్సులను నడిపింది. తిరుగు ప్రయాణికుల కోసం ఈనెల 10న 105, 11న 130 ప్రత్యేక బస్సులను నడుపనున్నది. అయితే బస్‌చార్జీలను 50 శాతం పెంచడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ నిర్ణయంతో ప్రైవేటు ట్రావె ల్స్ కూడా ఇదే అవకాశంగా చార్జీలను పెంచాయి. దీంతో పండుగ పూట ఇంటికి వెళ్లాలనుకున్న ప్రయాణికులకు పెరిగిన టికెట్ ధరలు భారంగా మారాయి. సామాన్యులకు అందుబాటులో ఉండే టికెట్ ధరలతో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తామని చెప్పిన ఆర్టీసి సంస్థ పండుగ వేళ మాత్రం అధిక భారం మోపుతుండడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదేమి దోపిడీ ?

రాఖీ పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని చెబుతున్న ఆర్టీసి అధిక చార్జీలు వసూలుచేసి ప్రయాణికులను నిలువు దోపిడీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సాధారణ రోజుల్లో ఉండే టికెట్ ధర మీద ఏకంగా 50 శాతం చార్జీలు పెంచి వసూలు చేయడాన్ని ప్రయాణికులు జీర్ణించుకోలేకపోతున్నారు. మామూలు రోజుల్లో హనుమకొండ నుంచి ఉప్పల్‌కు వెళ్లడానికి రాజధాని బస్సు ఎక్కితే టికెట్ ధర రూ 390. కానీ ప్రత్యేక బస్సుల్లో ఒక్కో టికెట్‌పై రూ 160 నుంచి పెంచి రూ 550 వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. చార్జీల పెంపు కేవలం ప్రత్యేక బస్సులకు మాత్రమే వర్తిసుందని, సాధారణ బస్సుల చార్జీలలో ఎలాంటి మార్పు లేదని ఆర్టీసి అధికారులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉన్నందు వల్ల ప్రత్యేక బస్సులను రద్దీ సమయంలో నడిపినప్పటికీ తిరిగి వచ్చే బస్సులలో ప్రయాణికులు తక్కువగా ఉంటున్నారని ఆర్టీసి అధికారులు చెబుతున్నారు.

ఈ ఖాళీ బస్సుల నిర్వహణ వల్ల డీజిల్, ఇతర ఖర్చులు పెరుగుతున్నాయని, అందుకే ప్రత్యేక బస్సుల చార్జీలను పెంచినట్లు తెలిపారు. పెంచిన చార్జీలు ఈనెల 11 వరకు నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఆ తర్వాత సాధారణ బస్సుల చార్జీలు యధావిధిగా ఉంటాయని తెలిపారు. ప్రత్యేక బస్సులపై సమాచార బోర్డులను ఏర్పాటు చేశామని, టికెట్ ఇచ్చే సమయంలో ప్రయాణికులకు పెంచిన చార్జీల గురించి స్పష్టంగా తెలియచేస్తున్నామని అన్నారు.

నాగరికతను నేర్పింది ఆదివాసీలే..

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



నర్సంపేటలో కొమురంభీమ్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

నర్సంపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను నర్సంపేటలో శనివారం ఆదివాసీ గిరిజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్ల మధ్య గిరిజన సంప్రదాయ నృత్యాలు చేస్తూ పట్టణంలోని అమరవీరుల స్థూపం నుంచి పాఖాల రోడ్‌లోని కొమురంభీం విగ్రహం వరకు ర్యాలీని నిర్వహించారు. కొమురం భీమ్ విగ్రహానికి పూలు చల్లి గిరిజన సంఘాల నాయకులతో కలిసి కొమురంభీమ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ ప్రపంచానికి నాగరికతను నేర్పింది ఆదివాసీలేనని అన్నారు. ప్రకృతిని దైవంగా భావించే సంస్కృతి ఆదివాసీ గిరిజనులదేనని అన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందించేందుకు చేస్తున్న కార్యక్రమాల డాక్యుమెంటేషన్ పక్కగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని 13 మారుమూల గిరిజన గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధవహించి ఫీవర్ సర్వే నిర్వహించడంతో పాటు గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులు సందర్శించి పరిష్కారం కోసం తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నదన్నారు. వీటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూవో సౌజన్య, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నులి పురుగును నలిపేద్దాం..

- పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడానికి ఏర్పాట్లు
- అంగన్‌వాడీ కేంద్రాలు, పిహెచ్‌సీలు, పాఠశాలల్లో ఏర్పాట్లు
- ఈ నెల 11న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం
- 18వ తేదీన కూడా పంపిణీ

6



ఫెర్టిలిటీ కేంద్రాల్లో తనిఖీలు

- ఆరోగ్యశాఖ కార్యదర్శి ఆదేశంతో 8 బృందాల రాక
- ఉలిక్కిపడిన పలు ఆస్పత్రులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలోని సంతాన సాఫల్య (ఫెర్టిలిటీ) కేంద్రాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా ఆదేశంతో శుక్రవారం అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగాయి. రాష్ట్ర రాజధాని నుంచి 8 బృందాలు వరంగల్ జిల్లాకు చేరుకున్నాయి. ఒక్కో బృందంలో ఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్, గ్రూప్ వన్ అధికారి, ఒక వైద్యుడు, ఆరోగ్యశాఖ అధికారిని నియమించారు. వరంగల్ చేరుకున్న వెంటనే వరంగల్ జిల్లాలోని 25 సంతాన సాఫ్యల కేంద్రాల చిరునామాలు సేకరించారు. ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అనేక కేంద్రాల్లో స్కానింగ్ రిజిస్ట్రేషన్లకు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు తేడా ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. సంతాన సాఫ్యల కేంద్రం రిజిస్ట్రేషన్ సమయంలో పేర్కొన్న రేడియాలజిస్టులు, ఎంబ్రియాలజిస్టులు, గైనిక్ వైద్యుల పేర్లను ప్రస్తుతం నిర్వహిస్తున్న కేంద్రాల్లో నోటీసుబోర్డులో ఉంచారా లేదా అన్న విషయాలను సమగ్రంగా పరిశీలించారు. అదే విధంగా ఆ వైద్యులే చికిత్స అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. 60 ప్రశ్నలకు సంతాన సాఫల్యత కేంద్రాల నిర్వాహకుల నుంచి సమాధానాలు రాబట్టారు. గత ఆరు నెలలుగా నమోదు చేస్తున్న గర్భిణుల వివరాలు సేకరించారు. చికిత్స పొందుతున్న దంపతుల మ్యారేజ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డులను కూడా పరిశీలించారు. హార్మోనల్ మందుల వాడకాన్ని కూడా స్వయంగా పరిశీలించారు. ఆకస్మికంగా తనిఖీలు జరగడంతో వరంగల్ జిల్లాలో తనిఖీలు చేసిన 25 కేంద్రాల్లో కొన్నింటికి షోకాజ్ నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. తనిఖీ అధికారుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు సమాచారం.



కాజీపేటలో బస్టాండ్ ప్రతిపాదిత స్థలం

వీడిన చిక్కుముడి

- కాజీపేట బస్టాండ్‌కు రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్
- పీపీపీ పద్ధతిన నిర్మాణం
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అంగీకారం
- ఫలించిన ఎమ్మెల్యే నాయిని వ్యూహం

కాజీపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట బస్టాండ్ నిర్మాణానికి చిక్కుముడి వీడింది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) పద్ధతిన కాజీపేట బస్టాండ్ నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి రైల్వే స్థలం ఇవ్వడానికి రైల్వే శాఖమంత్రి అశ్విని వైష్ణవ్ సూత్రపాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. రైల్వే స్టేషన్ ముందున్న రైల్వే స్థలాన్ని ఇవ్వాలంటే అందుకు బదులుగా రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఇవ్వాలని రైల్వే శాఖ గతంలో పెట్టిన షరతుల నుంచి విరమించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో కాజీపేట బస్టాండ్ నిర్మాణానికి చిక్కుముడి వీడినట్లే. ఇక అధికారికంగా మరో వారంలో రైల్వే డీఆర్‌ఎం ఆర్ గోపాల కృష్ణన్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య కలిసి స్థలాన్ని పరిశీలించనున్నారు. అనంతరం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నివేదిక ఇచ్చిన వెనువెంటనే బస్టాండ్ నిర్మాణం పనులు చేపట్టడానికి ప్రత్యేక ప్రణాళికలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

మూడు దశాబ్దాల ఉద్యమానికి తెర

కాజీపేటలో బస్టాండ్ నిర్మించాలని మూడు దశాబ్దాలుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బస్టాండ్ నిర్మాణం కోసం 1990లో అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు కూడా పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రైవేట్ స్థలంలో ని ర్మించాలని పెద్దఎత్తున ఉద్యమం చేశారు. మూ డు దశాబ్దాల కలకు కాజీపేట బస్టాండ్ నిర్మించడానికి గ్రీన్ సిగ్నల్ రావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ నిర్మాణంతో కాజీపేట చుట్టుపక్కల సుమారు 50 గ్రామాల ప్రజలకు హైదరాబాద్‌తో పాటు వివిధ గ్రామాలకు వెళ్లేందుకు మంచి రవాణా సదుపాయంగా ఉండనుంది.

ఫలించిన ఎమ్మెల్యే వ్యూహం.

కాజీపేటలో బస్టాండ్ నిర్మిస్తామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పదే పదే చెప్పిన విషయం విధితమే. బస్టాండ్ నిర్మాణం కోసం రైల్వే స్టేషన్‌కు ఎదురుగా ఉన్న రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ సమీపంలోని రైల్వే ఇంగ్లీష్ మీడియం క్యాంపస్‌లోని ఒక ఎకరం స్థలాన్ని ఎంపిక చేశారు. అందుకోసం పలుమార్లు విషయాన్ని రైల్వే జీఎం, డీఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు.

రైల్వే స్థలం ఇస్తే అందుకు బదులుగా రాష్ట్ర ప్రభుత్వం మరోచోట స్థలం ఇవ్వాలని కండీషన్ పెట్టింది. రైల్వేకు ఇవ్వడానికి ప్రభుత్వ స్థలం అనుకూలంగా లేకపోవడంతో బస్టాండ్ నిర్మాణం చిక్కుముడి పడింది. ఈ మధ్యనే ఢిల్లీలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి బస్టాండ్ స్థలం విషయం చర్చించి వివరించారు. దీంతో రైల్వే మంత్రి రైల్వే స్థలం పీపీపీ పద్ధతిని ఇవ్వడానికి ఒప్పుకున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని అడుగగా ఆయన ధృవీకరించారు.

మానుకోటలో వృక్షా(రక్షా)బంధన్

చెట్లకు రాఖీలు కట్టిన 'ప్రజాహృదయం' స్వచ్ఛంద సంస్థ



వృక్షాలకు రాఖీ కట్టిస్తున్న హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌లో రాఖీ పర్వదినాన మానవాళికి ఆక్సిజన్ ఇచ్చే చెట్లకు రాఖీలు కట్టి వృక్షా(రక్షా) బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాహృదయం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు దైద వెంకన్న ఆధ్వర్యంలో పట్టణంలోని పలు చెట్లకు రాఖీలు కట్టారు. అనంతరం రాబోయే రోజుల్లో చెట్లు నరికివేస్తే ఆక్సిజన్‌ను మానవులు వీపుకు కట్టుకుని ఎలా తిరగాల్సి వస్తుందోనన్న విధంగా కళ్లకు కట్టినట్లుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దైద వెంకన్న మాట్లాడుతూ.. గత ఏడు సంవత్సరాలుగా రాఖీ పండుగ రోజున చెట్లకు రాఖీలు కడుతున్నామని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో మాదరబోయిన యాకయ్య, లింగన్న, రామక్క, స్వప్న, మంజుల,, కార్తీక్, ఐలేష్, హరిబాబు, కుమార్, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాయింట్ సెక్రటరీగా భాస్కర్



వడ్డెపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) హనుమకొండ జిల్లా జాయింట్ సెక్రటరీగా హనుమకొండ పట్టణానికి చెందిన చల్లగురుగుల భాస్కర్ నియమితులయ్యారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ఆదేశం మేరకు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండి సదానందం నియామక ఉత్తర్వులను శనివారం జారీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

బాలికపై సామూహిక అత్యాచారం?

- జనగామలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

జనగామ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలో బాలికపై సామూహిక అత్యాచార ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళితే.. జనగామ పట్టణానికి చెందిన ఓ బాలికను పలువురు యువకులు మభ్యపెట్టి వారం రోజుల కింద గోవాకు తీసుకెళ్లారు. గోవాలో బాలికపై అత్యాచారం చేయడంతో అక్కడి నుంచి వచ్చిన తర్వాత జిల్లా కేంద్రంలోని ఓ గదిలో అత్యాచారానికి పాల్పడ్డట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఘటన వారం క్రితం జరగగా మూడురోజుల క్రితం బాధ్యులైన యువకులపై పోక్సో కేసు నమోదైనట్లు తెలుస్తోంది. కాగా దీనిపై జనగామ సీఐ దామోదర్‌రెడ్డిని విచారణ కోరగా అలాంటి ఘటన జరగలేదని పేర్కొన్నారు. కాగా ఈఘటనపై పోలీసుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.



కాజీపేట ఆర్వోబీ పట్టాలెక్కేదెప్పుడో?

- బ్రిడ్జి పనుల్లో జాప్యం
- మూడేళ్లుగా కొనసాగుతున్న పనులు
- యేడాదిగా గడ్డర్‌ల పనులు



గడ్డర్‌లను బిగిస్తున్న కార్మికులు



నిర్మాణంలో ఉన్న ఆర్వోబీ

కాజీపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ఫాతిమానగర్‌లో నిర్మిస్తున్న అదనపు ఆర్వోబీ పనులకు ఆది నుంచి అపశకునాలే అన్నట్లుంది.. బ్రిడ్జి పనులకు నిధులు మంజూరైనా ఆరునెలల వరకు పనులు మొదలు కాలేదు. మూడు సార్లు టెండర్లు పిలిచినా పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్‌లు ముందుకు రాలేదు. ఎట్టకేలకు ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్ పనులు చేపట్టింది.. రైలు పట్టాలకు ఇరువైపులా బీమ్‌లు, స్లాబ్‌లు నిర్మించి దాదాపు మూడు సంవత్సరాలు పూర్తయ్యాయి. 2021 డిసెంబరు 31 నాటికి పనులు పూర్తి కావల్సి ఉన్నా ఇప్పటికీ రైల్వే ట్రాక్‌లపై గడ్డర్‌లు నిర్మించే పనులు గత ఏడాదిగా కొనసాగుతున్నాయి. ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నప్పటికీ బ్రిడ్జి పనులు మాత్రం ఇంకా సాగుతూనే ఉన్నాయి.. ఈ ఏడాది చివరిలోనైనా పనులు పూర్తై పట్టాలెక్కుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ట్రాఫిక్ సమస్యకు చెక్...

కాజీపేట ట్రైసిటీ ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్య ఈ బ్రిడ్జి నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభించనుంది. ఫాతిమానగర్‌లో ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి సుమారు 50 సంవత్సరాల క్రితం నాటి జనాభాకు అనుకూలంగా నిర్మించారు. అది ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. పైగా ఆ బ్రిడ్జి పైనుంచి ఉదయం పెద్దఎత్తున రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జిపై ఏ చిన్న ప్రమాదం జరిగినా... లేదా వాహనం మరమ్మతుకు గురైనా గంటల తరబడి ట్రాఫిక్ జామౌతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి పాత బ్రిడ్జికి సమాంతరంగా మరో బ్రిడ్జిని రూ. 40 కోట్ల వ్యయంతో 870 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి తెచ్చిన గడ్డర్లను బిగిస్తున్నారు. త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదివాసీల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- డీటీడీవో ప్రేమకళ
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



గిరిజన భవన్‌లో మాట్లాడుతున్న డీటీడీవో ప్రేమకళ

వడ్డెపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని డిస్ట్రిక్ట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీటీడీవో) ఆర్. ప్రేమకళ అన్నారు. ట్రై సిటీ ఆదివాసీ కమ్యూనిటీ హనుమకొండ, వరంగల్, కాజీపేట ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హనుమకొండ అంబేద్కర్ సర్కిల్ నుంచి గిరిజన భవన్ వరకు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడే విధంగా ఆట పాటలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజన భవన్‌లో కొమురంభీం, బిర్సా ముండే చిత్రపటాలకు పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రేమకళ మాట్లాడుతూ.. ఆదివాసీల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను రూపొందించి అమలు చేస్తోందని అన్నారు. తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అధమ స్థాయిలో జీవిస్తున్న ఆదివాసీలను ప్రభుత్వం ఆదుకోవాలని, రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రై సిటీ ఆదివాసీ కమ్యూనిటీ హనుమకొండ, వరంగల్, కాజీపేట అధ్యక్షుడు చాప బాబుదొర, ఆదివాసీ సంఘాల జేఏసీ నేత సోమ రామమూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లె అప్పయ్య, ఏటీడీవో రూపాదేవి, ఆదివాసీ సంఘాల నేతలు ఇరుప సారయ్య దొర, సుంచ పాపయ్య దొర, ప్రొఫెసర్ వనిత, డి. రమేష్, సోయం రాంమూర్తి, సోయం రాజేందర్, గట్టి ఎల్లయ్య, గిరిజన సంఘం నేత వాంకుడోతు వీరన్న నాయక్, మానవ హక్కుల సంఘం నేత బాదావత్ రాజు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పొరపాటు

- ఒకరికి బదులు మరొకరికి సమాచారం అందజేత
- ఉన్న గూటిని నేలమట్టం చేసిన కుటుంబం
- సాంకేతిక కారణాలతో బాధితులకు నష్టం
- ఇరువురికి న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ



బాధితురాలు సునీత

దామెర, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోగిల్వాయిలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకానికి అధికారులు ఎంపికలో పొరపాటు చోటు చేసుకుంది. గ్రామంలో ఒకే పేరు కలిగిన రెండు కుటుంబాల వారు ఉండడంతో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద లబ్ధిదారుల ఎంపికలో తప్పిదం జరిగింది. పోటు సునీత రవి దంపతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పోటు సునీత రవి దంపతులు ఉండగా సునీత పేరుమీద ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. అయితే ఇదే ఇంటిపేరుతో గ్రామంలో మరో జంట (సునీత, రవి) ఉన్నారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులకు సమాచారం అందించే క్రమంలో ఒకే పేరు కలిగిన రెండు కుటుంబాలకు చెందిన వారిలో ఒకరికి బదులు మరొకరికి గ్రామపంచాయతీ సెక్రటరీ ఫోన్ చేసి ఇల్లు మంజూరైన విషయం తెలిపారు. దీంతో వారు తమ పాత ఇంటిని కూల్చి వేసి నూతన ఇంటి నిర్మాణానికి పనులను ప్రారంభించారు. అయితే సాంకేతిక సమస్య(టెక్నికల్ ప్రాబ్లం) కారణంగా ప్రారంభ దశలో ఉన్న ఇంటి వివరాలు ఆన్‌లైన్ ద్వారా అమోదం పొందలేదు. ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. స్థానిక నాయకుల ద్వారా సమస్యను ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఇంటి నిర్మాణం కోసం ఉన్న ఇంటికి కూల్చివేసిన సునీత రవి దంపతులకు కూడా ఇంటి మంజూరుకు అధికారులకు ఆదేశాలిచ్చినట్లు బాధితులు తెలిపారు.

ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి?

బచ్చన్నపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఇంజక్షన్ వికటించటంతో వ్యక్తి మృతి చెందాడని ఆరోపిస్తూ శనివారం రాత్రి మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ ఇంటి ఎదుట పలువురు ఆందోళనకు దిగారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. బచ్చన్నపేటకు చెందిన జి.భిక్షపతి (45) కాళ్లనొప్పులతో ఉదయం 11గంటలకు ఆర్‌ఎంపీగా పనిచేస్తున్న కృష్ణ వద్దకు చికిత్స కోసం తీసుకొచ్చారు. ఇంజక్షన్ చేసి, మాత్రలు ఇచ్చి పంపగా, భిక్షపతి కండీషన్ సీరియస్ కావడంతో జనగామలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. దీంతో భిక్షపతి కుటుంబ సభ్యులు, పలువురు రాత్రి కృష్ణ వద్దకు వచ్చి నిలదీశారు. నీవల్లే చనిపోయాడంటూ ఆందోళన చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి అక్కడి నుంచి పంపించి వేశారు. ఇరువురి మధ్య రాజీ కోసం కొందరు యత్నించటంతో గొడవ ముదరకుండా సద్దుమణిగిందని తెలిసింది. ఈ విషయమై కృష్ణను వివరణ కోరగా, ఇంజక్షన్ చేసిన మాట వాస్తవమేనని, అంతకు మించి ఇందులో తన తప్పేమిలేదన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కురవి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కురవి మండలం లింగ్యాతండాకు చెందిన బానోత్ సైదమ్మ(50) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు. సైదమ్మ గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతుందని, దీనికి తోడు ఇతర అనారోగ్య కారణాలు, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఈ నెల 6న గడ్డి మందు తాగిందని చెప్పారు. తొలుత మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఏంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ.. మృతి చెందినట్లు చెప్పారు. కుమారుడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలి

- ఆదివాసీ నాయకపోడ్ దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాకర్

గోవిందరావుపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిరుత్సాహంగా జరిపిన ప్రభుత్వ యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నాయకపోడ్ దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బ సుధాకర్ డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించకుని మండలంలోని పస్రాలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు గొంది కిరణ్ జెండావిష్కరించగా కొమరంభీం విగ్రహానికి సుధాకర్‌తోపాటు ఎస్సీఎస్టీ అట్రాసిటీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు చింత కృష్ణ, ఎస్సై కమలాకర్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా దబ్బ సుధాకర్ మాట్లాడుతూ ప్రపంచమే ఆదివాసీ అస్తిత్వం వైపు ఆలోచిస్తున్న ఈ రోజుల్లో ప్రభుత్వ అధికారులు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని తూతూమంత్రంగా జరపడం బాధాకరమని అన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు, పరంపరగత జాతులు, ప్రజా ఉద్యమకారులతో కార్యక్రమానికి ముందుగానే ప్రభుత్వ ఆమోదిత కమిటీలను నిర్మాణంచేసి వారి నేతృత్వంలో ప్రతి గ్రామపంచాయతీలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో దండోరా జాతీయ నేత నెమలి నర్సయ్య, ఆదివాసీ సంఘాల నాయకులు ముద్దబోయిన రాము, పాయం నారాయణ, గొంది రాంచందర్, కేశవరావు, కూరాకుల సమ్మయ్య, జగన్నాథం, సాంబయ్య, ఎట్టి ఎల్లయ్య, మడె సాయిబాబు, ఈక జగ్గారావు, వట్టం సురేష్, చింత వెంకన్న, తాటి ఝాన్సీ, వివిధ సంఘాల నాయకులు కల్లెపల్లి రమేష్, కొండి రమేష్, సామ వెంకటరెడ్డి, ఎనగందుల మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ ఆత్మహత్య

అప్పుల బాధ భరించలేక మనస్తాపం



ఎల్లయ్య(ఫైల్)

రఘునాథపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించాలని బంధువులు ఒత్తిడి తీసుకరావడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మేకటగట్టులో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముక్క ఎల్లయ్య(52)కు భార్య రేణుక, ఇద్ద రు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వ్యవసాయ కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆరు నెలల క్రితం పెద్ద కూతురు వివాహం చేశారు. వివాహ సమయంలో తమ బంధువు వద్ద రూ.2లక్షలు అప్పు తీసుకున్నాడు. ఇదే పెళ్లికి హాజరైన అప్పు ఇచ్చిన వ్యక్తి తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎల్లయ్య కూతురు పెళ్లికి రావడంతోనే సదరు వ్యక్తి మృతి చెందాడని, అతను ఇచ్చిన అప్పు వెంటనే చెల్లించాలని బంధువులు ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం అప్పు ఇచ్చిన వారి బంధువులు మేకలగట్టుకు వెళ్లి ఎల్లయ్యపై ఒత్తిడి చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఎల్లయ్య శుక్రవారం అర్ధరాత్రి వంటింట్లోని ఇనుప పైపునకు ఉరి వేసుకొని చనిపోయాడు. కుటుంబ సభ్యులు శనివారం ఉదయం లేచి చూసే సరికి మృతదేహం వెళాడుతూ కనిపించడంతో భోరున విలపించారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

మద్యానికి డబ్బులు ఇవ్వడం లేదని..



రాజేష్ (ఫైల్)

గూడూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వడం లేదంటూ ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గూడూరు మండలం సీతానగరంలో శనివారం చోటు చేసుకుంది. గూడూరు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సీతానగరంకు చెందిన తాటి రాజేష్ (45) పెయింటర్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల రాజేష్ మద్యానికి బానిసయ్యాడు. తాను మద్యం తాగేందుకు భార్య రజితను డబ్బులు అడిగాడు. డబ్బులు లేవని భార్య చెప్పడంతో కోపోద్రిక్తుడైన రాజేష్ ఇంటి నుంచి రెండ్రోజుల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువుల ఇండ్లలో వాకబు చేశారు. సీతానగరం శివారు ఆకులబండతండ సమీపంలో ఓ వ్యవసాయ బావిలో రాజేష్ విగత జీవిగా కన్పించడంతో మృతుని కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న రాజేష్ భార్య కన్నీరు..మున్నీరుగా విలపించారు. మృతునికి భార్య రజిత, కుమార్తె భావన, కుమారుడు తేజ్‌చరణ్‌లు ఉన్నారు. మృతుడు రాజేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

మహిళకు పుస్తెలతాడు అప్పగింత

వరంగల్ క్రైం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆటోలో పడిపోయిన పుస్తెలతాడును ఓ ప్యాసింజర్ గుర్తించి పోలీసుల ద్వారా బాధిత మహిళకు అందజేశాడు.వివరాల్లోకి వెళితే.. హనుమకొండ ఎస్సై సతీష్ కథనం ప్రకారం... వైష్ణవి అనే మహిళ శనివారం హనుమకొండ బస్టాండ్ నుంచి వరంగల్ వైపు వెళ్లె ఆటో ఎక్కింది. మధ్యలో దిగిన వైష్ణవి 20 గ్రాముల తన పుస్తెలతాడును ఆటోలో పోగొట్టుకుంది. ఆటోలో ప్రయాణిస్తున్న షేక్ షరీఫ్ పుస్తెలతాడు గుర్తించి హనుమకొండ పోలీసులకు అప్పగించగా, బాధిత మహిళ సమాచారం తెలుసుకొని స్టేషన్‌కు పిలిపించి పుస్తెలతాడు అందజేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రఘునారెడ్డి, ఆటో డ్రైవర్ సలీం పాల్గొన్నారు.

సిరిసిల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదం

- నలుగురు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాసులకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం ఆర్టీసీ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో జయశంకర్‌భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం చెన్నాపూర్ గ్రామానికి చెందిన దేవేందర్, రాజు, మహేశ్, మణికాంత్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దేవేందర్, రాజు, మహేశ్, మణికాంత్‌లు కలిసి కారులో సిరిసిల్ల నుంచి రాచర్లబొప్పాపూర్ మీదుగా గంభీరావుపేటకు వెళుతున్నారు. కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపు వస్తున్న సిరిసిల్ల ఆర్టీసీ డిపో బస్సు ఎదురుగా ఢీకొట్టింది. కారు పూర్తి దెబ్బతింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

నులిపురుగును నలిపేద్దాం

- పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడానికి ఏర్పాట్లు
- అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, పాఠశాలల్లో ఏర్పాట్లు
- 11న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం
- 18వ తేదీన కూడా పంపిణీ
- ఉమ్మడి జిల్లాలో 13.11 లక్షల మందికి మాత్రలు



హనుమకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న జాతీయ నులి పురుగుల (పేగు పురుగు) నిర్మూలనా దినోత్సవం సందర్భంగా 1నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలను వేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు) ఆరోగ్య ఉపకేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో సైతం ఈ మాత్రలను పంపిణీ చేస్తారు. ఉమ్మడి జిల్లాలో 2600కు పైగా ప్రభుత్వ పాఠశాలలు, 8వేలకు పైగా ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 5 లక్షల మంది విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల్లో మరో 8 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడానికి ఆయా జిల్లాల వైద్య ఆరోగ్య శాఖలు కార్యాచరణ రూపొందించాయి. పాఠశాలల్లోనే కాకుండా బడిబయట ఉన్న పిల్లలను కూడా గుర్తించి వారికి కూడా మాత్రలు వేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

● పిహెచ్‌సీలు, స్కూళ్లు..

ఈనెల 11న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీలు) పరిధిలో మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పిహెచ్‌సీలు, 1680 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులతో పాటు బడి బయట ఉన్న వారికి అందిస్తారు. 11వ తేదీన అందుబాటులో లేని వారికి 18న కూడా పంపిణీ చేస్తారు. ఈ మేరకు అన్ని మండల కేంద్రాల్లో అల్బెండజోల్ ప్రాధాన్యాన్ని తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. 3 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో 6 నుంచి 15 ఏళ్లలోపు వారికి పీఎస్, యూపీఎస్, ఉన్నత పాఠశాలల్లో 16 నుంచి 19 ఏళ్లలోపు వారికి కళాశాలల్లో ఈ మాత్రలను పంపిణీ చేస్తారు. ఎవరెవరికి ఎంత మోతాదులో మాత్రలను ఇవ్వాలనేదానిపై ఎఎన్‌ఎంలు, ఆస్పత్రి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 1 నుంచి 2 ఏళ్ల వరకు సగం మాత్ర ఇస్తారు. దాన్ని బాగా నలిపి పొడిచేసి తినిపిస్తారు. 2 నుంచి 19 ఏళ్లలోపు వారికి ఒక మాత్ర ఇస్తారు. మాత్ర నేరుగా మింగరాదు. చప్పరించాలి. లేదా బాగా నమిలి మింగాలి. అల్బెండజోల్ మాత్రను ఇంటికి ఇవ్వరు.

● అపరిశుభ్రత వల్ల వ్యాప్తి..

కడుపులో నులిపురుగులతో పిల్లలు అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. వాటిని దూరం చేసి చిన్నారులు ఆరోగ్యవంతంగా ఎదిగేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పాటిస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణం, మురుగు కాలువలు, నిలువ నీరు, జంతువుల మలం తదితర వాటి వల్ల నులిపురుగుల వ్యాప్తి జరుగుతుంది. నిల్వ ఉన్న, చెడిపోయిన ఆహారం, సరిగ్గా ఉడకని మాంసం వంటివి కూడా నులిపురుగుల వ్యాప్తికి కారణమవుతున్నాయి. తీపి, పిండి పదార్థాలు ఎక్కువగా తీసుకున్నా, మలబద్దకం ఉన్నా నులిపురుగులు తయారవుతాయి. పిల్లలు మట్టిలో ఆడుకున్నప్పుడు గోళ్లలో మట్టి ఉండిపోతుంది. చేతులను నోట్లో పెట్టుకోవడం, కడగకుండా భోజనం చేయడం వంటి కారణాలతోనూ నులిపురుగులు సోకుతాయి.

● ఇవీ లక్షణాలు..

నులిపురురగులు పొట్టలో చేరి ఆపై మల ద్వారం వద్ద గుడ్లు పెడతాయి. దీంతో దురదగా ఉంటుంది. తెల్లమచ్చలు కనిపిస్తాయి. ఆజీర్ణంతో పాటు వాంతులు, విరేచనాలు అవుతుంటాయి. కొన్ని సందర్భాల్లో రక్తహీనత కలుగుతుంది. వీటితో పాటు వృద్ధి చెందే ఇతర క్రిముల వల్ల శక్తి క్షీణించడం, శారీరక ఎదుగుల ఆగిపోవడం వంటివి ఎదురవుతాయి.

● తీసుకోవలసిన జాగ్రత్తలు..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఆహారం తీసుకునే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడగాలి. పిల్లలకు దీనిపై అవగాహన కల్పించాలి. చేతి గోళ్లు ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. గోళ్లలో మట్టి లేకుండా చూసుకోవాలి. పాదరక్షలు ధరించాలి. అప్పుడే తయారు చేసిన వేడి ఆహారం తీసుకోవాలి. పిల్లలకు తీపి పదార్థాలు, చాక్లెట్లు, మలబద్ధకానికి కారణమయ్యే మైదా పిండి వంటలు బాగా తగ్గించాలి. 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయించాలి.

భూ వివాదంలో తొమ్మిది మందిపై కేసు

వరంగల్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని 3వ డివిజన్ పైడిపెల్లి ఆర్టీసీ కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న వారిని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఏనుమాముల సీఐ జివ్వాడి సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితురాలు మిట్టపల్లి స్వప్న కథనం ప్రకారం.. పైడిపల్లి ఆర్టీసీ కాలనీలో 2005లో తన మామ మిట్టపెల్లి ఉప్పలయ్య ఆర్టీసీ సొసైటీ దగ్గర సర్వేనంబర్ 1243లో 140గజాల భూమిని కొనుగోలుచేశారు. మూడు నెలల క్రితం అందులో ప్రహరీ నిర్మిస్తున్న క్రమంలో ఆర్టీసీ కాలనీకి చెందిన పిన్నింటి ప్రకాష్‌రావు, మామిడిపల్లి చిరంజీవి, దేవి ప్రసాద్, గణపతి రావు, సంపత్, నర్సింగరావు, రామోజీ మహేందర్, రాములు, కరుణాకర్ వచ్చి ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని అడ్డుకున్నారు. కాంపౌండ్ వాల్ నిర్మించాలంటే తమ డెవలప్‌మెంట్ కమిటీకి రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవ్వకపోవడంతో కొద్ది రోజుల తరువాత రూ.50వేలు పెట్టి నిర్మించిన ప్రహరీని ధ్వంసం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆ తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొరాయించిన ఇంటర్‌సిటీ రైలు

- కేసముద్రం, నెక్కొండ స్టేషన్‌లలో ఆగిపోయిన ఎక్స్‌ప్రెస్



నెక్కొండలో నిలిచిన ఇంటర్‌సిటీ

కేసముద్రం/నెక్కొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నెంబర్ 12705) శనివారం రాత్రి మొరాయించింది. శనివారం సాయంత్రం మహబూబాబాద్ నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరి కేసముద్రం దాటిన తర్వాత ఇంటికన్నె రైల్వేస్టేషన్ సమీపంలో నిలిచిపోయింది. బోగీల మధ్య ఏయిర్ లీకేజీ కావడంతో రైలు నిలిచినట్లు సిబ్బంది తెలిపారు. సుమారు రెండు గంటల తర్వాత రైల్వే సిబ్బంది సమస్యను పరిష్కరించిన అనంతరం రైలు సికింద్రాబాద్ వైపునకు కదిలింది. తర్వాత వరంగల్ జిల్లా నెక్కొండ రైల్వే స్టేషన్‌కు రాగానే మళ్లీ ఆగిపోయింది. నెక్కొండకు 7 గంటలకు రావాల్సిన రైలు మూడున్నర గంటలు ఆలస్యంగా వచ్చింది. ఇక్కడ రాత్రి 10.25గంటల నుంచి 11.30 గంటల వరకు నిలిచిపోయింది. సహనం కోల్పోయిన ప్రయాణికులు పలుమార్లు డ్రైవర్‌తో గొడవకు దిగారు. మరమ్మతు చేసిన తర్వాత ఎట్టకేలకు రైలు వరంగల్ వైపు కదిలింది. రాఖీ పండుగ కావడంలో రైల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. వారంతా తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. ఈ ఘటన ఫలితంగా కేసముద్రం-తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య కొత్తూరు సమీపంలో విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే 20708 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సైతం సుమారు గంటపాటు నిలిచిపోయింది.

రైతు బీమా ప్రక్రియ షురూ..

- ఈనెల 13వ తేదీ వరకు పూర్తి
- 14 నుంచి 8వ పాలసీ సంవత్సరం
- ఆర్‌వోఎఫ్‌ఆర్, కొత్త పట్టాదారు పాసుపుస్తకందారులకు ప్రాధాన్యత
- పాతవారి రెన్యూవల్‌కు డాటా పరిశీలన
- బీమా కిందకు కొత్తగా 1.50 లక్షల మంది
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 9.50 లక్షల రైతులకు బీమా

హనుమకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతు బీమా(ఫార్మర్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్) 2025-26 సంవత్సరానికి సంబంధించి అమలుకు కసరత్తు మొదలైంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు. రైతు బీమా స్కీమ్ 8వ పాలసీ సంవత్సరం ఈనెల 14 నుంచి ప్రారంభమవుతుంది. దీంతో కొత్తగా రైతులను చేర్చుకోవడం, ఇంతకు ముందే చేరిన రైతుల పాలసీలను రెన్యూవల్ చేయడంవంటి ప్రక్రియలను ఈనెల 13వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా 13లోగా రైతులు బీమా పోర్టల్‌లో నమోదు అయ్యే కార్యక్రమం ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైంది. ఈసారి కొత్త పట్టాదారు పాసుపుస్తకందారులను బీమా పరిధిలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. 18 నుంచి 59 ఏళ్లు కలిగిన కొత్త పట్టాదార్ పాసుపుస్తకందారులు రైతు బీమాలో చేరేందుకు అర్హులు. ఈ సంవత్సరం జూన్ 5వ తేదీ నాటికి భూ భారతి ద్వారా కొత్త పట్టాదార్ పుస్తకాలు వచ్చిన రైతులు, అలాగే గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ నుంచి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన రైతులు బీమాకు అర్హులుగా వ్యవసాయ శాఖ గుర్తించనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9.40 లక్షల మంది పట్టాదారు పాసుపుస్తకాలున్న రైతులు ఉన్నారు. 2025-26 సంవత్సరానికి రైతు బీమా కోసం అందే దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు రైతు బీమా పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

కొత్తవారికి ప్రాధాన్యం..

గత జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతుల వివరాలను వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) సేకరిస్తున్నారు. వారిలో బీమాకు అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియను వ్యవసాయాధికారులు(ఏవో) కొనసాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో గతంలో పట్టాలున్న రైతుల్లో సుమారు 75వేల మంది అన్నదాతలు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోలేదు. బీమా గురించి అవగాహన లేకపోవడం, ఉదాసీనత, ఉమ్మడి కుటుంబ పరమైన సమస్యలు ఇందుకుకారణం. వారు సైతం ఈసారి దరఖాస్తులు చేసుకోవడానికి వ్యవసాయ శాఖ అనుమతిచ్చింది. ఈసారి కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు గతంలో అర్హత ఉండి ఇప్పుడు దరఖాస్తు చేసుకునేవారు అందరు కలిపి దాదాపు లక్షా 50వేల వరకు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. దీంతో రైతు బీమా పరిధిలోకి వచ్చేవారి సంఖ్య పెరగవచ్చునని భావిస్తున్నారు. కొత్త, పాత రైతుల వివరాలను నమోదు చేయడంపై వ్యవసాయ శాఖ డీఏవో, ఎంఏవో, ఏవో, ఏఈవోలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అర్హులైన రైతులందరు రైతు బీమా పరిధిలోకి వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఈ విషయంలో ఏఈవో, ఎంఏవో, ఏడీలకు మార్గదర్శనం నెరపాలని సూచించింది.

ప్రాధాన్యతా క్రమంలో..

కొత్త, పాత పట్టాదారులు, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాదారుల వివరాలను గ్రామాల వారీగా బీమా పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను వ్యవసాయ శాఖ నాలుగు కేటగిరీలుగా విభజించింది. ప్రాధాన్యతా క్రమంలో పాలసీ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారికి కేటగిరి ఒకటి కింద ప్రాధాన్యత ఇస్తూ వీరి వివరాలను బీమా పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను ఈనెల 13వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించింది. 5 ఎకరాల కన్నా తక్కువ వ్యవసాయ భూమి కలిగిన పాత పట్టాదారుల వివరాలను కూడా రెండవ కేటగిరి కింద ఈనెల 13వ తేదీ నాటికి అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఇక మూడవ కేటగిరి కింద గతంలో రైతు బీమా కింద నమోదై ఉండి 8వ సంవత్సరం పాలసీలోనూ కొనసాగే అర్హులైన రైతుల వివరాలను మండల వ్యవసాయాధికారులు(ఎంఏవో) లాగిన్లలో అందుబాటులో ఉంచాలని, ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్ది, కొత్తగా వివరాలేమైనా అందుబాటులో ఉంటే వాటిని కూడా చేర్చి తిరిగి ఏఈవోల లాగిన్‌లలోకి పంపాలని, ఈప్రక్రియను కూడా ఈనెల 12వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించింది. ఇక నాలుగవ కేటగిరి కింద చివరి ప్రాధాన్యతా అంశంగా 5ఎకరాల కన్నా మించి భూమి ఉండి ఇప్పటివరకు రైతు బీమా పరిధిలోకి రానివారిని గుర్తించి వివరాలను సైతం ఈనెల 13వ తేదీ నాటికి పోర్టల్‌లో చేర్చాలని కోరింది.

రెన్యూవల్ డేటా పరిశీలన

జూలై 30వ తేదీ వరకు గత ఏడాది రైతు బీమా కలిగిన రైతుల రెన్యూవల్స్‌కు సంబంధించి డేటాను పరిశీలించారు. నిరుడు రైతు బీమా అమలైన వారిలోనూ 60 ఏళ్లు పైబడిన వారిని తొలగించి మిగతా అర్హులైన రైతులకు బీమాను రెన్యూవల్ చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. వీరి పూర్తి వివరాలను ఏఈవోలు రైతు బీమా పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇలా పాత రెన్యూవల్స్‌తో పాటు కొత్తగా అర్హులైన వారిని కలిపి ఈ ఏడు మొత్తంగా సుమారు 10.50 లక్షలకు పైగా రైతులకు బీమా చేయనున్నారు. గత ఏడాది ఒక్కో రైతుకు బీమా ప్రీమియంగా రూ.3,600 వరకు ప్రభుత్వం ఎల్‌ఐసీకి చెల్లించింది. ఈ ఏడు కూడా ఎంత ప్రీమియం అనేది త్వరలో తేల్చనున్నది. రైతు బీమా ఉన్న రైతులు సహజ మరణం పొందినా లేదా ప్రమాదవశాత్తు మరణించినా సదరు రైతు కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం అందుతుంది.

బంధన్ హే... ప్యార్ కా

- ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు
- ఉమ్మడి జిల్లా అంతటా సందడి
- వేడుకల్లో పాల్గొన్న అధికారులు, అనధికారులు



ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని, ఆప్యాయతను ప్రముఖంగా చాటే రాఖీ పౌర్ణమి వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం కోలాహలంగా జరిగాయి. ఇంటింటా రక్షాబంధన్ వేడుకలతో సందడి చేశారు. శ్రావణ మాస వేళ పవిత్ర శనివారం వెంకటేశ్వర స్వామి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రంతో పాటు శ్రావణ పౌర్ణమి కూడా కలిసి రావడం చాలా విశేషం. ఈ క్రమంలో రక్షాబంధన్ వేడుకలను ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున జరుపుకున్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. అదే విధంగా హనుమకొండలోని నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మహిళలు ముఖ్యంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ ఆధ్వర్యంలో మహిళలు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఇదే బృందం హనుమకొండలోని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలను కలిసి రాఖీలు కట్టారు.



మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌కు రాఖీ కడుతున్న సోదరి

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో..

ప్రజాపిత ఈశ్వరియ విశ్వవిద్యాలయం హనుమకొండ శాఖ నిర్వాహకులు రాజయోగిని విమల ఆధ్వర్యంలో హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పట్టాభి రామారావులతోపాటు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డితోపాటు ఆర్టీసీ ఆర్ఎం, ఇంకా నగరంలోని ప్రముఖులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. డాక్టర్ శ్రీకుమార్, డాక్టర్ వెంకటరమణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్‌కు అనేక మంది మహిళలు ఆప్యాయంగా రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.

హనుమకొండలోని 320ఎఫ్ జిల్లా లయన్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, ఎఫ్‌వీడీడీ నరహరి సుధాకర్‌రెడ్డి, పుట్ట హరికిషన్‌రెడ్డిలకు పలువురు మహిళా క్లబ్ సభ్యులు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హనుమకొండ రెడ్డికాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం ఆలయంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు వంగాల సోమయాజులు శ్రావణ పౌర్ణమి విశిష్టతను, శ్రీ వేంకటేశ్వర స్వామి వైభవాన్ని భక్తులకు తెలియజెప్పారు. కార్యక్రమ ఇన్‌చార్జి రామిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆలయ చైర్మన్ ముప్పిడి విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బత్తిని వెంకటయ్య, అర్చకులు శ్రీనివాసాచార్యులు, భాగ్యలక్ష్మి, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు రాఖీ కడుతున్న సేవికా సమితి సభ్యులు

గవర్నర్‌కు..

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు హనుమకొండకు చెందిన రాష్ట్ర సేవికా సమితి ప్రాంత సంచాలిక డాక్టర్ అరుణ ఆధ్వర్యంలో అనిత, ఉమ తదితరులు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. హనుమకొండలోని స్పందన మానసిక వికలాంగుల కేంద్రంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కరుకాల అనితారెడ్డి మానసిక దివ్యాంగ పిల్లలకు ఆప్యాయంగా రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి వేడుకల్లో పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి రాఖీ కడుతున్న కాంగ్రెస్ మహిళా నాయకులు

చెట్లకు రాఖీ కట్టిన వనప్రేమికుడు



శాంతివనంలో చెట్టుకు రాఖీ కడుతున్న వన ప్రేమికుడు గోకా రామస్వామి

నర్సంపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రక్షాబంధన్ రోజు ఆడపడుచులు అన్నదమ్ములకు రాఖీలు కట్టి పండుగను జరుపుకుంటారు. ఇందుకు భిన్నంగా నర్సంపేట పట్టణం వల్లబ్‌నగర్ సమీపంలోని శాంతివనంలో చెట్లకు పర్యావరణవేత్త, వనప్రేమి గోకా రామస్వామి శనివారం మహిళలు, పిల్లలతో కలిసి రాఖీలు కట్టి ప్రకృతి పరిరక్షణ ప్రాముఖ్యతను, మొక్కలపైతనకున్న ప్రేమను చాటుకున్నారు. అనంతరం స్థానిక జైలులో ఖైదీలకు రామస్వామి రాఖీలు కట్టించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గిరగాని సుదర్శన్ గౌడ్, బెజ్జంకి ప్రభాకర్, బోయిని వెంకటస్వామి, మొగిలిచర్ల రాము గోకా రామస్వామిని అభినందించారు.

సోదరుడి విగ్రహానికి రాఖీ కట్టిన అక్కలు



అక్కల్‌చెడలో హరిప్రసాద్ విగ్రహానికి రాఖీ కడుతున్న సోదరి

చెన్నారావుపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలో బోనగిరి సారయ్య-ఐలమ్మల కుమారుడు హరిప్రసాద్ నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుమారుడి విగ్రహాన్ని ఇంటి పక్కన ఉన్న చెలకలో ఏర్పాటు చేశారు. శనివారం రాఖీ పండుగ సందర్భంగా హరిప్రసాద్ విగ్రహం చేతికి సోదరీమణులు శిరీష, ప్రవళిక రాఖీలు కట్టారు. తమ్ముడు లేకుండా రాఖీ పండుగను జరుపుకోవడం బాధగా ఉందని సోదరీమణులు ఆవేదన వ్యక్తం చేశారు.



కనుచూపు మేరకు లారీల కనువిందు

ఆసక్తిగా పరిశీలించిన ప్రయాణికులు

ఒక్కటి కాదు... రెండు కాదు... సుమారు 80 వరకు కనుచూపు మేరకు లారీలు కనువిందు చేశాయి. గూడ్స్ రైలులో తెల్లని కొత్త లారీలు వరంగల్ వైపునకు రవాణా అవుతుండగా కేసముద్రం స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఈ రైలు నిలిచింది. దీంతో రైలుపై వరుసగా కొత్త లారీలు ఉండడంతో పలువురు ప్రయాణికులు ఆసక్తిగా పరిశీలించారు.

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

పరిశోధనలో నైతికతను పాటించాలి

- కొచ్చిన్ నేషనల్ లా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీబీరెడ్డి



ఆన్‌లైన్ సదస్సులో మాట్లాడుతున్నజీబీరెడ్డి

కేయూ క్యాంపస్ ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పరిశోధకులందరూ తప్పనిసరిగా నైతికతను పాటించాలని కేరళలోని కొచ్చిన్ నేషనల్ లా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ జీబీ రెడ్డి ఉద్బోధించారు.కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ నేతృత్వంలో 2014లో పీహెచ్‌డీ ప్రవేశాలు పొందిన స్కాలర్లకు రీసెర్చ్ మేథడాలజీపై ఆన్‌లైన్ సదస్సును నిర్వహిస్తున్నారు. ఆగస్టు 4న ప్రారంభమైన ఓరియంటేషన్ తరగతులు 11 వరకు కొనసాగనున్నాయి. ఈసందర్భంగా శనివారం కేరళలోని కొచ్చిన్ నేషనల్ లా వర్సిటీ వైస్ చాన్స్‌లర్, తెలంగాణ లా సెట్ మాజీ కన్వీనర్ ప్రొఫెసర్ జీబీరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయ విద్య, పరిశోధన, నైతికత విలువలు, ప్లెగరీజంనకు సంబంధించిన విషయాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. మహారాష్ట్ర జాతీయ విశ్వవిద్యాలయం మాజీ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ వైఎఫ్ జయకుమార్, విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సీపీ నందిని, తిరుపతిలోని పద్మావతి మాజీ డైరెక్టర్, ఈసీ మెంబర్ ప్రొఫెసర్ కె.ఉమాదేవి, కేయూ పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్, స్టాటస్టిక్స్ అంశంపై కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ కంట్రోలర్ ఎం.అంజయ్య, న్యాయ విద్య పరిశోధనలో టెక్నాలజీ పాత్ర అనే అంశంపై మాట్లాడారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ జి.రామేశ్వరం, లా ఫ్యాకల్టీ డీన్లు విజయలక్ష్మి, విజయ్‌చంద్ర, కాజీపేట ఎంజేపీప్రభుత్వ లాకాలేజ్ ప్రిన్సిపాల్ ఎన్.రవి, కేయూ లా కాలేజ్ పార్టుటైం అధ్యాపకులు రీసెర్చ్ పర్సన్స్‌గా వ్యవరించారు.

కన్నీటి రాఖీ

- అంత్యక్రియల్లో సోదరుడి మృతదేహానికి రాఖీ కట్టిన అక్కలు



కేసముద్రం విలేజ్‌లో అంత్యక్రియల్లో తమ్ముడి మృతదేహానికి రాఖీ కడుతున్న అక్కలు

కేసముద్రం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సోదరీమణులకు రక్షణగా అక్కాతమ్ముళ్ల మధ్య అనుబంధాలకు ప్రతీకగా రాఖీ పండుగ నిర్వహిస్తారు. ఇదే రోజున తమ్ముడు మృతి చెందడంతో భౌతికఖాయానికి కన్నీళ్లతో చివరి రాఖీ కట్టగా, ఈ దృశ్యం చూసిన వారి హృదయాలు బరువెక్కి కళ్లుచెమ్మగిల్లాయి. మృత్యువు మా అనుబంధాన్ని వేరు చేయలేదని చెబుతున్నట్లుగా రోదనల మధ్య అక్కలు తమ్ముని చేతికి రాఖీ కట్టారు. ఈ విషాదకర ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని కేసముద్రం విలేజీలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సుంకరబోయిన యాకన్న(50) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు రాఖీపండుగ రోజు కావడంతో అతడి అక్కలు పూలమ్మ, జయమ్మ, దేవ, నాగమ్మ, నీలమ్మ చివరి రాఖీ కట్టడం వారి మధ్యనున్న అనుబంధం ఒకవైపు, విషాదం మరోవైపు అందరినీ చలింపజేసింది. యాకన్నకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

బస్సులో తమ్ముడికి రాఖీ కట్టిన కండక్టర్



బస్సులోనే సోదరుడికి రాఖీ కడుతున్న కండక్టర్

మరిపెడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాఖీ పౌర్ణమి ప్రయాణికుల రద్దీతో ఓ బస్సు కండక్టర్‌కు అధికారులు సెలవు ఇవ్వకపోవడంతో డ్యూటీ చేసే సర్వీస్ రోడ్డు దగ్గరికి తమ్ముడిని పిలుపించుకుని రాఖీ కట్టింది. ఈ ఉదంతం సామాజిక మాధ్యమంలో శనివారం వైరల్‌గా మారింది. మరిపెడ మండలం నీలికుర్తికి చెందిన శైలజకు చిన్నగూడూరు మండలం విస్సంపల్లికి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరుగగా ఖమ్మంలో నివాసంఉంటున్నారు. ఆమె ఖమ్మం ఆర్టీసీ బస్సు డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తోంది. శనివారం రాఖీ పండుగ కావడంతో సెలవు ఇవ్వాలని ఆర్టీసీ అధికారులను ఆమె కోరగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రాఖీ పండుగకు ఉద్యోగులకు సాధారణ సెలవులను రద్దు చేశారు. చేసేదేమిలేక డ్యూటీలోనే నిమగ్నమైంది. అదృష్టావశాత్తు ఆమెకు శనివారం ఖమ్మం-తొర్రూర్ షటిల్ సర్వీస్ డ్యూటీ పడింది. నీలికుర్తి ఆమె విధులు నిర్వహించే బస్ సర్వీస్ రూట్‌లో ఉండడంతో తన సోదరుడిని ఆ స్టేజీకి బస్సు వచ్చే సమయానికి రమ్మని బస్సులోనే రాఖీ కట్టి పండుగ అనుబంధాన్ని చాటుకుంది. ఆ బస్సులోని ప్రయాణికులు అక్కా-తమ్ముడికి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

'దేవాదుల'.. గట్టెక్కేనా!?

(5వ పేజీ తరువాయి)

అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాధాన్యత ప్రాజెక్టుగా గుర్తించారు. దేవాదుల పనులను పూర్తి చేసేందుకు ఇటీవలే రూ.521 కోట్ల వరకు నిధులు విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికి పనులు పూర్తయ్యే అవకాశం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై మంత్రుల బృందం ఆదివారం తమ పర్యటనలో అధికారులతో సమీక్ష నిర్వహించనుంది.

సమ్మక్క సాగర్‌పై ఛత్తీస్‌గఢ్ కొర్రీలు..

దేవాదుల ఎత్తిపోతలకు నీటి నిల్వలను పెంచాలనే లక్ష్యంతో 2018లో ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరిపై సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం చేశారు. సుమారు రూ.2,121 కోట్ల వ్యయంతో 83 మీటర్ల ఎత్తు, 1,132 మీటర్ల పొడువు, 10 మీటర్ల వెడల్పుతో బ్యారేజీతో పాటు వంతెన నిర్మాణం చేశారు. మొత్తం 60 పియర్స్, 59 రేడియల్ గేట్లను నిర్మించారు. ఈ బ్యారేజీలో 6.94 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించారు. ఈ నీటిని ఐదు కిలోమీటర్ల దూరంలో ఎగువన గోదావరిపై నిర్మించిన దేవాదుల ఎత్తిపోతల పంపుహౌస్ ద్వారా 65 టీఎంసీలను లిఫ్ట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే గతప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ) తీసుకోకుండా గోదావరిపై సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం చేపట్టింది. కనీసం సాంకేతిక సలహా కమిటీ(టీఏసీ) క్లియరెన్స్ కూడా లేకుండానే బ్యారేజీ నిర్మాణం చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. కేంద్ర జల సంఘాని(సీడబ్ల్యూసీ)కి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఫిర్యాదు కూడా చేసింది. ఈ బ్యారేజీతో తమ రాష్ట్ర పరిధిలో 100 గ్రామాలతోపాటు వేలాది ఎకరాలపంటలు, అటవీభూములు నీటమునుగుతాయని ఛత్తీస్‌గఢ్ వాదిస్తుంది. ఈ క్రమంలోనే 2023 మే నెలలో సీడబ్ల్యూసీకి గత ప్రభుత్వం బ్యారేజీకి అనుమతుల కోసం లేఖ రాసింది.


ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అనుమతి లేకుండా బ్యారేజీ నిర్మించారని ఫిర్యాదులు అందాయని, ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ తీసుకరావాలని తెలంగాణ ప్రభుత్వానికి సీడబ్ల్యూసీ సూచించింది. తమ అభ్యంతరాలనుంచి వెనుక్కి తగ్గేది లేదని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మొండికేస్తున్నది. దీంతో 2వేల కోట్లకుపైగా ఖర్చు చేసిన తుపాకులగూడెం బ్యారేజీకి అనుమతులు లేకపోవటంతో కాగితాల్లోని ప్రాజెక్టుగా నామమాత్రంగా మిగిలిపోతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ అధికారులు ఎన్‌వోసీ కోసం లేఖ రాశారు. కేవలం 44 హెక్టార్లే నీట మునుగుతుందని తెలంగాణ ప్రభుత్వం ఛత్తీస్‌గడ్‌కు స్పష్టం చేసింది. అయినప్పటికీ సమాధానం రాకపోవటంతో మరోసారి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలనే లక్ష్యంతో మంత్రుల బృందం సమ్మక్క సాగర్ బ్యారేజీ పరిశీలనకు వస్తున్నారు.

జల విద్యుత్‌కు మోక్షం కలిగేనా..?

సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద రన్ ఆఫ్ ది రివర్ జనరేషన్ సహాయంతో 240 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా ప్రాజెక్టును రూపొందించారు. ప్రాజెక్టుకు కుడి వైపున రెగ్యులేటర్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తడానికి, విద్యుత్ ఉత్పత్తికి అవసరమయ్యే యంత్రాలు రన్ చేసేందుకు 33కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.1200కోట్లు అవసరంగా అప్పట్లో ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే తుపాకులగూడెం బ్యారేజీని 2018లో ప్రారంభించి, 2023లో పూర్తి చేశారు. అయితే బ్యారేజీతో పాటు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టును కూడా పూర్తి చేయాలని నిర్ణయించినప్పటికి నిధులు లేక మధ్యలోనే పనులు నిలిచిపోయాయి.

అయితే గత జనవరి నెలలో సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనలో సన్ పెట్రో కెమికల్స్ సంస్థతో చేసుకున్న ఒప్పందంతో మళ్లీ తెరపైకి తుపాకులగూడెం జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం అంశం వచ్చింది. ములుగు జిల్లాతో పాటు నాగర్‌కర్నూలు, మంచిర్యాల జిల్లాల్లో 3,400 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో విద్యుత్ ప్లాంట్‌ను, 5,440 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.45,500కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సన్ పెట్రో కెమికల్స్ ముందుకు వచ్చింది. ఈ ఒప్పందంలో భాగంగా తుపాకులగూడెం బ్యారేజీ వద్ద 240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉంది.

అలాగే దట్టమైన అడవులు ఉన్న ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు సన్ పెట్రో కెమికల్స్ సంస్థ తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. సరిహద్దు జిల్లాల్లో ఉత్పత్తి చేసే 5,440 మెగావాట్ల సోలార్ విద్యుత్‌లో ములుగు, భూపాలపల్లి జిల్లాలోనే 1500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలనే ప్రణాళికలో ఉంది. ములుగు జిల్లాలో తుపాకులగూడెం బ్యారేజీ పరిసరాల్లోని గోదావరి తీరం వెంట సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం మంత్రుల పర్యటనలో దేవాదుల ప్రాజెక్టు, ఛత్తీస్‌గఢ్ ఎన్‌వోసీ, సౌర, జల విద్యుత్ ఉత్పత్తి అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని భూపాలపల్లిలో 1100 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ప్రభుత్వం దృష్టి పెడితే సౌర, జల విద్యుత్ ఉత్పత్తి కూడా జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.





డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు తదితరులు

డిప్యూటీ సీఎంను కలిసిన మార్నేని

హనుమకొండ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. బ్యాంకుకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, డీసీసీ బ్యాంకుల చైర్మన్లు చిట్టి దేవేందర్‌రెడ్డి, కుంట రమేశ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, అడ్డి బోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూశాయంపేటను మోడల్‌గా తీర్చిదిద్దుతా

▸▸ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కమిషనర్

న్యూశాయంపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వాతావరణ నేపథ్యం కలిగిన 31వ డివిజన్‌లోని న్యూశాయంపేటను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి మోడల్‌గా తీర్చిదిద్దుతానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. న్యూశాయంపేటలోని రైల్వే ట్రాక్ నుంచి పోచమ్మ తల్లి దేవాలయం వరకు రూ.90.50 లక్షలతో నిర్మించే అంతర్గత రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 31వ డివిజన్‌లోని న్యూశాయంపేటపై ప్రత్యేక దృష్టి పెట్టి దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేని న్యూశాయంపేట కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి దిశలో పయనిస్తుందన్నారు. న్యూశాయంపేటలో పోచమ్మ బోనాలు ఊరంతా ఒకే రోజు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారని పోచమ్మ తల్లి ఆశీర్వాదంతో న్యూశాయంపేట వాసులంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. అనంతరం డివిజన్‌లోని సుర్జిత్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు, స్థానిక కాంగ్రెస్ నాయకులు సత్తు రమేష్, కృష్ణ, రవిందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల ధర్నాలో వేలాదిగా పాల్గొనండి

బాలసముద్రం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల సమస్యల సాధన కోసం సోమవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మహాధర్నాలో వేలాదిగా పాల్గొనాల్సిందిగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సముద్రాల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి, నిరాదరణకు నిరసనగా సోమవారం ఉదయం ఇందిరాపార్కులో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



హనుమకొండ 9వ డివిజన్ ఇందిరానగర్‌లో మాజీ డిప్యూటీ మేయర్ సిరాజొద్దీన్‌కు రాఖీ కడుతున్న మహిళలు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ల మధ్య అనురాగ బంధానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని మాజీ డిప్యూటీ మేయర్ ఖాజాసిరాజొద్దీన్ అన్నారు. రక్షాబంధన్‌ను పురస్కరించుకొని శనివారం హనుమకొండ 9వ డివిజన్ ఇందిరానగర్‌లో ఆయన రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక మహిళలు రాఖీ కట్టి తమ సోదర భావాన్ని చాటుకున్నారు. అనంతరం సిరాజొద్దీన్ మాట్లాడుతూ.. యేటా 9వ డివిజన్ మహిళలు తనను తమ సొంత సోదరునిలాగా భావించి రాఖీలు కట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

• కాజీపేట(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, దోపిడీ పీడనకు వ్యతిరేకంగా పీడిత వర్గాలు ఐక్యంగా ఉండాలని కోరుతూ శనివారం కాజీపేటలో సీపీఎం ఆధ్వర్యంలో సామాజిక ఐక్యత రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం. చుక్కయ్య, మండల కార్యదర్శి ఓ. సాంబయ్యలు సామాజిక ఉద్యమకారులను కలిసి రాఖీలు కట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ సామాజికంగా అణగారిన వర్గాలు, కులాలు ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. కులాధిపత్యం, పీడన, వివక్ష పోవాలని అన్నారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు అంకేశ్వరపురం రామచంద్, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, నాయకులు పాల్గొన్నారు.

• మడి కొండ(ఆంధ్రజ్యోతి): మడికొండలో రక్షాబంధన్ వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఇంటింటా సోదరీమణులు తమ సోదరుల చేతికి రాఖీలు కట్టి వారి ఉన్నతిని కోరుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళాపోలీసులు ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సైలు రాజ్‌కుమార్, రాంమోహన్, తోటి పురుష పోలీసులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రక్షా బంధన్ సోదరీ సోదరుల అన్యోన్యతకు, అనుబంధానికి ప్రతీక అని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



కాజీపేటలో రాఖీలు కడుతున్న సీపీఎం జిల్లా నేత ఎం.చుక్కయ్య

• హసన్‌పర్తి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భక్తమార్కండేయ దేవాలయంలో శనివారం సామూహిక రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గురుమూర్తి భద్రదేవ్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో సామూహిక రక్షా బంధన్, శాంతి యజ్ఞం, గాయత్రి ధారణలు నిర్వహించారు. ముందుగా శివుడికి ప్రత్యేకంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం ప్రతినిధులు సట్ల్యారి సంతోష్‌కుమార్, దీకొండ భిక్షపతి, చెన్నూరి శ్రీకాంత్, శ్రీనివాస్, కిరణ్, రవి, మల్లయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తిలో సామూహిక గాయత్రి ధారణలో పాల్గొన్న భక్తులు

ముఖ్యమంత్రికి రాఖీ కట్టిన మేయర్



ముఖ్యమంత్రికి రాఖీ కడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమిసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్కతో కలిసి ముఖ్యమంత్రిని కలిశారు. ముఖ్యమంత్రి పదవిలో పది కాలాల పాటు కొనసాగాలని మేయర్‌తో పాటు మంత్రి సీతక్క ముఖ్యమంత్రిని ఆశీర్వదించారు.



మడికొండ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ కిషన్‌కు రాఖీ కడుతున్న మహిళా పోలీసులు



స్విగ్గీ బాయ్‌కి రాఖీ కడుతున్న కార్పొరేటర్ కూతురు ఉమాభారతి

స్విగ్గి బాయ్‌కి రాఖీ కట్టిన కార్పొరేటర్ కూతురు

గ్రేటర్ 66వ డివిజన్‌కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కూతురు ఉమాభారతి స్విగ్గి బాయ్‌కి రాఖీ కట్టారు. రక్షాబంధన్ వేడుకలను పురస్కరించుకొని శనివారం ఆమె స్విగ్గిలో స్వీట్ ఆర్డర్ చేశారు. ఇంటికి వచ్చిన స్విగ్గీ బాయ్‌ని పండుగ పూట కూడా రాఖీ కట్టుకోకుండా డ్యూటీ చేస్తున్నావేంటని ప్రశ్నించారు. దీంతో (పేరు చెప్పలేదు) తన భార్య ఇటీవలే అనారోగ్యంతో చనిపోయిందని, తనపై కోపంతో సోదరి రాఖీ కట్టడానికి రాలేదని చెప్పడంతో అతడిని ఇంట్లోకి ఆహ్వానించి రాఖీ కట్టి స్వీట్ తినిపించారు.

కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలపై ఎమ్మెల్యే సమీక్ష

కాజీపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 17 నుంచి 23 వరకు జరుగనున్న కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లపై శనివారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దర్గాలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. 21న గంధ లేపనం, 22న ఉర్సు మహోత్సవం గురించి సమీక్షించారు. వివిధ ప్రదేశాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట దర్గా పీఠాధిపతి కుస్రు పాషా, స్థానిక కార్పొరేటర్ సర్తాజ్‌బేగం, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



దర్గాలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్, అధికారులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మడికొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన శనివారం సాయంత్రం కాజీపేట మండలం రాజీవ్ గృహకల్ప (కడిపికొండ) వద్ద చోటు చేసుకుంది. మడికొండ ఎస్సై రాంమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఎల్బీనగర్, పోచమ్మమైదాన్‌కు చెందిన జన్ను మధు, జన్ను రఘు ఇద్దరు ట్రాలీ వాహనంలో కాజీపేట వైపు నుంచి వరంగల్ వైపుకు వెళ్తున్నారు. ఈక్రమంలో రాజీవ్ గృహకల్ప వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం వీరి వాహనాన్ని ప్రక్క నుంచి ఢీకొట్టి వెళ్లగా ట్రాలీ బోల్తా పడింది. ఈ ఘటనలో మధుకు గాయాలుకాగా, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని 108లో ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

వడ్డెపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి పరిమళ కాలనీ ప్రాంతంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు శనివారం నేత్రపర్వంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. రుత్వికులు రాఘవేంద్ర స్వామికి రుగ్వేద నిత్య నూతన ఉపాకర్మ, యజుర్వేద నిత్య నూతన ఉపాకర్మతో పాటు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం గో పూజ, ధ్వజారోహణం, ధాన్య పూజ, లక్ష్మిపూజ జరిపించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ బీఆర్‌వీ మాధవరావుతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాఘవేంద్రస్వామిని కొలిచారు.

జ్ఞాన సరస్వతికి శ్రీ చక్రపూజ



ప్రత్యేక అలంకరణలో సరస్వతి అమ్మవారు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా చదువుల తల్లి సరస్వతీమాతకు శ్రీసూక్తంతో శ్రీచక్రార్చన పూజను నిర్వహించారు. శ్రీజ్ఞాన సరస్వతిదేవి పీఠం భద్రకాళి రోడ్డులోని సరస్వతి మాత సన్నిధానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చనలు , అలంకరణలు, మహా నైవేద్య నివేదనలు జరిపారు. అనంతరం భక్తులందరికి అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సరస్వతి దేవిపీఠం నిర్వాహకులు శ్రీపాద పవన్‌కుమార్ శర్మ, భక్తులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంతోషి మాత అమ్మవారికి కనకాభిషేకం



ఎమ్మెల్సీ సారయ్యకు ప్రసాదాలు, దుస్తులు అందజేస్తున్న నిర్వాహకులు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మహిమాన్వితమైన శ్రీసంతోషిమాత జన్మదినం శ్రావణ శుద్ధ పౌర్ణమి రోజు భక్తులు జరుపుకుంటారు. ఈ మేరకు హంటర్ రోడ్డులోని సంతోషిమాత దేవాలయంలో శనివారం అమ్మ వారి జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. నాణేలు, పుష్పాలతో అమ్మవారికి కనకాభిషేకం నిర్వహించారు.అమ్మవారి జయంతి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి ఆలయానికి తరలి వచ్చారు. అమ్మవారి జయంతి సందర్భంగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆలయానికి చేరుకొని సంతోషిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు బస్వరాజు సారయ్యకు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కరీమాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద శనివారం ఓ గుర్తు తెలియని మృత దేహాన్ని గుర్తించినట్లు మిల్స్‌కాలనీ పోలీ సులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత మూడు రోజులుగా ఓ వ్యక్తి ఇదే ప్రాంతంలో తిరుగుతున్నాడని, మృతుడి కుడి ఛాతి పక్కన పుట్టుమచ్చ ఉందని, మృతుడు లైట్ బ్రౌన్ చెక్స్ షర్ట్, యాష్ కలర్ లోయర్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి గురించి వివరాలు తెలిసినట్లయితే మిల్స్‌కాలనీ పోలీసులకు 8712685006, 8712685093, 8712685119 ఫోన్ నెంబర్స్‌కి కాల్ చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వరంగల్ సిటీ, ఆగస్టు 9: (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం రోడ్డు డివైడర్‌కు ఢీకొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న మహిళకు బలమైన గాయలై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన వరంగల్ మండలంలోని ఆరెపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ములుగు మండలం మంచినీళ్లపల్లె గ్రామానికి చెందిన రాయనబోయిన శ్యామల(23) ములుగు రోడ్డులోని గార్డియన్ ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తోంది. శనివారం రాఖీ పండుగను పురస్కరించుకుని శ్యామల తమ్ముడు శ్రీను శుక్రవారం రాత్రి ఆస్పత్రి వద్దకు వచ్చి శ్యామలను తన బైక్‌పై ఎక్కించుకుని ఇంటికి వెళుతున్నాడు. 10.30 గంటల సమయంలో ఆరెపల్లి సమీపంలోని ఎస్ఆర్ఎస్‌పీ కెనాల్ దాటిన తరువాత రోడ్డు డివైడర్‌కు మోటర్ సైకిల్ ఢీ కొట్టింది. దీంతో వాహనంపై వెనకాల కూర్చున్న శ్యామల ఎగిరికింద పడింది. తలకు బలమైన గాయాలై రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. శ్రీనుకు స్వల్ప గాయాలయ్యాయి.

వర్క్‌ఇన్‌స్పెక్టర్లు.. కాంట్రాక్టర్లు!

- బంధువుల పేరుతో పనులు దక్కించుకుంటున్న వైనం
- షాడోలుగా అడ్డదారిలో నామినేటెడ్ పనులు
- ఇంజనీరింగ్ అధికారులంతా వారి కనుసన్నల్లోనే..
- పర్సంటేజీలకు ఆశపడి మిన్నకుంటున్న అధికారులు
- కమిషనర్ చర్యలు చేపట్టాలంటున్న నగర ప్రజలు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అధికారుల అలసత్వం వారికి అవకాశం.. పనిచేయని సిబ్బంది అమాయకత్వం వారికి ఆదాయ మార్గం.. ఇలా చెప్పుకుంటూపోతే వరంగల్ జీడబ్ల్యూఎంసీలో అక్రమాలకు అంతే లేకుండా పోతోంది. వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని కాజీపేట, నక్కలగుట్ట, కాశిబుగ్గ మునిపల్ సర్కిల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు ఇంజనీరింగ్ విభాగంలో పని చేసే వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉద్యోగ బాధ్యతలు విస్మరించి ఆదాయ మార్గం కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ మరిచి అక్రమమార్గంలో నాలుగురాళ్లు వెనకేసుకునేందుకు వెంపర్లాడుతూ బినామీలతో కాంట్రాక్టర్ల అవతారం ఎత్తడం చర్చనీయాంశంగా మారింది. ఇంజనీరింగ్ ఉద్యోగి ఇంట్లో కాంట్రాక్ట్‌పనులు చేయకూడదనే జీవో ఉన్నా తుంగలోతొక్కి ఒక అడుగు ముందుకేసి షాడోలుగా కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారు.

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో సుమారు 41 మంది స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లతో పాటు మరో ఐదుగురు ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. వీరిలో 30మందికి పైగా వర్క్‌ఇన్‌స్పెక్టర్లు బినామీలను ఏర్పాటు చేసుకుని నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నామినేషన్, టెండర్ల ద్వారా అడ్డదారిలో పనులు దక్కించుకుని నాసిరకం మెటీరియల్‌తో ఇష్టారాజ్యంగా పనులు చేసి మునిపల్ ఆదాయానికి గండి కొడుతున్నట్టు ఆరోపణలున్నాయి. గ్రేట్ వరంగల్ పరిధిలో పలు పథకాల కింద జరిగే ప్రభుత్వ నిర్మాణ ప్రాజెక్టులు, రోడ్లు, బ్రిడ్జీలు, డ్రైనేజీలు, ప్రొటెక్షన్ వాల్స్ పార్కులు, ప్రభుత్వ భవన నిర్మాణాలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. పనుల్లో ఎంత సిమెంట్, ఇసుక, మెటీరియల్ ఉపయోగిస్తున్నారని పరిశీలించాల్సిందిపోయి అడ్డదారులు తొక్కుతుండడంతో ఇతర విభాగాల సిబ్బంది ముక్కున వేలేసుకుంటున్నారు. నగరంలో జరిగే అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన సదరు అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్టు విమర్శలున్నాయి. వీరు ఇతర కాంట్రాక్టర్లు చేసే పనిలో లక్షకు 1 శాతం ఇచ్చే కమీషన్ సపోవడం లేదని ఏకంగా కుటుంబ సభ్యుల పేర్లతో బినామీ కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి కోటీశ్వరులవుతున్నారు.



ఉన్నతాధికారుల మౌనం..

వరంగల్ జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో చాలాకాలంగా వర్క్‌ఇన్‌స్పెక్టర్లు బినామీ కాంట్రాక్టర్లుగా అవతారం ఎత్తి విధులకు డుమ్మా కొట్టి యధేచ్ఛగా తిరుగుతున్నా అక్రమార్కుల పనితీరుపై ఉన్నతాధికారులు, పాలకవర్గం ఎందుకు మౌనంగా ఉంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కొందరు వర్క్‌ఇన్‌స్పెక్టర్లు చేస్తున్న పనుల్లో బిల్లులు రాకముందే సబంధిత ఏఈకి 3 శాతం, డీఈకి 2 శాతం, ఈఈకి 2 శాతం, ఎస్ఈకి 1 శాతం చొప్పున లక్షకు పర్సంటేజీలు ముట్టజెపుతుండడంతో అధికారులు సైతం అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నట్టు తెలుస్తోంది. ప్రతీనెల వర్క్‌ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై సమీక్షించాల్సిన అధికారులు.. వారు చేసే పనులను సాంకేతికంగా పరిశీలించకముందే ఆఫీస్‌ల నుంచే క్వాలిటీ కంట్రోల్ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇంకా చాలామంది ఏఈ, డీఈలకు ఎంబీ రికార్డు, పనులు నాణ్యతా ప్రమాణాలు తెలియకపోవడంతో కొందరు వర్క్ ఇన్‌స్పెక్టర్లపై ఆధారపడి విధుల్లో కొనసాగుతున్నట్టు తెలిసింది. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు అధికారులను పావులుగా వాడుకుని పనులు దక్కించుకుంటున్నారు. చాలా కాలంగా ఈ దందా జరుగుతున్నా పాలకవర్గం, కమిషనర్ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా బినామీ కాంట్రాక్ట్ వర్క్‌ఇన్‌స్పెక్టర్లు భర తం పట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబసభ్యుల పేర్లతో టెండర్లు..

కాజీపేట సర్కిల్ పరిధిలో వర్క్‌ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తున్న ఓ అధికారి తన తండ్రి పేరుతో చాలాకాలంగా కాలంగా కాంట్రాక్ట్ పనులు చేస్తూ కోటీశ్వరుడు అయ్యాడు. ఈ ప్రాంతంలో మరో కాంట్రాక్టర్ అడుగు పెట్టకుండా ఇక్కడి అధికారులను గుప్పిట్లోపెట్టుకుని ప్రతీ పనిని తన తండ్రి పేరుమీద ఉన్న కాంట్రాక్ట్ లైసెన్స్ ఉపయోగించి పనులు దక్కించుకుంటున్నట్టు సమాచారం. టెండర్లు పిలవకముందే తక్కువ కొటేషన్ వేసిన వారికి సమాచారం ఇంజనీరింగ్ అధికారుల ద్వారా తెలుసుకుని అంతకంటే తక్కువ కొటేషన్ వేసి సీనియర్ కాంట్రాక్టర్‌లకు సైతం అంతుచిక్కకుండా పనులు దక్కించుకుంటున్నాడు. అదేవిధంగా పబ్లిక్‌గార్డెన్ వద్ద ఓ వ్యక్తి తన భార్య పేరుతో, సుబేదారిలో ఓ అధికారి తన సోదరుడి పేరుతో, రెడ్డి కాలనీకి చెందిన ఓ అధికారి తన అక్క పేరుతో, కాశిబుగ్గ సర్కిల్‌లో ఇద్దరు వర్క్‌ఇన్‌స్పెక్టర్లు వారి సమీప బంధువులు, స్నేహితుల పేర్లతో బినామీలను ఎంచుకుని కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారు. సుమారు 30 మంది వర్క్‌ఇన్‌స్పెక్టర్లు బినామీలను పెట్టి నగరంలో జరిగే చాలాపనులను అడ్డదారిలో దక్కించుకుని నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకం పనులు చేయడంతో ఒక్క వర్షానికే రోడ్లు, కాల్వలు కొట్టుకుపోతున్నాయి. ఏఈ, డీఈ, ఈఈ, ఎస్ఈలను సైతం వర్క్‌ఇన్‌స్పెక్టర్లు మచ్చికచేసుకుని పనిని బట్టి పర్సంటేజీలు అప్పగిస్తూ డబ్బుల దాహం తీర్చుకుంటున్నారు. పనుల్లో నాణ్యత లేకపోవడం వల్ల తిరిగి బడ్జెట్ కేటాయిస్తూ మరమ్మతు పనులు చేయాల్సి వస్తోంది. వరంగల్ మునిపల్ కార్యాలయానికి పన్నుల రూపంలో సేకరించిన డబ్బు నాసిరకం పనులతో వృథా అవుతోందని ప్రజలు మండిపడుతున్నారు.

గుబులు పుట్టిస్తున్న గుంతలు

మట్టెవాడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షం నీరు నిలవడంతో గుంతలమయంగా మారడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత మూడు రోజులుగా నగరంలో వర్షం కురుస్తుండడంతో రోడ్లపైకి వర్షం నీరు రావడంతో రోడ్లు దెబ్బతిన్నాయి. వాస్తవానికి వర్షాకాలానికి ముందే గుంతలమయంగా ఉన్న రహదారులను కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఆర్ అండ్ బీ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో గతంలో ఏర్పడిన చిన్నగుంతలు ఇప్పుడు పెద్దవిగా మారాయి. దీంతో ఆ గుంతల్లో వర్షం నీరు నిండడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారి ద్విచక్రవాహన దారులు కిందపడు తున్నారు.



వరంగల్ లక్ష్మీపురం రహదారిలో ఉన్న గుంతలు

ముఖ్యంగా వరంగల్ ప్రాంతంలో ములుగు రోడ్, దత్తపురం రోడ్డు, ఎంజీఎం రోడ్డు, ములుగురోడ్ జంక్షన్, ఎంజీఎం జంక్షన్, ఎస్వీఎస్ రోడ్, హంటర్‌రోడ్, పోతనరోడ్డు, ఏనుమాముల మార్కెట్ రహదారి, అండర్ బ్రిడ్జిరోడ్డు తదితర ప్రధానరోడ్లలో గుంతలు ఏర్పడడంతో వాటిలో వర్షం నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు, రోడ్లు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులు గుంతలకు మరమ్మతులు చేపట్టాలని, సమస్య పరిష్కరించాలని, వాహదారులు, ప్రజలు కోరుతున్నారు.

విన్నర్





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
అమెజాన్ ప్రైమ్		
అంధేరా	హిందీ సిరీస్	ఆగస్టు 14
జియో హాట్‌స్టార్		
సారే జహాసే అచ్ఛా	హిందీ చిత్రం	ఆగస్టు 13
జీ 5		
టెహ్రాన్	హిందీ చిత్రం	ఆగస్టు 14
జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ	మలయాళ చిత్రం	ఆగస్టు 15
ఈటీవీ విన్		
కానిస్టేబుల్ కనకం	తెలుగు సిరీస్	ఆగస్టు 14
సోనీ లివ్		
కోర్ట్ కచేరీ	హిందీ సిరీస్	ఆగస్టు 13
బుక్ మై షో		
సర్	హిందీ సిరీస్	ఆగస్టు 11



ఈసారి జాతీయ చలనచిత్ర అవార్డుల్లో 'గాంధీ తాత చెట్టు'లో నటించిన స్టార్ డైరక్టర్ సుకుమార్ కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డికి జాతీయ అవార్డు లభించింది. ఈ నేపథ్యంలో ఆమెను 'నవ్య' పలకరించింది. సంగీతం అంటే తనకున్న ఇష్టాన్నీ, అమ్మానాన్నలతో తనకున్న అనుబంధాన్నీ పంచుకుంది.

నాకు కోపం వస్తే నాన్నకు కంగారే

జాతీయ అవార్డు వచ్చిందని ముందుగా ఎవరు చెప్పారు?

నేను అమెరికాలో చదువుకుంటున్నా. అందువల్ల భారత్‌లో పగలు అయితే మాకు రాత్రి. నేను పడుకొని ఉంటే అమ్మ ఫోన్ చేసి... "నేషనల్ అవార్డులు ప్రకటిస్తున్నారు... చూడు" అని చెప్పింది. స్క్రీన్ మీద నా పేరు కనిపించినప్పుడు ముందు నమ్మబుద్ధి కాలేదు. నాకు అవార్డు వచ్చిందనే విషయాన్ని అర్థం చేసుకోవటానికి కొంత సమయం పట్టింది.

'గాంధీ తాత చెట్టు' సినిమాలో తొలి షాట్ గుర్తుందా? కెమెరా ముందు నిలబడటానికి భయమేసిందా?

అది ఒక మాంటేజ్ షాట్. అందులో నేను స్కూలుకు వెళ్తూ ఉంటా. మొదటిసారి కెమెరా ముందు నిలబడినప్పుడు నాకు అంత భయం వేయలేదు. ఎందుకంటే నేను చిన్నప్పటి నుంచీ నాన్నతో షూటింగ్స్‌కు వెళ్లేదాన్ని. సెట్స్‌లో వందల మంది ఉంటారు. ఆ వాతావరణం ఎలా ఉంటుందో నాకు తెలుసు. అందువల్ల నాకు ఇబ్బంది అనిపించలేదు. అంతేకాకుండా ఈ సినిమాలో నా స్నేహితులుగా నటించిన నిహాల్ ఆనంద్, భానుప్రకాష్ షూటింగ్ సమయంలో మంచి ఫ్రెండ్స్ అయిపోయారు. దాంతో షూటింగ్ ఫన్‌గా సాగింది. అంతేకాకుండా అమ్మ కూడా నాతో ఎప్పుడూ ఉండేది. నాన్న ఆ సమయంలో 'పుష్ప2'లో బిజీగా ఉన్నారు. అందువల్ల అప్పుడప్పుడూ షూటింగ్‌కు వచ్చేవారు.

చాలా కష్టమనిపించిన సీన్ ఏదైనా ఉందా?

క్లైమాక్స్‌లో నేను ఒక చెట్టు దగ్గర ఏడుస్తూ ఉంటా. బ్యాక్‌గ్రౌండ్‌లో 'రఘుపతి రాఘవ రాజారాం' పాట వస్తూ ఉంటుంది. సరిగ్గా ఆ సమయంలోనే వాన పడింది. దాంతో సీనంతా బాగా సెట్ అయింది. ఇక్కడ ఈ సినిమాకు సంబంధించి కొంత చెప్పాలి. నాకు చిన్నప్పటి నుంచీ మ్యూజిక్ అంటే ఇష్టం. మూడేళ్ల కిందట అమ్మ నాకు ఈ సినిమా కథ చెప్పింది. నాకు చాలా నచ్చింది. డైరక్టర్ నన్ను గాంధీతాత వేషం వేయమని అడిగారు. నేను చేయగలనా.. లేదా అనే సందేహం కలిగింది. భయం వేసింది. నాన్న ధైర్యం చెప్పారు. ఇక డైరక్టర్ మల్లాది పద్మావతి కూడా నాకు చాలా సపోర్ట్ ఇచ్చారు.

నువ్వు అమ్మ పిల్లవా.. నాన్న పిల్లవా..?

అలా అడిగితే కష్టం. నేను నాన్న పిల్లనే. మా ఇద్దరికీ మ్యూజిక్ అంటే ఇష్టం. నాకు ఏదైనా పాట నచ్చితే నాన్నకు షేర్ చేస్తా. నాన్నకు నచ్చితే నాకు షేర్ చేస్తారు. మా ఇద్దరినీ ఎప్పుడూ మ్యూజిక్ కలుపుతూనే ఉంటుంది. అయితే ఏదైనా చెప్పాలంటే మాత్రం మొదట అమ్మకే చెబుతాను. నాన్న ఎప్పుడూ పనిలో బిజీగా ఉంటారు. అందువల్ల ఆయనకు తరువాత చెబుతాను.

నువ్వు మ్యూజిక్ కోర్సులో ఎందుకు చేరావు?

నాకు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. ఐదేళ్ల వయస్సు నుంచీ పాడుతూ ఉండేదాన్ని. ఇంటికి ఎవరైనా వస్తే... అమ్మ నన్ను ఏదైనా పాడమని అడిగేది. నేను పాడేదాన్ని. అలా వయస్సుతో పాటు నాకు సంగీతం పట్ల ప్రేమ కూడా పెరుగుతూ వచ్చింది. అందుకే అమెరికాలో మ్యూజిక్ కోర్సులో చేరాను. నా హైస్కూలు అయిపోయిన తర్వాత కాలేజీలో కూడా మ్యూజిక్‌కు సంబంధించిన కోర్సులోనే చేరతాను. సంగీతం నాకు చాలా నేర్పింది. జీవితం పట్ల నాకున్న అభిప్రాయాలను మార్చింది.

నీకు ఇష్టమైన పాటలు, సినిమాలు?

తెలుగులో... 'నాన్నకు ప్రేమ'తో సినిమాలో 'లవ్ మీ ఎగైన్..' పాట నాకు చాలా ఇష్టం. ఇంగ్లీషులో అయితే చాలా పాటలున్నాయి. 'సీతారామం, రంగస్థలం' సినిమాలంటే చాలా ఇష్టం. 'బేబీ, మ్యాడ్ స్క్వేర్' చూశాను. చాలా బాగున్నాయి.

ఏవైనా పాటలు రికార్డు చేశావా?

ఇంకా లేదు. నేను చదువుతున్న స్కూల్లో మ్యూజికల్ ప్రొడక్షన్స్ జరుగుతూ ఉంటాయి. గత ఏడాది మా స్కూల్లో... 'వికెడ్' అనే మ్యూజికల్ ప్రోగ్రామ్ చేశాం. అందులో ఒక సోలో పాడాను. ఒక పాట కండెక్ట్ కూడా చేశాను. 2023లో ఒక మ్యూజికల్ ప్రోగ్రామ్ చేశాం. దానికి 'మోస్ట్ కాంట్రిబ్యూషన్ అవార్డు' వచ్చింది.

నాన్న పెద్ద డైరక్టర్ కదా.. ఎవరైనా తనని పొగుడుతుంటే ఎలా అనిపిస్తుంది?

నాన్నకు పనే ప్రపంచం. పని కోసం ప్రాణం పెడతాడు. బన్నీ మామ, తారక్ అంకుల్, చరణ్ అంకుల్ కలిసినప్పుడు నాన్న గురించి ఇదే చెబుతూ ఉంటారు.

అమ్మానాన్నల మీద కోపం వస్తే ఏం చేస్తావు?

నేను ఎప్పుడూ మాట్లాడుతూనే ఉంటాను. కానీ కోపం వస్తే మాత్రం సైలెంట్ అయిపోతాను. రూమ్‌లోకి వెళ్లి కూర్చుంటాను. నాకు కోపం వచ్చిందనే విషయం అమ్మానాన్నలకు తెలుస్తుంది. అమ్మ అయితే ముందే పసిగట్టేస్తుంది. కొద్దిసేపు తర్వాత మళ్లీ బయటకు వచ్చేస్తా. అప్పుడు అమ్మ లాజికల్‌గా అన్నీ వివరిస్తుంది. నాన్న అయితే... "ఏమైంది పండు.. ఏం జరిగింది..' అని కంగారుపడిపోతాడు. నా కోపం తీరటానికి నాకు పెద్ద డిమాండ్స్ ఏమీ ఉండవు.

● సీవీఎల్ఎన్ ప్రసాద్



● ప్రస్తుతం నాకున్న క్లోజ్‌ఫ్రెండ్ నా ఫోన్. మా స్కూల్లో ఉన్న అమ్మాయిలందరూ నా ఫ్రెండ్సే. నేను అందరితో బాగా మాట్లాడతాను. కలివిడిగా ఉంటా. కానీ పార్టీలంటే పెద్ద ఇష్టం ఉండదు. లౌడ్ మ్యూజిక్, తెలియని వ్యక్తులు ఉన్న ప్రదేశాలకు వెళ్లను.

● చాలామంది 'మేము ఫార్మల్‌గా ఉంటాం. సినిమా ఫ్యామిలీలు అలాగే ఉంటాయి' అనుకుంటారు. కానీ మేము దానికి పూర్తి ఆపోజిట్‌గా ఉంటాం. మా ఇంట్లో చాలామంది ఉంటారు. అందరం కలిసి కబుర్లు చెప్పుకుంటాం. నాకు... తమ్ముడికి మధ్య మంచి బాండింగ్ ఉంది. నాకు ఈ అవార్డు వచ్చినప్పటి నుంచీ నేను ఏంమాట్లాడినా... 'నేషనల్ అవార్డు విన్నర్ కదా..' అంటూ ఆటపట్టిస్తున్నాడు.

● నేను సోషల్ మీడియాలో చురుకుగా లేను. నా ఫోన్‌లో ఒక యాప్ ఉంది. అది సోషల్ మీడియాను బ్లాక్ చేస్తుంది. అందువల్ల నాకు సోషల్ మీడియా చూసే అవకాశమే ఉండదు.

● ప్రస్తుతం స్కూలుకు సెలవులు ఉన్నాయి. అందువల్ల నాకు అవార్డు వచ్చిందన్న విషయం ఇంకా స్కూల్లో ఎక్కువమందికి తెలియదు. స్కూలువాళ్లకు అమ్మ మెయిల్ పెట్టిందనుకుంటా. వాళ్లకు అందిన వెంటనే ఇన్‌స్టాలో పెడతారు.

● నాకు యానిమేషన్ సిరీస్‌లంటే చాలా ఇష్టం. 'జుట్సూ కైసెన్, బెసెర్క్, హైకూ' ఎంతో నచ్చాయి.

జలుబు చేయకుండా.. ఇలా...

మనలో చాలామందికి వర్షాకాలంలో తరచూ జలుబు చేస్తూ ఉంటుంది. దీంతో జ్వరం, తలనొప్పి, దగ్గు, తుమ్ములు వేధిస్తుంటాయి. అలాకాకుండా ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...



● అనుకోకుండా వర్షంలో తడిసినప్పుడు ఇంటికి రాగానే గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. శరీరాన్ని, శిరోజాలను కాటన్ తువాలుతో తడిలేకుండా తుడుచుకోవాలి.

● శరీరాన్ని వెచ్చగా ఉంచే దుస్తులు ధరించాలి.

● అప్పుడే వండిన వేడి ఆహారాన్ని తీసుకోవాలి. ఫ్రిజ్‌లో ఉంచిన చల్లని నీళ్లు తాగకూడదు. మంచినీటిని కొద్దిగా వేడి చేసుకుని తాగడం మంచిది. పలుచగా తయారుచేసిన పప్పు, మిరియాల చారు లాంటివాటిని భోజనంలో చేర్చుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

● రాత్రి పడుకునేముందు కొద్దిగా పసుపు కలిపిన గోరువెచ్చని పాలు లేదా తులసి-అల్లం టీ లాంటి వేడి పానీయాలు తాగితే ఊపిరితిత్తుల్లో శ్లేష్మం చేరదు. వేడి వేడి పాలలో అరచెంచా మిరియాలపొడి కలుపుకుని తాగినా జలుబు దరిచేరదు.

● వర్షం వల్ల వాతావరణంలో హానికారక బ్యాక్టీరియాలు, వైరస్‌లు త్వరగా వ్యాప్తిచెందుతూ ఉంటాయి. వీటివల్ల రోగనిరోధక శక్తి బలహీనమై పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. వీటినుంచి బయటపడేందుకు నారింజ, దానిమ్మ, జామ లాంటి సి విటమిన్ అధికంగా ఉన్న పండ్లు తినాలి. బొప్పాయి, కివి పండ్లు కూడా మేలు చేస్తాయి. తరచూ నిమ్మ, ఉసిరిని ఆహారంలో చేర్చుకున్నా మంచి ఫలితం ఉంటుంది.

● ఉదయం లేవగానే జలుబు చేసిందనిపిస్తే ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల తేనె, చిటికెడు దాల్చిన చెక్క పొడి కలుపుకుని తాగితే ఉపశమనంగా అనిపిస్తుంది. ఒక కప్పు గ్రీన్ టీ తాగినా ప్రయోజనం ఉంటుంది.

వీటినీ రోజూ శుభ్రం చేయాలి



ప్రతిరోజూ వంటింట్లో ఎన్నో వస్తువులు వాడతాం. వాటిలో కొన్నింటిని పైపైన మాత్రమే శుభ్రం చేస్తాం. దాంతో వాటి మీద బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశం ఉంటుంది. కాబట్టి వాటిని ఎలా శుభ్రం చేయాలో తెలుసుకుందాం..

● **చాపింగ్ బోర్డు:** రోజూ కూరగాయలను కోసిన తరువాత చాపింగ్ బోర్డును నీటితో కడిగేసి పక్కన పెట్టేస్తారు. ఇలా చేయడం వలన అది పూర్తిగా శుభ్రం అవ్వదు దాంతో బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. కాబట్టి రోజూ సబ్బు నీటితో చాపింగ్‌బోర్డును శుభ్రం చేయాలి. వారానికోసారి బ్లీచ్‌తో కూడా శుభ్రం చేయాలి.

● **సిలికాన్ బ్రష్‌లు:** సిలికాన్ స్పూన్లు, స్పాచులాలు, బ్రష్‌లు వాడుతుంటాం. వీటిమీద కంటికి కనిపించని సన్నని రంధ్రాలుంటాయి. వాటిని వాడేటప్పుడు నూనె లాంటివి ఆ సన్నని రంధ్రాల్లోకి చేరతాయి. వీటిని కూడా పైపైన శుభ్రం చేస్తారు. వీటిని గోరువెచ్చని నీటిలో ఉంచి సబ్బు నీటితో శుభ్రం చేస్తే ఆ అవశేషాలు తొలగిపోతాయి.

● **రబ్బర్ వాచర్లు:** ఏదో ఒకదాని కోసం తరచూ మిక్సీని వాడతాం. అయితే వాడిన తరువాత జార్‌లను శుభ్రం చేస్తారు. కానీ మిక్సీ గిన్నె మూతకు ఉండే వాచర్‌ను తీసి శుభ్రం చేయరు. దాంతో ఆ మధ్యలోకి బ్యాక్టీరియా చేరుతుంది. కాబట్టి వాడిన ప్రతిసారీ మిక్సీ జార్ మూత వాచర్లు తీసి శుభ్రం చేయాలి.

● **ఫ్రిడ్జ్ హ్యాండిల్:** ఫ్రిజ్‌ను లోపల ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తాం. కానీ హ్యాండిల్‌ను మాత్రం శుభ్రం చేయరు. దాంతో ఆ పనులు చేస్తూ ఈ పని చేస్తూ ఫ్రిడ్జిని తెరవడం వలన హ్యాండిల్ జిడ్డుగా, మురికిగా మారుతుంది. కాబట్టి దానిని కూడా తరచూ శుభ్రం చేస్తుండాలి.

వెనిగర్‌ను ఇందుకూ వాడొచ్చు..



సలాడ్‌లు, కొన్ని రకాల వంటల్లో వెనిగర్‌ను వాడుతుంటాం. వెనిగర్‌ను వంట గదిలో ఇంకా చాలా రకాలుగా కూడా వాడొచ్చు. ఆ వివరాలు తెలుసుకుందాం..

● మాంసం ముక్కలకు కొంచెం వెనిగర్ రాస్తే అవి త్వరగా ఉడుకుతాయి. అలాగే మాంసం మీద ఉండే హానికర బ్యాక్టీరియాను కూడా వెనిగర్ తొలగిస్తుంది.

● వంట గదిలోని వస్తువులను శుభ్రం చేయడంలోనూ వెనిగర్ బాగా పనిచేస్తుంది. చాపింగ్ బోర్డు, జిడ్డు అంటిన స్టీల్ వస్తువులను వెనిగర్ కలిపిన నీటితో శుభ్రం చేస్తే మంచి ఫలితముంటుంది.

● మార్కెట్ నుంచి తెచ్చుకునే కూరగాయలు, ఆకుకూరలు, పళ్ల మీద క్రిమి సంహారక మందుల అవశేషాలు ఉంటాయి. ఎంత శుభ్రం చేసినా అవి వదిలిపోవు. అలాంటప్పుడు నీటిలో కొంచెం వెనిగర్ కలిపి శుభ్రం చేస్తే ఆ అవశేషాలు వదిలిపోతాయి.

నవ శకం

మహిళా శక్తి... గుర్రాలపై గస్తీ

అశ్వాన్ని అధిరోహించి... గస్తీ కాయాలంటే మగ పోలీసులేనా..? మేమూ తక్కువేం కాదంటున్నారు మహిళా కానిస్టేబుళ్లు. గుర్రపు స్వారీలో శిక్షణ పొంది... మెరికల్లా తయారై... 'సిటీ మౌంటెడ్ పోలీస్ విభాగం'లో భాగం అయ్యారు. అశ్వదళంలో రాష్ట్రంలోనే మొట్టమొదటి మహిళా బృందంగా చరిత్ర సృష్టించారు. అసమానతలను దాటి... అవమానలను భరించి... అనుకున్నది సాధించిన ఈ పదిమంది మౌంటెడ్ పోలీస్ మహిళా టీమ్‌పై 'నవ్య' ప్రత్యేక కథనం.

'చీపుర్లు అమ్ముకోక చదువెందుకు' అన్నారు...

నాపేరు ఎం.రేణుక. మాది హైదరాబాద్. అమ్మానాన్నలు భీమా, వెంకటేష్.. చీపుర్లు అమ్ముతూ మమ్మల్ని పోషించేవారు. మేం చదువుకొంటామంటే... 'చీపుర్లు అమ్ముకునేవాళ్లకు చదువెందుకు' అని కొంతమంది హేళన చేశారు. దాంతో మా మామయ్య భగవాన్ నన్ను, అక్కను చేరదీశాడు. ఇద్దరినీ కష్టపడి చదివించాడు. అక్క ఎంబీబీఎస్ చదివి డెంటిస్టు అయ్యింది. ఎంబీఏ చదివిన నేను బ్యాంకు ఉద్యోగం చేయాలనుకున్నాను. అనుకోకుండా కానిస్టేబుల్ ఉద్యోగానికి అప్లై చేశాను. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. పోలీస్ ఉద్యోగం వచ్చిందని తెలియగానే ఆ రోజు చదువు వద్దన్నవారి నోళ్లు మూతపడ్డాయి.

పోలీసులంటే ఇంత భయమా అనిపించేది...

నా పేరు టి.సుభద్ర. మాది కడప. అమ్మానాన్నలు ఓబుల్ రెడ్డి, మహాలక్ష్మి. వ్యవసాయం చేస్తారు. మేం ముగ్గురం అమ్మాయిలం... ఒక అన్నయ్య. నాన్న వ్యవసాయం చేస్తూనే మమ్మల్ని చదివించారు. నేను బీపీఈడీ చేశాను. మాది రాయలసీమ. నాన్న ఎప్పుడూ ఏదో ఒక గొడవలో పోలీస్ స్టేషన్‌లకు వెళ్లాల్సి వచ్చేది. స్టేషన్‌కు వెళ్లినప్పుడు పోలీసులకు ఇచ్చే గౌరవం, వాళ్లు ఊళ్లోకి వస్తున్నారంటే భయపడి ఎక్కడివాళ్లు అక్కడ గప్‌చుప్‌గా ఉండటం గమనించాను. అప్పుడు అనిపించేది... 'పోలీసులంటే ఇంత భయపడతారా' అని. అందుకే నేను పోలీస్ అయి మా నాన్నకు ఇబ్బందులు లేకుండా చూడాలని అనుకునేదాన్ని. మొదటి నుంచీ ఆటల్లో చురుగ్గా ఉండేదాన్ని. తైక్వాండో నేర్చుకున్నాను. ఇంటర్‌లో ఉన్నప్పుడు హరియాణాలో జరిగిన 'ఆలిండియా అండర్-16 తైక్వాండో' పోటీల్లో పాల్గొన్నాను. డిగ్రీ అయిపోగానే తెలంగాణలో వచ్చిన నోటిఫికేషన్ చూసి అప్లై చేశాను.



కమిషనరేట్ చరిత్రలోనే...

సిటీ పోలీస్ కమిషనరేట్ చరిత్రలో ఎప్పుడూ ఎవరూ చేయలేని ఎన్నో పనులు ఇప్పుడు చేస్తున్నాం. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు. భద్రత, బందోబస్తుల్లోనూ మహిళల భాగస్వామ్యం ఉండాలని ఇటీవల 35మంది ఏఆర్ మహిళా కానిస్టేబుళ్లతో స్వాట్ (స్విఫ్ట్ విమెన్ యాక్షన్ టీమ్) బృందాన్ని ఏర్పాటు చేశాం. వాళ్లు నేర్చుకున్న ఆత్మరక్షణ విద్య చూసి షాకయ్యాను. అప్పుడే నిర్ణయించుకున్నాం... అశ్వదళంలోనూ మహిళల భాగస్వామ్యం ఉండాలని. అందుకు తగ్గట్టుగా మొదటి బ్యాచ్‌గా పదిమందిని ఎంపిక చేశాం. అద్భుతంగా హార్స్ రైడింగ్‌లో శిక్షణ పొందారు.

- సీవీ ఆనంద్,
హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్

ఏం సాధించాం అనేదే ముఖ్యం...

నా పేరు జి.అఖిలాయాదవ్. నాన్న హెడ్ కానిస్టేబుల్. చిన్నప్పటి నుంచి నాన్న ఉద్యోగాన్ని గమనిస్తున్నాను. నేను పీజీ డిప్లమా ఇన్ క్లినికల్ న్యూట్రిషన్ చేశాను. మెడికల్ ఫీల్డ్ వైపు వెళ్దామనుకున్నా. కానీ నాన్న పోలీస్ డిపార్టుమెంట్ వైపు ప్రయత్నించమన్నారు. నాన్న ఆధ్వర్యంలోనే శిక్షణ తీసుకున్నా. మొదటి ప్రయత్నంలోనే కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను.

నాన్న చెప్పారు... చదువు ఆపద్దని...

నా పేరు మర్రి హవంతిక. మేం ముగ్గురు సంతానం. నాన్న రవీందర్ ఆటోడ్రైవర్. నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు అమ్మ గుండెపోటుతో చనిపోయింది. చెల్లి, తమ్ముడు, నాన్న ఇబ్బంది పడతారని చదువు మానేద్దాం అనుకున్నా. కానీ నాన్న ఒప్పుకోలేదు. 'అమ్మ లేదని చదువు మానొద్దు. ఆ చదువే రేపటి నీ భవిష్యత్తు' అని చెప్పారు. నాన్న ఆటో నడిపి కష్టపడి మా ముగ్గురినీ చదివించారు. నేను గురుకులాల్లో చదివి బీకాం పూర్తి చేశాను. చెల్లి బీటెక్, తమ్ముడు ఇంటర్ చదువుతున్నారు.

ఫుట్‌బాల్ ఛాంపియన్ అవ్వాలనుకున్నా...

నా పేరు మోనాలిక. బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ చదివాను. నాన్న వేణు... ఫిలిం ఇండస్ట్రీలో కొరియోగ్రాఫర్. నాకు చిన్నప్పటి నుంచీ ఆటలు, యోగా అంటే ఇష్టం. స్కూల్లో ఫుట్‌బాల్ ఛాంపియన్‌ని. 2018లో అండమాన్ నికోబార్‌లో జరిగిన పోటీల్లో పాల్గొన్నాను. ఫుట్‌బాల్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనుకున్నా. స్పోర్ట్స్ బ్యాక్ గ్రౌండ్ ఉందికదా అని పోలీస్ ఉద్యోగానికి అప్లై చేశాను. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం వచ్చింది.

ఇద్దరు పిల్లలు... అయినా...

నా పేరు బి.అఖిల. మాది హైదరాబాద్‌లోని బోడుప్పల్. నాన్న ఆటో డ్రైవర్. అమ్మ కూలీ పనులు చేస్తుంది. మా ఇళ్లలో 10వ తరగతిలోనే పెళ్లి చేసి పంపిస్తారు. నాకూ అలాగే జరిగింది. నాకు పెళ్లై 13 ఏళ్లు. ఇద్దరు మగపిల్లలు. పెద్దవాడు 7వ తరగతి, చిన్నవాడు 5వ తరగతి చదువుతున్నారు. పెళ్లయిన కొద్ది రోజులకే అత్తారింట్లో నరకం ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చూశాను. ఈ నరకం నుంచి బయటపడాలంటే ఇంకా చదువుకొని ఉద్యోగం సాధించాలని అనుకున్నాను. అందుకు భర్త, అత్తామామలు, ఆడపడచు ఒప్పుకోలేదు. అయినా పట్టు విడవకుండా, అమ్మానాన్నల సహకారంతో దూరవిద్యలో బీఏ పూర్తి చేశాను. ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా చేరాను. ఎప్పై ఉద్యోగం వస్తే భర్త, అత్తింటివారికి గట్టి సమాధానం చెప్పాలనుకున్నా. అప్పుడే కానిస్టేబుల్ ఉద్యోగానికి నోటిఫికేషన్ వచ్చింది. ఎలాగైనా ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నా. చెంగిచెర్ల గ్రౌండ్‌లో ఫిట్‌నెస్ ప్రాక్టీస్ ప్రారంభించాను. అక్కడ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డి సార్ పరిచయం అయ్యారు. ఆయన ఈవెంట్స్‌కు సంబంధించిన మెళకువలు నేర్పించారు. కోచింగ్ ఇచ్చారు. అమ్మమ్మను వెంట తీసుకెళ్లి తెల్లవారుజామున 4 గంటల నుంచే ప్రాక్టీస్ చేసేదాన్ని. నా కష్టం వృథా పోలేదు. అనుకున్నట్లుగానే ఉద్యోగం సాధించాను.



● శ్రీనివాస్ చింత, హైదరాబాద్

ఇక ఐసీఐసీఐ కనీస బ్యాలెన్స్ 50 వేలు

- పట్టణాల్లో కొత్త సేవింగ్స్ ఖాతాలకు వర్తిస్తుంది
- చిన్న పట్టణాల్లో ఖాతాలకు రూ.25 వేలు
- జన్‌ధన్ ఖాతాలు ఎప్పట్లాగే జీరో బ్యాలెన్స్

న్యూఢిల్లీ, ఆగస్టు 9: దేశంలో ప్రయివేటు రంగంలోని రెండో అతిపెద్ద బ్యాంకు ఐసీఐసీఐ కొత్తగా తెరిచే సేవింగ్స్ ఖాతాలకు కనీస బ్యాలెన్స్ మొత్తాన్ని భారీగా పెంచింది. పట్టణాలు, మెట్రో నగరాల్లోని శాఖలలో కొత్తగా తెరిచే బ్యాంకు ఖాతాలకు నెల రోజుల కనీస బ్యాలెన్స్ రూ.50,000గా నిర్ధారించింది. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని శాఖల్లో తెరిచే ఖాతాలకు రూ.25,000, రూ.10,000 చొప్పున నెల రోజుల కనీస బ్యాలెన్స్‌ను ఖరారు చేసింది. మూడు ప్రాంతాల్లోనూ కనీస బ్యాలెన్స్‌ను ఐదు రెట్లు పెంచింది. అయితే, ఆగస్టు 1 తర్వాత తెరిచిన కొత్త ఖాతాలకే ఈ నిబంధన వర్తిస్తుంది. పాత ఖాతాలకు ఎప్పట్లాగే రూ.10,000, రూ.5,000, రూ.2,000 చొప్పున కనీస బ్యాలెన్స్ కొనసాగుతుంది. వేతన ఖాతాలు, జన్‌ధన్ ఖాతాలు, డిపాజిట్ల కోసం ఉద్దేశించిన ఖాతాలకు జీరో బ్యాలెన్స్ వర్తిస్తుంది. నెల రోజుల కనీస బ్యాలెన్స్ ఖాతాలో ఉంచని వారిపై గరిష్ఠంగా రూ.500 వరకు జరిమానా విధిస్తారు. కనీస బ్యాలెన్స్ మొత్తానికి ఎంత తగ్గుతుందో అంత మొత్తానికి ఆరు శాతం చొప్పున వడ్డీ లెక్కించి వసూలు చేస్తారు. ఉదాహరణకు హైదరాబాద్‌లో రూ.50,000 కనీస బ్యాలెన్స్ ఖాతా తెరిచిన వ్యక్తి ఒక నెలలో కేవలం రూ.45,000 కనీస బ్యాలెన్స్ మెయింటెయిన్ చేశాడు అనుకుందాం. మిగిలిన ఐదు వేలకు నెలకు 6 శాతం చొప్పున వడ్డీని లెక్క వేసి జరిమానాగా వసూలు చేస్తారు. అంటే, అది రూ.300 అవుతుంది. ఒక వేళ పది వేల రూపాయల లోటు ఉంటే 6 శాతం చొప్పున రూ.600 అవుతుంది. అయితే, జరిమానా గరిష్ఠ పరిమితి రూ.500 మాత్రమే కాబట్టి రూ.600 బదులు రూ.500 మాత్రమే వసూలు చేస్తారు. అస్సలు ఖాతాలో ఏమీ ఉంచకపోతే కూడా రూ.500 చొప్పున జరిమానా వసూలు చేస్తారు. జరిమానాల మీద జీఎస్టీ అదనం. కొత్త ఖాతాలకు ఎన్ఈఎఫ్‌టీ నగదు బదిలీలను పరిమితి లేకుండా ఉచితంగా చేసుకొనే అవకాశం ఇచ్చారు. మూడు దఫాలుగా రూ.లక్ష వరకు నగదును ఏటీఎంలలో విత్‌డ్రా చేసుకోవచ్చు. ఒక విధంగా ఇది ప్రీమియం బ్యాంకు ఖాతా అన్నమాట.

7 ఇంజన్లు.. 354 వ్యాగన్లు!

- దేశంలోనే పొడవైన గూడ్స్ రైలు 'రుద్రాస్త్ర'
- పొడవు 4.5 కిలోమీటర్లు.. ప్రారంభించిన భారతీయ రైల్వే
- ఐదు గంటల్లో 200 కి.మీ. ప్రయాణం



న్యూఢిల్లీ, ఆగస్టు 9: భారతీయ రైల్వే అరుదైన రికార్డు సృష్టించింది. ఏకంగా 7 ఇంజన్లు.. 354 వ్యాగన్లతో దేశ చరిత్రలోనే అత్యంత పొడవైన గూడ్స్ రైలు విజయవంతంగా పట్టాలెక్కింది. 'రుద్రాస్త్ర'గా నామకరణం చేసిన ఈ రైలును తూర్పు మధ్య రైల్వే (ఈసీఆర్) పరిధిలోని గ్రాండ్ కోర్డ్ రైల్ సెక్షన్‌లో ప్రారంభించారు. దీని పొడవు 4.5 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఆరు బాక్సన్ ర్యాక్ (వ్యాగన్ల శ్రేణి)లను అనుసంధానించడం ద్వారా దీన్ని రూపొందించారు. ముందు ఒక లోకోమోటివ్.. తర్వాత మధ్యమధ్యలో మరో ఆరు ఇంజన్లు ఏర్పాటు చేసి సమర్థంగా నడిపారు. ఇది ఉత్తరప్రదేశ్‌లోని గంజ్ కవాజా రైల్వే స్టేషన్ నుంచి ఝార్ఖండ్‌లోని గర్వా రోడ్ స్టేషన్ మధ్య పరుగులు తీసి అందరి దృష్టిని ఆకర్షించింది. గంటకు సగటున 40కిలోమీటర్ల వేగంతో 200 కిలోమీటర్ల దూరాన్ని దాదాపు ఐదు గంటల్లో పూర్తిచేసింది. దీనికి సంబంధించిన వీడియోను రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'రుద్రాస్త్ర.. భారత అతి పొడవైన గూడ్స్ రైలు' అని క్యాప్షన్ ఇచ్చారు.

'రుద్రాస్త్ర' ప్రత్యేకత ఏంటి?

రుద్రాస్త్ర గూడ్స్ రైలు సరుకు రవాణాలో వేగంతో పాటు సామర్థ్యాన్ని పెంచుతుందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఇందులోని ఆరు ర్యాక్‌లను వేర్వేరుగా నడపడం వలన వాటన్నింటికీ వేర్వేరు మార్గాలు, సిబ్బందిని, షెడ్యూల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అదే రుద్రాస్త్రగా కలిపి నడపడం వలన సమయం ఆదా అవుతుందని, సిబ్బంది అవసరం, నిర్వహణ వ్యయం తగ్గుతుందని తెలిపారు. మొత్తం మీద భారత రవాణా రంగానికి 'రుద్రాస్త్ర' మంచి ఊపునిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రపంచవ్యాప్తంగా చూస్తే..

'రుద్రాస్త్ర' భారత రైల్వే చరిత్రలోనే అతి పొడవైన గూడ్స్ రైలుగా నిలిచింది. అయితే ఈ విషయంలో ప్రపంచ రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన బీహెచ్‌పీ కంపెనీ చేతుల్లో ఉంది. ఆ సంస్థ రూపొందించిన రైలు 7.3 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. అందులో 682 వ్యాగన్లు ఉంటాయి. అయినప్పటికీ, భారత రైల్వే సాధించిన ఈ సరికొత్త విజయం.. ప్రపంచ స్థాయి సరుకు రవాణా కార్యకలాపాల్లో ఒక కీలక అడుగుగా చెప్పవచ్చు.


పండుగ వేళ రైల్వే బంపర్ ఆఫర్

- తిరుగు ప్రయాణంపై 20% రిబేట్
- అక్టోబరు 13-26 మధ్య ప్రయాణించాలి
- 17 నవంబరు - డిసెంబరు1 మధ్య తిరుగు ప్రయాణం ఉండాలి

న్యూఢిల్లీ, ఆగస్టు 9: పండుగ సందర్భంగా భారతీయ రైల్వే శాఖ ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. 'రౌండ్ ట్రిప్ ప్యాకేజ్ ఫర్ ఫెస్టివల్ రష్' పేరుతో శనివారం ఓ ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. రాను పోను ప్రయాణానికి రైలు టికెట్లు బుక్ చేసుకున్న వారికి తిరుగు ప్రయాణం బేస్ ఫేర్‌లో 20% రిబేట్‌ను ఇవ్వనున్నట్లు తెలిపింది. ఇబ్బందులు లేని ప్రయాణానికి, ముందస్తు రిజర్వేషన్ చేసుకోవడాన్ని, రైళ్లలో ప్రయాణించడాన్ని ప్రోత్సహించడానికి, రద్దీని క్రమబద్ధీకరించడానికి ఇది ఉపయుక్తంగా ఉంటుందని రైల్వే శాఖ తెలిపింది. ప్రత్యేక రైళ్ల సహా అన్ని రైళ్లలో, అన్ని తరగతులకూ ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం కింద టికెట్లు ఆగస్టు 14 నుంచి బుక్ చేసుకోవచ్చు. అక్టోబరు 13 నుంచి 26 మధ్య ప్రయాణం చేయవచ్చని, తిరుగు ప్రయాణం నవంబరు 17 నుంచి డిసెంబరు 1వ తేదీలోపు చేయాలని పేర్కొంది. పథకాన్ని ఉపయోగించుకోవడానికి కొన్ని షరతులు వర్తిస్తాయని పేర్కొంది. 'రెండు వైపుల కన్ఫర్మ్ టికెట్లు ఉండాలి. రెండు వైపుల గమ్యస్థానాలు ఒకటే అయి ఉండాలి. 'ఫ్లెక్సీ ఫేర్' ఉన్న రైళ్లు.. రాజధాని, శతాబ్ది, దురంతో రైళ్లలో ఈ పథకం వర్తించదు. తిరుగు ప్రయాణానికి ఏఆర్‌పీ (అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ పీరియడ్) వర్తించదు. అలాగే కూపన్లు, ఓచర్లు, పాసులు పనిచేయవు. ఈ పథకం కింద బుక్ చేసుకున్న టికెట్లకు డబ్బులు వాపసు చేయరు' అని రైల్వే తెలిపింది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

చైనుతో మళ్లీ వస్తున్నాడు



భారతీయ సినిమా చరిత్రలో 'శివ' చిత్రం ఓ మైలు రాయి. నాగార్జున సైకిల్ చైన్ లాగి చేతులకు చుట్టుకుని చేసిన ఫైట్‌ను 30 ఏళ్లు అవుతున్నా ప్రేక్షకులు మరచిపోలేదు. కల్ట్ క్లాసిక్‌గా నిలిచి పోయిన 'శివ' చిత్రం మళ్లీ కొత్త సాంకేతిక హంగులు సమకూర్చుకుని వస్తోంది. డాల్బీ అట్మోస్‌లో, 4 కె విజువల్స్‌తో, హై ఎండ్ ఏ ఐ టెక్నాలజీతో రీ డిజైన్ చేసిన ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో త్వరలో విడుదల చేయనున్నారు. రామ్‌గోపాలవర్మను దర్శకుడిగా పరిచయం చేస్తూ అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మించిన సినిమా 'శివ' రీ రిలీజ్ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'నన్ను ఐకానిక్ హీరోగా నిలబెట్టిన సినిమా ఇది. ఇన్నేళ్ల తర్వాత కూడా ఈ సినిమా గురించి మాట్లాడుకుంటున్నారు. అన్నయ్య వెంకట్, నేను కలసి 'శివ' చిత్రాన్ని మళ్లీ విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. యు ట్యూబ్‌లో చూసిన కొత్త జనరేషన్‌కు కూడా మంచి థియేటర్ అనుభవం ఇచ్చే సినిమా ఇది' అన్నారు. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ 'నాగార్జున నమ్మకమే 'శివ' చిత్రాన్ని అంత ఎత్తుకు తీసుకెళ్లింది. ఇందులో ఒరిజినల్ సౌండ్ అప్పట్లోనే ప్రశంసలు అందుకుంది. ఇప్పటి స్టాండర్డ్స్‌కు సరిపోయేలా అడ్వాన్స్‌డ్ ఏ ఐ టెక్నాలజీతో మోనో మిక్స్‌ను డాల్బీ అట్మాస్‌కు మార్చాం. కొత్త సౌండ్‌తో 'శివ' మరింత అలరిస్తుంది' అన్నారు.

ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

- సూర్య సేతుపతి



తమిళ నటుడు విజయ్ సేతుపతి కుమారుడు సూర్య హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ఫీనిక్స్'. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో యాక్షన్‌తో హై ఎమోషన్స్ కూడా ఉంటాయి. రాజ్యలక్ష్మి అనల్ అరసు నిర్మిస్తున్న 'ఫీనిక్స్' చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సూర్య సేతుపతి మాట్లాడుతూ 'ఈ సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న ధనుంజయన్, అనల్ అరసుకు కృతజ్ఞతలు.ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను.' అన్నారు. "ఫైట్ మాస్టర్‌గా చాలా పెద్ద పెద్ద సినిమాలు చేశాను. అయితే యాక్షన్‌లో కూడా ఒక కొత్తదనం చూపించాలని ఫీనిక్స్ చిత్రం చేశాను. సూర్య బాగా చేశాడు' అని చెప్పారు అనల్ అరసు. ఒక కొత్త దర్శకుడు తీసిన పెద్ద సినిమా ఇదనీ, సూర్య రెండేళ్లు కష్టపడ్డాడని నిర్మాత ధనుంజయన్ చెప్పారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని తెలిపారు.

నవంబర్‌లో అద్భుతం



మహేశ్‌బాబు 50 వపుట్టిన రోజు సందర్భంగా శనివారం అభిమానులకు ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చారు దర్శకుడు రాజమౌళి. వారిద్దరి కలయికలో వస్తోన్న 'ఎస్ఎస్ఎంబీ-29' (వర్కింగ్ టైటిల్) చిత్రానికి సంబంధించిన వివరాల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో తొలిసారి అధికారికంగా ఆయన ఓ కీలక్ అప్డేట్‌ను పంచుకున్నారు. 'ఇంతకాలం ఓపికతో ఉన్న మీ అందరికీ ధన్యవాదాలు. మేము 'ఎస్ఎస్ఎంబీ' షూటింగ్ ప్రారంభించి చాలా కాలం అయింది. ఈ సినిమా గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి అందరిలో ఉంది. మునుపెన్నడూ చూడని విధంగా దీన్ని రూపొందిస్తున్నాం. అయితే ఈ సినిమా కథ, దాని పరిధి చాలా పెద్దది. కేవలం ఫొటోలు, ప్రెస్‌మీట్‌లు ఈ ప్రాజెక్టుకు పూర్తి న్యాయం చేయలేవేమో అనిపించింది. ప్రస్తుతం మేం ఓ ప్రపంచాన్ని సృష్టిస్తున్నాం. దాన్ని నవంబర్‌లో మీ ముందుకు తీసుకొస్తాం. అప్పుడు పూర్తి వివరాలు తెలుస్తాయి' అని రాజమౌళి సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్‌బాబు మొహం కనిపించకుండా, ఛాతీభాగం రక్తమోడుతూ ఉన్న ప్రీ లుక్ పోస్టర్‌ను ఆయన షేర్ చేశారు. మెడలో మాల, కింద త్రినేత్రం, ఢమరుకం, త్రిశూలం, నంది, రుద్రాక్ష ఉన్న లాకెట్‌ను ధరించి కనిపించారు మహేశ్‌బాబు. ఫుల్ పోస్టర్‌ను ప్రపంచ యాత్రికుడు పేరుతో నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని రాజమౌళి తెలిపారు. ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

అనుపమ నటన అలరిస్తుంది

- రామ్



అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించిన 'పరదా' చిత్రం ట్రైలర్‌ను హీరో రామ్ పోతినేని విడుదల చేశారు. 'సినిమా బండి' చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీనివాసులు, శ్రీధర్, విజయ్ నిర్మిస్తున్నారు. "పరదా' చిత్రంలో అనుపమ సుబ్బు అనే యువతి పాత్రను పోషించారు. మహిళల పట్ల వివక్షను ప్రశ్నిస్తూ నిజాయతీగా సాగే కథ ఇదని దర్శకుడు చెప్పారు. తన కెరీర్‌లోనే బెస్ట్ పెర్ఫార్మెన్స్‌ను అనుపమ ఇచ్చారని తెలిపారు. రామ్ మాట్లాడుతూ 'చాలా అద్భుతమైన కథ ఇది. ఇలాంటి సినిమాలను తప్పకుండా ప్రోత్సహించాలి. ఈ నిర్మాతలు ముందుకు వచ్చి ఓ విభిన్న చిత్రాన్ని తీశారు. అనుపమ నాకు మంచి ఫ్రెండ్. ఏ పాత్ర ఇచ్చినా వంద శాతం ఎఫర్ట్ పెడుతుంది. సినిమా అంటే ఆమెకు చాలా ప్యాషన్. ఇందులో కూడా ఆమె అద్భుతంగా నటించారు. ఈ సినిమా హిట్ కావాలని కోరుకుంటున్నాను' అన్నారు. అనుపమ మాట్లాడుతూ 'రామ్ నాకు మంచి స్నేహితుడు. 'పరదా' చిత్రం నాకు ఎంత ముఖ్యమో ఆయనకు తెలుసు. అందుకే తను బిజీగా ఉన్నా మా కోసం వచ్చి ఈ ట్రైలర్ విడుదల చేసినందుకు ఆనందంగా ఉంది. 'పరదా' చాలా మంచి సినిమా. అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని చెప్పారు. ఈ నెల 22న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాత విజయ్ చెప్పారు. మహేశ్ పుట్టిన రోజున సినిమా ట్రైలర్‌ను విడుదల చేస్తున్నామనీ, చిరంజీవి పుట్టిన రోజున చిత్రం విడుదలవుతుందని మరో నిర్మాత శ్రీధర్ చెప్పారు.

హారర్.. థ్రిల్



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటించిన హారర్ మిస్టరీ థ్రిల్లర్ 'కిష్కిందపురిలో' చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కానుంది. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్‌తో విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. డార్క్, మిస్టీరియస్ వరల్డ్‌ను చూపిస్తూ, దానికి కాంట్రాస్ట్‌గా ఎమోషనల్ మూమెంట్స్‌ను చక్కగా మిక్స్ చేసిన చిత్రం ఇదనీ, కథ సాగుతున్న కొద్దీ ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు చెప్పారు. సినిమా కోసం టాలెంటెడ్ టెక్నికల్ టీమ్ పని చేస్తోందనీ, ప్రమోషన్స్ వర్క్ ప్రారంభిస్తామని నిర్మాత తెలిపారు.

ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ అండ్ స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025 వేడుకలు శనివారం హైదరాబాద్‌లో వేడుకగా జరిగాయి. నాని, అడివిశేష్, సిద్ధార్థ్, అదితీరావు







హైదరీ దంపతులు సహ పలువురు సినీ తారలు ఈ కార్యక్రమంలో సందడి చేశారు.

మూడు విడతల్లో వేతనాల పెంపు

- ఫిల్మ్ చాంబర్

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

వివాదంగా మారిన సినీ కార్మికుల వేతనాల పెంపు అంశంపై ఓ అడుగు ముందుకు పడింది. కొన్ని పరిమితులతో కూడిన వేతన పెంపునకు తాము సుముఖంగా ఉన్నట్లు నిర్మాతలు తెలిపారు. సుదీర్ఘ చర్చల అనంతరం మూడు విడతలుగా కార్మికుల వేతనాలు పెంచాలని నిర్మాతలు నిర్ణయించారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఫిల్మ్ చాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'రోజుకు రూ. 2 వేల కన్నా తక్కువ తీసుకుంటున్న కార్మికులకు తొలి ఏడాది 15 శాతం, రెండో ఏడాది 5 శాతం, మూడో ఏడాది 5 శాతం చొప్పున పెంచుతాం. రూ. 1000 కన్నా తక్కువ వేతనం ఉన్నవారికి వెంటనే 20 శాతం పెంచుతాం. మూడో ఏడాది మరో 5 శాతం వేతనం పెంచుతాం. లో బడ్జెట్ చిత్రాలకు పాత వేతనాలే అమలవుతాయి' అని చెప్పారు. ఈ సమావేశంలో నిర్మాత నాగవంశీ, నవీన్, విశ్వప్రసాద్, చెర్రీ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాతల షరతులను అంగీకరించం: ఫెడరేషన్

వేతన పెంపు అమలుపై నిర్మాతల నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని తెలిపారు. ఫ్లెక్సీబుల్ కాల్‌షీట్లు, నాన్ మెంబర్స్‌తో పనిచేయించుకునే వెసులుబాటు, కాల్‌షీట్ లాంటి తదితర అంశాలపై నిర్మాతలు పెట్టిన షరతులకు అంగీకరించేది లేదన్నారు. ఫెడరేషన్‌లో విభేదాలు సృష్టించి, యూనియన్ల ఐక్యతను దెబ్బతీసేలా నిర్మాతల నిర్ణయాలు ఉన్నాయని ఆరోపించారు. పది సంఘాలకు మాత్రమే పెంపును పరిమితం చేశారనీ రోజువారి వేతనాలు తీసుకునే 13 సంఘాలకూ ఒకే విధంగా పెంపును అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఆదివారం నుంచి తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని అనిల్ ప్రకటించారు.

గోదావరి తీరంలో ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ప్రేమ కథా చిత్రం 'కాగితం పడవలు'. ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో గాయత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు. శనివారం చిత్రబృందం గ్లింప్స్‌ను విడుదల చేసింది. గోదావరి తీరంలో ఆహ్లాదంగా సాగే ప్రేమకథా చిత్రమిదని అంజనప్ప తెలిపారు. ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయే ప్రేమకథతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని తుకారాం చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఏఐఎస్ నౌఫల్ రాజా, సినిమాటోగ్రఫీ: రుద్రసాయి రాజా

ఊహించని మలుపులతో



సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'సి-మంతం'. వజ్రయోగి, శ్రేయ భర్తీ జంటగా నటిస్తున్నారు. సుధాకర్ పాణి దర్శకత్వంలో ప్రశాంత్ టాటా నిర్మిస్తున్నారు. శనివారం చిత్రబృందం గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా సుధాకర్ పాణి మాట్లాడుతూ 'బీభత్సరస ప్రధాన కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఊహించని మలుపులు, భయానక సంఘటనలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. ఒక మహిళ జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల సమాహారమే మా చిత్ర కథ అని ప్రశాంత్ టాటా తెలిపారు. సంగీతం:ఎస్ సుహాస్, సినిమాటోగ్రఫీ: శ్రీనివాస్.

బ్యాంకింగ్ సేవల్లో సమస్యలున్నాయా!



ఆర్‌బీఐకి ఫిర్యాదు చేస్తే సరి

ప్రస్తుతం రోజువారీ జీవితంలో ఆర్థిక లావాదేవీలు నిత్య కృత్యమై పోయాయి. అవి బ్యాంకుల ద్వారా కావచ్చు లేదా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) లేదా డిజిటల్ పేమెంట్స్ కావచ్చు. టెక్నాలజీ పుణ్యమాని వీటి సేవలు ఎంత సులభమయ్యాయో.. అదే సమయంలో సమస్యలూ పెరిగిపోతున్నాయి. ఈ సమస్యలపై సంబంధిత సంస్థలకు ఫిర్యాదు చేసినా సరైన స్పందన ఉండదు. ఉన్నా.. అది మొక్కుబడిగానే ఉంటోంది. అయితే వీటన్నిటికి పరిష్కారం చూపేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రత్యేకంగా ఒక ఆన్‌లైన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. లావాదేవీలు లేదా ఇతరత్రా బ్యాంకింగ్ సమస్యలు ఏమైనా ఉంటే ఖాతాదారులకు తన కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎంఎస్) ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఆర్‌బీఐ పరిష్కారం చూపుతోంది. ఆ వివరాలు మీకోసం..

ఎప్పుడు ఫిర్యాదు చేయాలి?

సేవల్లో లోపాలు ఉంటే ముందు సంబంధిత బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ లేదా డిజిటల్ పేమెంట్ చానల్ పార్ట్‌నర్‌కే ఫిర్యాదు చేయాలి. ఆ ఫిర్యాదును సంబంధిత సంస్థలు నెల రోజుల్లోగా పరిష్కరించాలి. ఈ నెల రోజుల్లో వాటి నుంచి సమాధానం రాకపోయినా, వచ్చినా వారి సమాధానం మీకు సంతృప్తికరంగా లేకపోయినా నేరుగా cms.rbi.org.in పోర్టల్ ద్వారా ఆర్‌బీఐకి ఫిర్యాదు చేయవచ్చు.

ఏ వివరాలు ఇవ్వాలి?

ఫిర్యాదులో మీ పేరు, ఫోన్ నంబరు, చిరునామా, సమస్య ఉన్న బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ వివరాలు, సమస్య వివరాలు ఇవ్వాలి. సమస్య పరిష్కారం కోసం ఆయా సంస్థలతో మీరు జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు, ఫిర్యాదు రిఫరెన్స్ నంబర్లు, స్క్రీన్ షాట్ల వివరాలను కూడా అప్‌లోడ్ చేయాలి. ఈ వివరాల ఆధారంగా మీకు ఒక రిఫరెన్స్ నంబరు జనరేట్ అవుతుంది.

పరిష్కార ప్రక్రియ

మీ ఫిర్యాదు అందిన వెంటనే ఆర్‌బీఐ.. పరిష్కారం కోసం సంబంధిత సంస్థలకు పంపిస్తుంది. సంబంధిత సంస్థలు దీనికి నిర్ణీత గడువులోగా సమాధానం ఇవ్వాలి. సమాధానం రాకుంటే అంబుడ్స్‌మన్ రంగంలోకి దిగుతుంది. ఇందుకు మీ నుంచి మరింత సమాచారం అవసరమైతే అడుగుతుంది. అవసరమనుకుంటే సంబంధిత సంస్థ, ఫిర్యాదు చేసిన ఖాతాదారుడి మధ్య అంబుడ్స్‌మన్ మధ్యవర్తిత్వం వహించి సమస్య పరిష్కరిస్తుంది. సీఎంఎస్ పోర్టల్ ద్వారా అందే ఫిర్యాదుల్లో చాలా వరకు నెల రోజుల్లో పరిష్కారమవుతాయి. మధ్యవర్తిత్వం విఫలమైతే అంబుడ్స్‌మన్ నిర్ణయం తీసుకుంటుంది. ఆ నిర్ణయం మీకు అంగీకారమైతే సంబంధిత సంస్థలు నెల రోజుల్లోగా కచ్చితంగా దాన్ని అమలు చేయాలి.

నచ్చకపోతే?

అంబుడ్స్‌మన్ తీర్పు ఫిర్యాదుదారుడికి నచ్చితే సరి. లేకపోతే తీర్పు వెలువడిన నెల రోజుల్లోగా ఆర్‌బీఐకే చెందిన అప్పిలేట్ అథారిటీకి అప్పీల్ చేసుకోవచ్చు. ఈ సంస్థ తీర్పు కూడా నచ్చకపోతే ఫిర్యాదుదారుడు కన్స్యూమర్ కోర్టు లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు.

అంతా ఉచితం

ఆర్‌బీఐ సీఎంఎస్ పోర్టల్ సేవలు పూర్తిగా ఉచితం. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు లేదా పేమెంట్ చానల్స్ ఆఫీసు మెట్లు ఎక్కకుండానే మీ ఫిర్యాదులను ఈ పోర్టల్ ద్వారా ఉచితంగా పరిష్కరించుకోవచ్చు. కాకపోతే అన్ని సాక్ష్యాలు పక్కాగా ఉండాలి.

వేటిపై ఫిర్యాదు చేయవచ్చు?

బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ పరిధిలోకి వచ్చే ఈ కింది అంశాలన్నిటిపైనా ఆర్‌బీఐకి ఫిర్యాదు చేయవచ్చు.

- సేవా లోపాలు
- చెల్లింపుల్లో ఆలస్యం లేదా అసలు చెల్లించకపోవడం
- పొరపాటుగా డెబిట్ చేసిన మొత్తాన్ని తిరిగి బదిలీ చేయకపోవడం
- ఏటీఎం లేదా యూపీఐ లావాదేవీలు విఫలమవడం
- మీ ఖాతా నుంచి అనధికారికంగా డెబిట్ చేయడం
- రుణాల మంజూరు, చెల్లింపుల్లో సమస్యలు

త్వరలో పబ్లిక్ ఇష్యూకి ఎస్‌బీఐ ఎంఎఫ్, జనరల్ ఇన్సూరెన్స్

ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ).. తన రెండు అనుబంధ సంస్థలను స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ చేసేందుకు సిద్ధమవుతోంది. బ్యాంక్ అనుబంధ సంస్థలైన ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ సంస్థలను పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి తీసుకువచ్చే విషయాలను పరిశీలిస్తున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. శనివారం నాడిక్కడ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్.. ప్రత్యేక హెల్త్ ఇన్సూరెన్స్ శాఖలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఈ రెండు అనుబంధ సంస్థలను మార్కెట్లో లిస్టింగ్ చేసే విషయాన్ని చురుగ్గా పరిశీలిస్తున్నట్లు ఆయన చెప్పారు. అయితే ఎప్పటిలోగా వీటిని లిస్ట్ చేయాలనే దానిపై ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదన్నారు. ఎస్‌బీఐ కింద మొత్తం 18 నాన్ బ్యాంకింగ్ అనుబంధ సంస్థలున్నాయని, వీటిల్లో జీవిత బీమా, బీమాయేతర, మ్యూచువల్ ఫండ్స్ వంటి సంస్థలు ప్రపంచ స్థాయి ఆర్థిక సర్వీసులు అందిస్తున్నాయని తెలిపారు. ఈ అనుబంధ సంస్థల్లో ఎస్‌బీఐ రూ.6,500 కోట్లు పెట్టుబడిగా పెడితే ప్రస్తుతం వీటి విలువ రూ.4 లక్షల కోట్లకు చేరుకుందని శెట్టి వివరించారు.

సుంకాల ప్రభావం పరిమితమే..

అమెరికా గరిష్ఠ సుంకాల ప్రభావం భారత్‌పై అంతగా ఉండదని ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి తెలిపారు. భారత్ నుంచి అమెరికా సహా వివిధ దేశాలకు పెద్దఎత్తున ఎగుమతులు జరుగుతున్నాయని, దీంతో సుంకాల ప్రభావం తక్కువగా ఉంటుందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. రసాయనాలు, టెక్స్‌టైల్స్, వజ్రాభరణాలు, ఆక్వా రంగంపై మాత్రమే ఈ సుంకాల ప్రభావం అధికంగా ఉండనుందని, అయితే ఈ రంగాలకు ఎస్‌బీఐ ఇచ్చిన రుణాలు కూడా చాలా పరిమిత స్థాయిలోనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఈ రంగాలకు ప్రభుత్వం ఉపశమనం కల్పించాలని నిర్ణయిస్తే అప్పటి పరిస్థితుల ఆధారంగా తాము ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని ఆయన వివరించారు.

హెల్త్ ఇన్సూరెన్స్ కోసం ప్రత్యేక శాఖలు

ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో హెల్త్ ఇన్సూరెన్స్ కోసం ప్రత్యేక శాఖలను ప్రారంభించింది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన పట్టణాల్లో మొత్తం 30 ప్రత్యేక శాఖలను ప్రారంభించినట్లు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ నవీన్ చంద్ర ఝా వెల్లడించారు. అందరికీ ఆరోగ్య బీమా అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. భవిష్యత్‌లో వీటిని దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు ఆయన చెప్పారు. సంస్థకు చెందిన అన్ని రకాల బీమా ఉత్పత్తులు ఈ శాఖల్లో అందుబాటులో ఉంటాయని ఝా తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	505
వరంగల్	462	గోదావరి	500
చిత్తూరు	523	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	104
వరంగల్	95	గుంటూరు	109
కరీంనగర్	95	ఒంగోలు	109
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	82
కర్నూలు	95	నెల్లూరు	87
విశాఖపట్నం	99	అనంతపురం	87
గోదావరి	104		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,03,310 ▲	94,700 ▲	1,27,000 ▲
విజయవాడ	1,04,100 ▼	97,500 ▼	1,18,400 ▼
విశాఖపట్నం	1,03,040 ▼	94,450 ▼	1,27,000 ▲
రాజమండ్రి	1,03,040 ▼	94,450 ▼	1,18,500 ▲
ప్రొద్దుటూరు	1,01,100 ▲	93,010 ▲	1,17,800 ▲
ముంబై	1,00,940 ▲	92,460 ▲	1,14,730 ▼

వారంటీలో ఉన్న వస్తువులు రిపేర్‌కు వస్తే..?

ఇదీ GST



రాంబాబు గొండాల

సాధారణంగా మొబైల్, టీవీ, ఫ్రిడ్జ్ లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు కానీ, కారు, బైక్ లాంటి ఆటోమొబైల్స్ లేదా ఇతర యంత్ర పరికరాలు 'వారంటీ'లో విక్రయిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో కొనుగోలు చేసిన వస్తువులు వారంటీ గడువు లోపు పాడయినట్లయితే డిస్ట్రిబ్యూటర్ లేదా సర్వీస్ సెంటర్లలో ఆయా వస్తువులకు ఉచితంగా మరమ్మతులు చేయటం, అవసరమైతే పాడయిన విడిభాగాలను ఉచితంగా మార్చటం వంటివి చేస్తుంటారు. అయితే ఆయా విడిభాగాల మీద సంబంధిత ఉత్పత్తిదారుడు (కంపెనీ) గానీ, సర్వీస్ సెంటర్ గానీ జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుందా? లేదంటే ఆయా విడిభాగాలకు సంబంధించిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను రివర్స్ చేయాల్సి ఉంటుందా? అలాగే సర్వీస్ సెంటర్‌కు, ఉత్పత్తిదారుడికి మధ్య జరిగే లావాదేవీల మీద జీఎస్‌టీ ఎలా చెల్లించాలి? కస్టమర్ దగ్గర నుంచి అదనంగా ఏమైనా వసూలు చేస్తే దాన్ని ఎలా చూపాలి మొదలైన విషయాలు తెలుసుకుందాం.

ఈ వారంటీకి సంబంధించిన రిపేర్లు రెండు రకాలుగా ఉంటాయి. కంపెనీనే రిపేర్లు చేపట్టటం లేదా ఆయా కంపెనీల తరఫున సంబంధిత డిస్ట్రిబ్యూటర్లు లేదా సర్వీస్ సెంటర్లు ఈ రిపేర్లు చేపట్టటం. ఈ రెండు సందర్భాల్లోనూ ఏవేనీ విడిభాగాలను ఉచితంగా మార్చటం జరుగుతుంటే ఆ విడిభాగాల మీద ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. అలాగే ఆయా విడిభాగాల మీద తీసుకున్న ఐటీసీని కూడా రివర్స్ చేయనవసరం లేదు. కాకపోతే, కస్టమర్ నుంచి ఏమైనా సర్వీస్ చార్జీ కింద లేదా ఇతర కారణాలతో అదనపు రుసుము వసూలు చేస్తే దాని మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.

అయితే కంపెనీల తరఫున డిస్ట్రిబ్యూటర్ లేదా సర్వీస్ సెంటర్లలో రిపేర్లు జరుగుతుంటే సంబంధిత డిస్ట్రిబ్యూటర్‌కు, ఆయా కంపెనీల మధ్య లావాదేవీలను ఎలా అర్థం చేసుకోవాలి? ఇందులో కూడా వివిధ రకాల లావాదేవీలు ఉంటాయి. మొదటిది, ఏదేనీ విడిభాగాలను మార్చాల్సి వస్తే.. డిస్ట్రిబ్యూటర్, సంబంధిత కంపెనీకి ఇండెంట్ పెట్టి ఆయా విడిభాగాలను ఉచితంగా తెప్పించుకుంటారు. అలాంటి సందర్భంలోనూ సంబంధిత కంపెనీ ఆ విడిభాగాల మీద కూడా ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. ఆయా విడిభాగాలకు సంబంధించి ఎలాంటి ఐటీసీ కూడా రివర్స్ చేయాల్సిన అవసరం లేదు. అలాకాకుండా డిస్ట్రిబ్యూటర్ తన దగ్గర ఉన్న విడిభాగాలను లేదా బయట నుంచి కొనుగోలు చేసిన విడిభాగాలను వాడి కంపెనీకి బిల్లు (ఇన్వాయిస్) పెట్టినట్లయితే, ఆ బిల్లు మీద సంబంధిత డిస్ట్రిబ్యూటర్ జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే, అలా చెల్లించిన జీఎస్‌టీని నియమ నిబంధనలకు లోబడి కంపెనీలు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద తీసుకోవచ్చు.

అలాగే డిస్ట్రిబ్యూటర్ లేదా సర్వీస్ సెంటర్ సర్వీస్ చార్జీల కింద ఏదేనీ రుసుమును కంపెనీ నుంచి వసూలు చేస్తే దాని మీద కూడా జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. ఆ జీఎస్‌టీని పైన తెలిపినట్లు ఆయా కంపెనీలు ఐటీసీ తీసుకోవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే పైన చెప్పిన లావాదేవీలు ఉచితంగా అందించినంత వరకు ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. అయితే, కొన్ని సందర్భాల్లో కంపెనీలు ఈ లావాదేవీలకు సంబంధించి క్రెడిట్ నోట్స్‌ను డిస్ట్రిబ్యూటర్స్‌కు ఇవ్వటం జరుగుతుంది. అలాంటప్పుడు క్రెడిట్ నోట్స్‌కు సంబంధించిన నియమ నిబంధనలను ఇరువైపుల పాటించాల్సి ఉంటుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బరోడా బీఎన్‌పీ పారిబా గోల్డ్ ఈటీఎఫ్ ఎఫ్ఓఎఫ్

బరోడా బీఎన్‌పీ పారిబా అసెట్ మేనేజ్‌మెంట్ ఇండియా.. గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్)ను ప్రారంభించింది. దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు, బంగారం సంబంధిత అసెట్స్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే మదుపరుల కోసం ఈ కొత్త ఫండ్‌ను తీసుకువచ్చింది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఆ తర్వాత రూపాయి చొప్పున పెట్టుబడులు పెంచుకుంటూ పోవచ్చు. క్రమానుగత పెట్టుబడుల (సిప్) రూపంలో అయితే రూ.500 పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 14.

కోటక్ నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ ఫండ్

కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ.. నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ పథకం. మార్కెట్ క్యాపిటలైజేషన్, గడచిన ఆరు నెలల్లో రోజువారీ టర్నోవర్ టర్నోవర్ ఆధారంగా కంపెనీలను ఎంపిక చేసుకుని ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.100. ముగింపు తేదీ ఈ నెల 11.



ఫేవరెట్లు శ్రీశంకర్, అన్ను

నేడు వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్

భువనేశ్వర్: భారత్ తొలిసారి ఆతిథ్యమిస్తున్న వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ బ్రాంజ్ లెవెల్ ఈవెంట్‌కు ఇక్కడి కళింగ స్టేడియం గ్రాండ్‌గా ముస్తాబైంది. ఆదివారం జరిగే ఈ పోటీల్లో ఆతిథ్య భారత్ సహా 15 దేశాల నుంచి 150 మందికిపైగా అథ్లెట్లు బరిలోకి దిగుతున్నారు. త్వరలో జరిగే టోక్యో ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు అర్హతే లక్ష్యంగా అనేకమంది అథ్లెట్లు టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. స్టార్ జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ మాజీ విజేత నీరజ్ చోప్రాతో పాటు తెలుగమ్మాయి, స్ప్రింటర్ జ్యోతి యర్రాజీ, స్టీపుల్ చేజర్ అవినాశ్ సబ్లేలాంటి స్టార్లు గైర్హాజరవుతున్నా.. మిగతా టాప్ అథ్లెట్లు అన్నూ రాణి, మురళీ శ్రీశంకర్ భారత్ నుంచి ఫేవరెట్లుగా పోటీపడుతున్నారు. మహిళల జావెలిన్ త్రోయర్ అన్నూ రాణి ఈనెల ఆరంభంలో పోలెండ్ మీట్‌లో విజేతగా నిలిచి జోరు మీదున్నది. ఇక, శ్రీశంకర్ ఇటీవల వరుసగా మూడు అంతర్జాతీయ టైటిళ్లు నెగ్గి పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్నాడు. 200 మీటర్లలో జాతీయ రికార్డు గ్రహీత అనిమేశ్ కుజూర్, లాంగ్ జంప్‌లో షైలీ సింగ్, అన్సీ సోజన్, పురుషుల జావెలిన్ త్రోలో సచిన్ యాదవ్, 800 మీటర్లలో మహ్మద్ అఫ్జల్ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, జావెలిన్ త్రో, 4.400 మీటర్ల రిలే మిక్స్‌డ్ ఈవెంట్లలో పోటీలుంటాయి.

వారియర్స్ బోణీ

● ఏపీఎల్‌లో లయన్స్ పరాజయం

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో తుంగభద్ర వారియర్స్ బోణీ కొట్టింది. ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో వారియర్స్ 7 వికెట్లతో సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై గెలిచింది. తొలుత లయన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 109 పరుగులే చేసింది. అభిషేక్‌రెడ్డి (40) ఫర్వాలేదనిపించాడు. ఛేదనలో వారియర్స్ 12.2 ఓవర్లలోనే 114/3 స్కోరు చేసి నెగ్గింది. కెప్టెన్ మహీప్ కుమార్ (57 నాటౌట్) రాణించాడు. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో విజయవాడ సన్‌షైనర్స్ ఏడు వికెట్లతో రాయల్స్ ఆఫ్ రాయలసీమను ఓడించింది. మొదట రాయల్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 196 రన్స్ చేసింది. అవినాష్ (96) ఆకట్టుకున్నాడు. ఛేదనలో సన్‌షైనర్స్ 16.5 ఓవర్లలోనే 200/3 స్కోరు చేసి నెగ్గింది. కెప్టెన్ అశ్విన్ హెబ్బర్ (98) కొద్దిలో శతకం చేజార్చుకోగా, తేజ (77 నాటౌట్) సత్తా చాటాడు.

ఆసియా సర్ఫింగ్ ఫైనల్‌కు బుధియాల్

చెన్నై: ఆసియా సర్ఫింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన రమేశ్ బుధియాల్ పతకం దిశగా దూసుకెళుతున్నాడు. మహాబలిపురంలో జరుగుతున్న ఈ మెగా టోర్నీలో బుధియాల్ ఫైనల్లో ప్రవేశించాడు. సెమీఫైనల్స్‌లో బుధియాల్ 11.43 పాయింట్లు స్కోరు చేసి రెండోస్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో భారత సర్ఫర్ ఫైనల్ చేరడం ఇదే మొదటిసారి.

అర్జున్ రెండో విజయం

● చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్



చెన్నై: స్టార్ ఆటగాడు అర్జున్ ఇరిగేసి చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్‌లో రెండో విజయాన్ని నమోదు చేశాడు. మాస్టర్స్ కేటగిరిలో తొలిరౌండ్ గెలిచి, రెండో రౌండ్‌ను డ్రాగా ముగించిన ఈ తెలుగు గ్రాండ్‌మాస్టర్.. శనివారం జరిగిన మూడో రౌండ్లో విజయం సాధించాడు. ఈ రౌండ్లో అమెరికా గ్రాండ్‌మాస్టర్ రే రాబ్సన్‌ను ఓడించాడు. మూడు రౌండ్ల అనంతరం అర్జున్ 2.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. వరుసగా మూడో గెలుపుతో హ్యాట్రిక్ కొట్టిన జర్మనీ నెంబర్‌వన్ విన్సెంట్ కేమర్ 3 పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు. మిగతా ఆటగాళ్లలో అనీష్ గిరి (1.5)తో గేమ్‌ను ప్రణవ్ (1) డ్రా చేసుకోగా, నిహాల్ సరీన్ (0.5)పై విదిత్ గుజరాతీ (1.5) గెలిచాడు. చాలెంజర్స్ కేటగిరి మూడో రౌండ్లో అధిబన్‌తో గేమ్‌ను ద్రోణవల్లి హారిక డ్రాగా ముగించగా, ల్యూక్ మెన్‌డోన్కా చేతిలో వైశాలి ఓటమిపాలైంది. వైశాలి (1) ఏడు, హారిక (0.5) తొమ్మిదో స్థానాల్లో కొనసాగుతున్నారు.

కోహ్లీ కానుక పదిలంగా..



హైదరాబాద్: టీమిండియా పేసర్ సిరాజ్‌కు విరాట్ కోహ్లీ అంటే ప్రత్యేక అభిమానం. తాను ఆర్‌సీబీకి ఆడిన సమయంలో అతడిని హైదరాబాద్‌లోని స్వగృహానికి సైతం తీసుకెళ్లి పసందైన విందు భోజనంతో ఖుషీ చేయించాడు. అటు విరాట్ కూడా సిరాజ్‌పై తనకున్న ఆప్యాయతను పలు సందర్భాల్లో వెల్లడిస్తుంటాడు. అందుకే తానాడిన చివరి టెస్టు జెర్సీని సిరాజ్‌కే కానుకగా ఇచ్చాడు. విరాట్ సంతకంతో కూడిన ఈ జెర్సీని సిరాజ్ ప్రత్యేకంగా ఫ్రేమ్ చేయించి మరీ తన ఇంట్లో గోడకు బిగించాడు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

గిల్ జెర్సీకి రూ.5.41 లక్షలు

న్యూఢిల్లీ: భారత్-ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌లో పాల్గొన్న క్రికెటర్ల సంతకాలతో కూడిన జెర్సీలను, క్యాప్‌లను వేలానికి ఉంచారు. ఇందులో కెప్టెన్ గిల్ ధరించిన జెర్సీకి అత్యధికంగా రూ. 5.41 లక్షల ధర పలికింది. జడేజా, బుమ్రా జెర్సీలు రూ.4.94 లక్షలు పలికాయి. మాజీ కెప్టెన్ ఆండ్రూ స్ట్రాస్ దివంగత భార్య రూత్ స్ట్రాస్ ఫౌండేషన్ నిధుల సేకరణ కోసం ఈ వేలం జరిగింది.

అమ్మకానికి లార్డ్స్ పిచ్

లండన్: ప్రపంచ క్రికెట్‌లో లార్డ్స్ మైదానానికి ఉన్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. ఇక్కడ శతకం బాదినా.. ఐదు వికెట్ల మైలురాయి అందుకున్నా వారి పేర్లు చరిత్రలో నిలిచిపోతాయి. ఎన్నో అద్భుత మ్యాచ్‌లకు వేదికగా నిలిచిన ఈ ప్రఖ్యాత మైదానం పిచ్‌ను ముక్కల వారీగా అమ్మకానికి ఉంచుతున్నట్టు నిర్వాహక మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) ప్రకటించింది. పిచ్‌తో పాటు మైదానం టర్ఫ్‌ను కూడా కొనుగోలు చేయవచ్చని తెలిపింది. 1.2-0.6మీ. సైజు పిచ్ భాగాన్ని భారత కరెన్సీలో రూ.5 వేల చొప్పున అమ్మనున్నారు. అయితే ఈ అవకాశం ముందుగా తమ 25వేల మంది ఎంసీసీ సభ్యులకు ఇవ్వనుంది. ఆ తర్వాత క్రికెట్ అభిమానులు కూడా కొనుగోలు చేయవచ్చు. దీని ద్వారా వచ్చే నిధుల్లో పది శాతం ఎంసీసీ ఫౌండేషన్‌కు వెళతాయి. మిగతా మొత్తంతో స్టేడియంలో సౌకర్యాల మెరుగుదలకు వినియోగిస్తారు. మరోవైపు వచ్చేనెల నుంచి లార్డ్స్ గ్రౌండ్‌ను ఆధునీకరించనున్నారు. అందులో భాగంగానే పిచ్ చుట్టుపక్కల ఉండే పచ్చికను తొలగించి, అవుట్‌ఫీల్డ్‌ను కూడా తవ్వి సరికొత్త సర్ఫేస్‌ను ఉంచుతున్నారు.



ఆర్చర్ రిషభ్‌కు కాంస్యం



చెంగ్డూ (చైనా): ప్రపంచ క్రీడల్లో భారత ఆర్చర్ రిషబ్ యాదవ్ కాంస్య పతకం సాధించాడు. వ్యక్తిగత కాంపౌండ్ విభాగం కాంస్య పతక పోరులో రిషబ్ 149-147తో భారత్‌కే చెందిన అభిషేక్‌ను ఓడించాడు.

వైభవ్ వల్లే వెళుతున్నాడు

● సంజూ శాంసన్‌పై ఆకాశ్ చోప్రా

న్యూఢిల్లీ: రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్‌గా 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ పాతుకుపోవడంతోనే సంజూ శాంసన్ జట్టును వీడాలనుకుంటున్నట్టు టీమిండియా మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా చెబుతున్నాడు. శాంసన్‌కు ఓపెనింగ్‌లో ఆడాలని ఇష్టమున్నా.. గత సీజన్‌లో అతడిని మూడో స్థానంలో పంపారు. ఇక.. యశస్వీ జైస్వాల్, వైభవ్‌లను ఓపెనర్లుగా ఆడించారు. 'గత మెగా వేలంలో రాజస్థాన్ జట్టు ఓపెనర్ బట్లర్‌ను వదులుకుంది. దీంతో జైస్వాల్‌కు జతగా శాంసన్ ఓపెనింగ్ చేయాలనుకున్నాడు. ఈ ఏడాది సీజన్ ఆరంభంలో కొన్ని మ్యాచ్‌ల్లోనూ అతను ఓపెనర్‌గా ఆడాడు. అయితే సంజూకు గాయమవడంతో వైభవ్‌ను ఆడించారు. తిరిగి శాంసన్ జట్టులోకి వచ్చినా వైభవ్‌నే ఓపెనర్‌గా కొనసాగించారు. ఇది సంజూకు ఇష్టం లేకపోయింది' అని ఆకాశ్ వివరించాడు.

కివీలు కుమ్మేశారు



రెండో టెస్టులో ఇన్నింగ్స్ 359 రన్స్‌తో జింబాబ్వే చిత్తు

అరంగేట్ర పేసర్ జకారికి ఐదు వికెట్లు ● 2-0తో క్లీన్‌స్వీప్

బులవాయో: న్యూజిలాండ్ క్రికెట్ జట్టు తమ టెస్టు చరిత్రలోనే అతి భారీ విజయాన్ని నమోదు చేసింది. జింబాబ్వేతో శనివారం మూడో రోజే ముగిసిన రెండో టెస్టులో ఇన్నింగ్స్ 359 పరుగుల తేడాతో కివీస్ ఘనవిజయం సాధించింది. దీంతో ఈ సిరీస్‌ను కివీస్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అంతేకాకుండా ఓవరాల్ టెస్టు చరిత్రలోనూ ఇది మూడో భారీ విజయం కావడం విశేషం. కివీస్ జట్టులో 23 ఏళ్ల అరంగేట్ర పేసర్ జకారి ఫౌల్క్స్ సంచలన ప్రదర్శనతో (5/37) అబ్బురపరిచాడు. ఫలితంగా జింబాబ్వే రెండో ఇన్నింగ్స్‌లో 117 పరుగులకే కుప్పకూలింది. నిక్ వెల్చ్ (47 నాటౌట్), కెప్టెన్ ఇర్విన్ (17) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. హెన్రీ, డఫీలకు రెండేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కాన్వే, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా హెన్రీ నిలిచారు.

తొలి సెషన్‌లోనే..: ఓవర్‌నైట్ స్కోరు 601/3 పరుగుల వద్దే కివీస్ తమ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయడంతో ఆ జట్టుకు 476 పరుగుల ఆధిక్యం దక్కింది. ఇక శనివారం ఉదయమే రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే తొలి సెషన్‌లోనే కుప్పకూలింది. పేసర్ల ధాటికి కేవలం 28.1 ఓవర్లే ఆడింది. ఓపెనర్ బెన్నెట్‌ను ఇన్నింగ్స్ తొలి ఓవర్ మూడో బంతికే పేసర్ హెన్రీ డకౌట్ చేశాడు. ఆ తర్వాత డఫీ, ఫిషర్‌ల ధాటికి జింబాబ్వే 49/4 స్కోరుతో నిలిచింది. ఇక 16వ ఓవర్ నుంచి వరుస విరామాల్లో ఐదు వికెట్లను పడగొట్టిన పేసర్ జకారి మిడిలార్డర్‌తో పాటు టెయిలెండర్ల భరతం పట్టాడు.

టెస్టు క్రికెట్‌లో భారీ విజయాలు

ఇన్నింగ్స్ 579 రన్స్‌తో	ఆస్ట్రేలియాపై ఇంగ్లండ్
ఇన్నింగ్స్ 360 రన్స్‌తో	దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియా
ఇన్నింగ్స్ 359 రన్స్‌తో	జింబాబ్వేపై న్యూజిలాండ్
ఇన్నింగ్స్ 336 రన్స్‌తో	భారత్‌పై వెస్టిండీస్



జకారి ఫౌల్క్స్ (5/37)

1 న్యూజిలాండ్ తరఫున అరంగేట్ర టెస్టులో ఉత్తమ గణాంకాలు (9/75) నమోదు చేసిన బౌలర్‌గా నిలిచిన ఫౌల్క్స్. విల్ ఓ'రూర్కీ (9/93)ని దాటాడు.

సంక్షిప్త స్కోర్లు

జింబాబ్వే తొలి ఇన్నింగ్స్: 125
న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 601/3 డిక్లేర్; **జింబాబ్వే రెండో ఇన్నింగ్స్:** 28.1 ఓవర్లలో 117 ఆలౌట్ (వెల్చ్ 47 నాటౌట్, ఇర్విన్ 17; ఫౌల్క్స్ 5/37, హెన్రీ 2/16, డఫీ 2/28).

తొలి వన్డేలో పాక్ గెలుపు

తరౌబా: ఆతిథ్య వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను పాకిస్థాన్ ఘనంగా బోణీ చేసింది. శుక్రవారం రాత్రి జరిగిన తొలి మ్యాచ్‌లో పాక్ ఐదు వికెట్లతో గెలుపొందింది. తొలుత విండీస్ 49 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌటైంది. ఎవిన్ లూయిస్ (60), హోప్ (55), చేజ్ (53) అర్ధ సెంచరీలు చేశారు. షహీన్ షా 4, నసీమ్ షా 3 వికెట్లు తీశారు. ఛేదనలో పాక్.. హసన్ నవాజ్ (63 నాటౌట్) అజేయ అర్ధ శతకానికి తోడు, కెప్టెన్ రిజ్వాన్ (53) రాణించడంతో 48.5 ఓవర్లలో 284/5 స్కోరు చేసి గెలిచింది.

పిల్లల గ్రీన్‌కార్డుకు 'వయసు' తిప్పలు!

- దరఖాస్తు చేసిన తేదీ కాకుండా.. వీసా మంజూరైన తేదీయే పరిగణనలోకి
- ఈ నెల 15 నుంచే అమెరికాలో కొత్త నిబంధనలు
- తల్లిదండ్రులకు గ్రీన్‌కార్డు వచ్చినా.. పిల్లలకు కష్టమే!

వాషింగ్టన్, ఆగస్టు 9: అమెరికాలో శాశ్వత నివాస హోదా కల్పించే గ్రీన్ కార్డుల నిబంధనల్లో మార్పు భారత సంతతి కుటుంబాలకు ఆశనిపాతంగా మారనుంది. సాధారణంగా అక్కడ ఉద్యోగం, వ్యాపారాలు చేసే విదేశీయులు గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఆ కుటుంబాల్లోని 21 ఏళ్ల లోపు వయసుండి, వివాహం కాని పిల్లలకు కూడా 'చైల్డ్ స్టేటస్ ప్రొటెక్షన్ యాక్ట్ (సీఎస్‌పీఏ)' కింద గ్రీన్‌కార్డు ఇస్తారు. ఇందుకోసం ఇన్నాళ్లుగా వారు దరఖాస్తు చేసుకున్న నాటి వయసును పరిగణనలోకి తీసుకునేవారు. ఇకపై వారి గ్రీన్‌కార్డు దరఖాస్తు ప్రాసెసింగ్/మంజూరు నాటి వయసును పరిగణనలోకి తీసుకునేలా ట్రంప్ ప్రభుత్వం మార్పులు చేసింది. ఆగస్టు 15 తర్వాతి నుంచి గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారికి ఈ నిబంధన వర్తిస్తుందని పేర్కొంది. ఇది భారత సంతతివారిపై, ముఖ్యంగా ఈబీ-2, ఈబీ-3 కేటగిరీల్లోని భారతీయులకు ఇబ్బందిగా మారనుంది. అమెరికాలో గ్రీన్‌కార్డు మంజూరుకోసం ఏళ్లకేళ్లు, ఒక్కోసారి దశాబ్దం పాటు ఎదురుచూడాల్సిందే. ఈ క్రమంలో దరఖాస్తు నాటికి, మంజూరు నాటికి కుటుంబాల్లోని పిల్లల వయసు పెరిగిపోతుంది. చాలా మంది 21 ఏళ్లు దాటిపోతారు. దానితో వారికి 'సీఎస్‌పీఏ' కింద గ్రీన్‌కార్డు మంజూరు చేయరు. చట్టబద్ధమైన శాశ్వత నివాస హోదాను కోల్పోయే ప్రమాదం ఉంది. వారంతా విద్యార్థి వీసా (ఎఫ్-1)కు మారడం లేదా తాత్కాలిక హోదా కోసం దరఖాస్తు చేసుకోవడం తప్పదు.

'ఉద్యోగం' వదిలితే స్వదేశాలకే..

తాత్కాలిక ఉద్యోగ వీసాలపై వచ్చి.. నిర్ణీత ఉద్యోగంలో చేరకుండా ఉన్నా గానీ, ఆ ఉద్యోగాన్ని వదిలేసిన వెంటనే స్వదేశానికి వెళ్లిపోకుండా అమెరికాలోనే ఉండేవారుగానీ కఠిన చర్యలు ఎదుర్కోక తప్పదని ఆ దేశ ఇమిగ్రేషన్ విభాగం హెచ్చరికలు జారీ చేసింది. ఇటీవల ఫ్లోరిడాలో ఉద్యోగం కోసం హెచ్-2ఏ వీసాపై వచ్చిన ఓ వ్యక్తి సదరు సంస్థలో చేరకుండా, మరో చోటికి వెళ్లారని.. ఆ వ్యక్తిని గుర్తించి కేసు నమోదు చేశామని వివరించింది. ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేసింది.

రష్యా ఉప ప్రధానితో డొభాల్ భేటీ

మాస్కో, ఆగస్టు 9: రష్యా పర్యటనలో ఉన్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్ ఆ దేశ అధినాయకత్వంతో వరుస సమావేశాలు జరుపుతున్నారు. తాజాగా రష్యా డిప్యూటీ ప్రధాని డెనిస్ మంటురోవ్‌తో సమావేశమయ్యారు. మాస్కోలో జరిగిన ఈ సమావేశంలో ద్వైపాక్షిక సైనిక-సాంకేతిక అంశాల్లో సహకారం, వ్యూహాత్మక రంగాల్లో ఉమ్మడి ప్రాజెక్టుల అమలుపై చర్చించారు. పౌర విమానాల తయారీ, ఖనిజాలు, రసాయన పరిశ్రమలపై చర్చించినట్లు భారత్‌లోని రష్యా ఎంబసీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. అంతకు ముందు డొభాల్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమై ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. భారత్‌లో పర్యటించాలన్న ఆహ్వానాన్ని పుతిన్ అంగీకరించారని డొభాల్ తెలిపారు.

15న పుతిన్‌తో భేటీ అవుతున్నా..

అలాస్కాలో కలవనున్నాం.. పుతిన్, జెలెన్ స్కీ ఇద్దరూ శాంతిని కోరుకుంటున్నారు

- రష్యా, ఉక్రెయిన్ మధ్య భూభాగాల మార్పిడి ఉంటుంది: ట్రంప్
- మా భూభాగాలను వదులుకొనే ప్రసక్తే లేదు: జెలెన్ స్కీ

వాషింగ్టన్, ఆగస్టు 9: రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఓ కొలిక్కి వచ్చే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ అంశానికి సంబంధించి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 15వ తేదీన భేటీకానున్నారు. ట్రంప్ తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రుత్'లో ఈ వివరాలు వెల్లడించారు. "అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమావేశం ఆగస్టు 15న జరగనుంది. నేను, రష్యా అధ్యక్షుడు పుతిన్ అలాస్కాలో సమావేశం కానున్నాం. మిగతా వివరాలు తర్వాత తెలియజేస్తాను.." అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా, రష్యా అధ్యక్షులు నేరుగా భేటీకావడం 2021 తర్వాత ఇదే మొదటి సారి. అప్పటి అధ్యక్షుడు జో బిడెన్ జెనీవాలో పుతిన్‌తో భేటీ అయ్యారు. ఇక పుతిన్ అమెరికా గడ్డమీద చివరిసారిగా 2015 సెప్టెంబర్‌లో అడుగుపెట్టారు. ఐక్యరాజ్యసమితి సమావేశంలో పాల్గొనేందుకు న్యూయార్క్ వచ్చిన ఆయన.. అప్పటి అధ్యక్షుడు ఒబామాతో భేటీ అయ్యారు.

రష్యా, ఉక్రెయిన్ మధ్య భూభాగం మార్పిడి ఉండొచ్చు..

'ట్రూత్'లో పోస్టు పెట్టడానికి ముందు అమెరికా అధ్యక్ష నివాసం వైట్‌హౌజ్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. రష్యా, ఉక్రెయిన్ అధ్యక్షులు పుతిన్, జెలెన్‌స్కీ ఇద్దరూ శాంతిని కోరుకుంటున్నారని చెప్పారు. "శాంతి ఒప్పందమంటే.. ఇరు దేశాల మధ్య భూభాగాల మార్పిడి ఉంటుంది. ఇరుదేశాలకూ ప్రయోజనం కలిగించేలా.. కొన్ని ప్రాంతాలను తిరిగి ఇవ్వడం, మరికొన్నింటిని వదులుకోవడం జరగవచ్చు. ఇదంత సులువేమీకాదు" అని ట్రంప్ పేర్కొన్నారు. శాంతి ఒప్పందం దిశగా ఇదే చివరి అవకాశమా? అని మీడియా ప్రస్తావించగా.. "చివరి అవకాశం అనే పదాలను వాడటం నాకు ఇష్టం ఉండదు. ఎప్పుడైనా తుపాకులు పేలడం మొదలైతే.. వాటిని ఆపడం చాలా కష్టం" వ్యాఖ్యానించారు. కాగా, పుతిన్‌తో ట్రంప్ చర్చలు జరపనుండటాన్ని భారత్ స్వాగతించింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ఇది ముగింపు పలికి, శాంతిని నెలకొల్పుతుందని భావిస్తున్నామని విదేశాంగ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.



భూభాగాలను వదులుకునే ప్రసక్తే లేదు: జెలెన్ స్కీ

ఉక్రెయిన్, రష్యా శాంతి ఒప్పందంలో భాగంగా భూభాగాలను వదులుకోవాల్సి రావొచ్చన్న ట్రంప్ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ మండిపడ్డారు. ఉక్రెయిన్‌కు భాగస్వామ్యం లేకుండా ట్రంప్, పుతిన్‌ల మధ్య జరిగే చర్చలతో ఎలాంటి ప్రయోజనం ఉండదని.. వారు ఏదైనా డీల్ కుదుర్చుకుంటే అది 'విఫల పరిష్కారమే'నని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన టెలిగ్రామ్‌లో పోస్టు పెట్టారు. "అలాస్కాలో పుతిన్‌తో ట్రంప్ భేటీ అవుతున్నట్టు ప్రకటించారు. మా ప్రజలకు వ్యతిరేకంగా, మా భూభాగంలో జరుగుతున్న యుద్ధానికి దూరంగా జరిగే ఈ చర్చల్లో మా భాగస్వామ్యం లేకుండా ఎలాంటి ఫలితం ఉండదు. మేం అసలైన శాంతిని కోరుకుంటున్నాం. మా భూభాగాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకునే ప్రసక్తే లేదు.." అని జెలెన్ స్కీ స్పష్టం చేశారు.

భారత్, పాక్ యుద్ధంలో ఆరు విమానాలు కూలాయి: ట్రంప్

భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. ట్రంప్ జోక్యంతో అజర్‌బైజాన్, ఆర్మేనియా మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. దీనిపై వైట్‌హౌజ్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరుదేశాల నేతలతోపాటు ట్రంప్ సంతకం చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. "ప్రపంచంలో శాంతిని, సుస్థిరతను నెలకొల్పాలన్నదే అమెరికా అధ్యక్షుడిగా నా కోరిక. ఇప్పటికే భారత్, పాకిస్థాన్ సహా ఐదు యుద్ధాలను ఆపాను. భారత్, పాక్ యుద్ధం ఆపడం పెద్ద విషయం. వాళ్లు యుద్ధ విమానాలతో దాడులు చేసుకున్నారు. ఐదారు యుద్ధ విమానాలు కూలిపోయాయి. పరిస్థితి ప్రమాదకరంగా మారింది. అందుకే నేను జోక్యం చేసుకున్నాను" అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఏ దేశ విమానాలు కూలాయన్న వివరాలేవీ ఆయన ప్రస్తావించలేదు.

ట్రంప్ టారిఫ్‌లతో అమెరికాకే చేటు

- భారత్ కాస్త ఓపిక పడితే ట్రంప్ గాలి మేడలు కూలిపోతాయి
- ఆర్థికవేత్త ప్రొఫెసర్ స్టీవ్ హాంకీ విశ్లేషణ

న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఆగస్టు 9: "ఏళ్ల తరబడి కొన్ని దేశాలు అమెరికా నుంచి ప్రయోజనం పొందాయి..! ఇప్పుడు ఆ దేశాల నుంచి బిలియన్ డాలర్లు వెనక్కి వస్తాయి" - ట్రూత్ సోషల్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోస్టు ఇది..! ఇలా అమెరికా ఖజానాను నింపడానికి ఏ దేశానికి ఎంత టారిఫ్ విధించాలంటూ లెక్కలేసుకుంటూ ట్రంప్ ఓ గాలి మేడను నిర్మిస్తున్నారని, ఈ ధోరణితో అది పేకమేడలా కూలిపోయే ప్రమాదముందని ఆర్థికవేత్త, జాన్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ స్టీవ్ హాంకీ హెచ్చరించారు. భారత్‌పై ట్రంప్ 50% సుంకాలు విధించడంపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో హాంకీ విశ్లేషణతో అమెరికా భవిష్యత్‌కు ఇబ్బందులు తప్పవనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రొఫెసర్ హాంకీ శనివారం ఓ జాతీయ వార్తాసంస్థతో మాట్లాడుతూ.. ట్రంప్ టారిఫ్ పూర్తిగా అర్థరహితమన్నారు. "నెపోలియన్ చెప్పినట్లు ఆయన(ట్రంప్) ధోరణి తనను తానే నాశనం చేసుకునేట్లుంది. భారత్ విషయంలో ప్రధాని మోదీ, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ కాస్త ఓపికపడితే చాలు. ట్రంప్ పేకమేడ త్వరలోనే కూలిపోతుంది" అని హాంకీ వ్యాఖ్యానించారు. అమెరికన్లు సంపాదన కంటే ఎక్కువ ఖర్చు చేస్తున్నారని, దాంతో వాణిజ్య లోటు పెరుగుతోందని గుర్తుచేశారు. "ట్రంప్ విధిస్తున్న సుంకాల ప్రభావం వస్త్రపరిశ్రమ, సముద్ర ఉత్పత్తులు, తోలు ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూలంగా ఉంటుంది" అని ఆయన వివరించారు. చైనా రాయబారి షు ఫెహోంగ్ కూడా అమెరికా సుంకాలు ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) నిబంధనలకు విరుద్ధమన్నారు. అటు రష్యా కూడా అమెరికా చర్యలను తీవ్రంగా విమర్శించింది. ట్రంప్ మాత్రం తన చర్యలు అమెరికా స్టాక్ మార్కెట్లకు బూస్ట్ ఇస్తున్నాయని, కోర్టు గనక సుంకాలకు వ్యతిరేకంగా తీర్పునిస్తే.. 1929 నాటి మహామాంద్యం తప్పదంటున్నారు.

అయ్యో.. రొయ్య!



(మొదటిపేజీ తరువాయి)

ఆక్వా రైతులపై.. 27 నుంచి అమల్లోకి రానున్న 50% సుంకం తాలూకా ప్రభావం కూడా ఇప్పుడే పడింది. ఎందుకంటే.. ఇక్కడి నుంచి అమెరికాకు రొయ్యలు ఎగుమతి చేయాలంటే 40 రోజుల వ్యవధి పడుతుంది. దీంతో 27 నుంచి అమలయ్యే 50 శాతం సుంకం పేరు చెప్పి వ్యాపారులు ఇప్పటి నుంచే ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీనికితోడు.. అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) ఆక్వా ఉత్పత్తుల్లో యాంటీబయాటిక్ ఆరోగ్య ప్రమాణాలను కఠినతరం చేసింది. దీనివల్ల మందులు ఎక్కువ వాడిన రొయ్యలను తిరస్కరించే ప్రమాదం ఉంది.

'గోదావరి' ఆయువు పట్టు

ఏపీలో ఆక్వా రంగానికి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు ఆయువుపట్టు. దేశవ్యాప్తంగా విదేశాలకు ఎగుమతి అయ్యే రొయ్యల్లో ఈ రెండు జిల్లాల నుంచే దాదాపు 60 శాతం ఉత్పత్తి జరుగుతోంది. దేశవ్యాప్తంగా ఏటా 10-11 లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతుండగా.. అందులో 6 లక్షల టన్నుల రొయ్యలు ఉభయ గోదావరి జిల్లాల్లో ఉత్పత్తి అయ్యేవే! పశ్చిమ గోదావరి జిల్లాలో ఉత్పత్తి అయ్యే మూడు లక్షల టన్నుల రొయ్యల్లో 40% అమెరికాకు.. 30% చైనాకు ఎగుమతి అవుతున్నాయి. ఆక్వా ఎగుమతులపై 25 శాతం సుంకం విధించినపుడు.. అమెరికాలోని బయ్యర్లు ఈ భారాన్ని భరించేందుకు అంగీకరించారని చెబుతున్నారు. 50 శాతం సుంకం పెంచుతున్నట్లు ట్రంప్ ప్రకటన చేశాక వారు చేతులెత్తేశారనే ప్రచారం తెరపైకి తెచ్చి, రొయ్యల ధరలను స్థానిక ఎగుమతిదారులు తగ్గించి వేశారని ఆక్వా రైతులు అంటున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉత్పత్తయ్యే పెద్దరొయ్యలలో 50 శాతం అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు సుంకం పెంచుతున్నట్లు ప్రకటన చేసిన వెంటనే స్థానికంగా ఉన్న ఎగుమతిదారులు ఆ రొయ్యల ధరలను అమాంతం తగ్గించి వేశారు. గతంలో కిలోకు 25 తూగే రొయ్యల ధర రూ.565 ఉండగా, ఇప్పుడు రూ.430కి తగ్గించారు. 30 కౌంట్ ధర గతంలో రూ.475 ఉండగా, ఇప్పుడు రూ.380కి తగ్గించారు. అలాగే 40 కౌంట్‌ధర రూ.400 నుంచి రూ.330కి, 50 కౌంట్‌ధర రూ.375 నుంచి రూ.310కి, 60 కౌంట్ ధర రూ.350 నుంచి రూ.290కి, 70 కౌంట్ ధర రూ.330 నుంచి రూ.270కి, 80 కౌంట్‌ధర రూ.310 నుంచి రూ.290కి, 90 కౌంట్‌ధర రూ.275 నుంచి రూ.230కి, 100 కౌంట్ ధర రూ.265 నుంచి రూ.220కి తగ్గించివేశారు. దీంతో టన్ను రొయ్యలకు రూ.40 వేలకుపైగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

ఏపీ అగ్రి ఎగుమతులకు దెబ్బ

అమరావతి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రష్యా నుంచి చమురు కొనుగోలుచేస్తున్నామన్న సాకుతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకాలు విధించిన పరిణామం.. ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. రాష్ట్రం నుంచి ఇప్పుడిప్పుడే అమెరికాకు పలు వ్యవసాయ, ఇతర ఉత్పత్తుల ఎగుమతులు ఊపందుకుంటున్నాయి. వీటిలో దంపుడు బియ్యం, ఉప్పుడు బియ్యం, పాలిష్ బియ్యం, పిండి, జీడిపప్పు, బెల్లం పొడి, టమోటా సాస్, మినరల్ వాటర్, రోస్టెడ్ నట్స్, తృణ ధాన్యాల ఉత్పత్తులు మొదలైనవి ఉన్నాయి. వీటివల్ల విదేశీ మారక ద్రవ్యం కూడా బాగా పెరుగుతోంది. 'వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహారోత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీ' డేటా ప్రకారం.. 2023-24లో ఆంధ్రప్రదేశ్ రూ.14.36 కోట్ల విలువైన 667.88 మెట్రిక్ టన్నుల వ్యవసాయోత్పత్తులను ఎక్స్‌పోర్ట్ చేసింది. 24-25లో రూ.22.05 కోట్ల ఉత్పత్తులు (616.21 టన్నులు) పంపించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే నెలల్లో రూ.137.41 కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులను (137.41 టన్నులు) ఎగుమతిచేసింది. ఎగుమతులు మరింత వృద్ధి చెందుతాయని ఆశిస్తున్న సమయంలో ట్రంప్ టారిఫ్‌లు షాకిచ్చాయి.

కేంద్రం ప్రోత్సాహకాలు ఇవ్వాలి

గతంలో అసైన్డ్ భూములలో సాగు చేసే రొయ్యల చెరువులకు కూడా విద్యుత్ సబ్సిడీ ఇచ్చేవారు. గత వైసీపీ ప్రభుత్వం ఆ రాయితీని ఎత్తివేసింది. దీంతో రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఉన్న భూములనే ఆక్వా జోన్ పరిధిలోకి తెచ్చి అసైన్డ్ భూములను మినహాయించింది. ఆక్వా జోన్‌లో ఉన్నప్పటికీ ఒక్కో రైతుకూ 10 ఎకరాల వరకే విద్యుత్ రాయితీని ఇస్తామని గత ప్రభుత్వం మెలికపెట్టింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రంగాన్ని పరిశ్రమగా గుర్తించింది. మేత ధరలు తగ్గించింది. రూ.1.50కే యూనిట్ విద్యుత్ సరఫరా చేస్తోంది. ఆక్వా జోన్‌ను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటోంది. అదే జరిగితే మరింత మంది రైతులకు విద్యుత్ రాయితీ లభిస్తుంది. ఇదే సమయంలో కేంద్రం కూడా రాయితీలు కల్పిస్తే అమెరికా విధించిన టారిఫ్ నుంచి గట్టెక్కే అవకాశం ఉందని అటు వ్యాపారులు, ఇటు రైతులు ఆశిస్తున్నారు. ఒక్కో ప్రాసెసింగ్ యూనిట్‌లో 2000 నుంచి 3000 మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు.

ఫార్మాకూ సుంకాల ముప్పు!?

- ప్రస్తుతానికి మినహాయింపు..
- భవిష్యత్‌లో వడ్డింపు తప్పదని ట్రంప్ హెచ్చరిక
- మన ఔషధ ఎగుమతుల్లో 40% అమెరికాకే..
- టారిఫ్‌లతో ఫార్మా కంపెనీల ఆదాయం 10% వరకు తగ్గే అవకాశం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50% సుంకాలతో భారత ఎగుమతి రంగాలు బెంబేలెత్తిపోతున్నాయి. అయితే, అమెరికాలో చవకగా ఔషధాలు లభించడంలో కీలకపాత్ర పోషిస్తున్న భారత ఫార్మా రంగానికి మాత్రం సుంకాల నుంచి మినహాయించారు. ఫార్మా సహా పలు రంగాలకు ఇచ్చిన మినహాయింపుపై సమీక్ష జరుగుతోందని, అవసరమైతే వీటినీ సుంకాల పరిధిలో చేరుస్తామని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. పైగా, ఫార్మాపై సుంకాలను వచ్చే 18 నెలల్లో 250 శాతానికి పెంచుతామని హెచ్చరించారు. ప్రస్తుతానికి ఊరట లభించినప్పటికీ, భవిష్యత్‌లో అమెరికా అధ్యక్షుడి నిర్ణయం ఎలా ఉండనుందోనని మన ఫార్మా రంగం, ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఔషధ తయారీ పరిశ్రమ ఆందోళన చెందుతోంది.

జెనరిక్ ఔషధాల్లో 35 శాతం మనవే..

ఒకవేళ ట్రంప్ ఔషదాలనూ సుంకాల పరిధిలోకి తెస్తే, మన ఫార్మా పరిశ్రమ కూడా 50 శాతం సుంకం చెల్లించేందుకు సిద్ధమవ్వాల్సిందే. ఇదే గనుక జరిగితే, మన ఔషధ కంపెనీల ఆదాయం 5-10 శాతం మేర తగ్గే ప్రమాదం ఉందని ఎస్‌బీఐ తాజా నివేదిక అంచనా వేసింది. ఎందుకంటే, అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మాస్యూటికల్ మార్కెట్. ఆ దేశానికి అత్యధికంగా (35 శాతం) జెనరిక్ ఔషధాలు సరఫరా చేసేది మనమే. గత ఆర్థిక సంవత్సరంలో మన ఫార్మా మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటాయే దాదాపు 40 శాతం. ముఖ్యంగా పెద్ద కంపెనీల ఆదాయంలో అమెరికాకు ఎగుమతుల ద్వారా సమకూరే వాటా 40-50 శాతం వరకు ఉంది. సుంకాల భారాన్ని కస్టమర్ల పైకి బదిలీ చేయలేక మన ఔషధ సంస్థల పోటీ సామర్థ్యం తగ్గిపోతుందని, దాంతో ఆదాయాలతో పాటు లాభదాయకతకూ గండిపడే అవకాశం కనిపిస్తోంది.

అమెరికా వినియోగదారులకే నష్టం: ఫార్మెక్సిల్

భారత ఫార్మాపై సుంకాలు విధిస్తే, అమెరికాకే నష్టమని ఫార్మెక్సిల్ చైర్మన్ నమిత్ జోషీ అన్నారు. దీంతో అమెరికా కస్టమర్లు ఔషధాల కోసం అధికంగా చెల్లించాల్సి వస్తుందన్నారు. మన జెనరిక్ ఔషధ తయారీ కంపెనీలు అతి స్వల్ప మార్జిన్లతో వ్యాపారం చేస్తాయని, సుంకాల భారాన్ని వినియోగదారులపైకి బదిలీ చేయడం తప్ప ప్రత్యామ్నాయం లేదన్నారు. స్వదేశంలోనే ఫార్మా రంగాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న అమెరికా అధ్యక్షుడి ఆలోచన ఇప్పటికిప్పుడు సాకారమయ్యేది కాదని, కనీసం 3-5 ఏళ్ల సమయం పడుతుందన్నారు.

హైదరాబాద్ ఫార్మాపై అధిక ప్రభావం

డాక్టర్ రెడ్డీస్, దివీస్ లేబొరేటరీస్, అరబిందో ఫార్మా, నాట్కో ఫార్మా, హెటిరో, ఎంఎస్ఎన్ ఫార్మా, గ్లాండ్ ఫార్మా, గ్రాన్యూల్స్ ఇండియా సహా 800కు పైగా కంపెనీలకు నెలవైన హైదరాబాద్ ఫార్మా పరిశ్రమపై సుంకాలు అధిక ప్రభావం చూపనున్నాయి. అమెరికాకు అత్యధికంగా ఔషధాలు ఎగుమతి చేస్తున్న కంపెనీల్లో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్, అరబిందో, నాట్కో సహా మరికొన్ని కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీల ఆదాయాల్లో 40 శాతం వరకు ఒక్క అమెరికా నుంచే వస్తుండటం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి ఔషధ ఎగుమతులు 9 శాతం వృద్ధి చెందిన 3,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.2.5 లక్షల కోట్లు) దాటాయి. అందులో తెలుగు రాష్ట్రాల వాటా 30 శాతం పైమాటే.

దేశీయ రక్షణ ఉత్పత్తుల రికార్డు

- 2024-25లో రూ. 1.51 లక్షల కోట్లకు ఉత్పత్తులు: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, ఆగస్టు 9: దేశీయ రక్షణరంగ ఉత్పత్తులు రికార్డు స్థాయిలో పెరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వార్షిక రక్షణ ఉత్పత్తులు రూ. 1,50,590 కోట్లకు చేరి ఆల్‌టైం అత్యధిక రికార్డును నమోదు చేశాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం తెలిపారు. ఇది అంతక్రితం ఏడాది కంటే 18% అధికం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశీయ ఉత్పత్తులు రూ.1.27 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కాగా 2019-20లో రూ. 79,071 కోట్లుగా ఉన్న ఉత్పత్తులు ఆ తర్వాత రాకెట్ వేగంతో దూసుకెళ్లాయి. ఆ ఏడాది నుంచి చూస్తే ప్రస్తుతం 90% అధికం. మొత్తం ఉత్పత్తుల్లో డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ (డీపీఎస్‌యూ), పబ్లిక్ సెక్టార్ యూనిట్ల (పీఎస్‌యూ) వాటా 77 శాతంగా ఉంది. మిగిలిన 23% ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం. ఇక 2024-25లో ప్రైవేట్ సెక్టార్ వాటా 2% పెరిగింది. 2023-24లో అది 21 శాతంగా ఉంది. పబ్లిక్, ప్రైవేట్ సంస్థల సమష్టి సహకారంతో రక్షణరంగ ఉత్పత్తుల్లో రికార్డు నెలకొల్పగలిగామని రాజ్‌నాథ్ కొనియాడారు. రక్షణ పరిశ్రమల్లో భారత్ బలోపేతం అయిందనడానికి ఇదే స్పష్టమైన సంకేతమన్నారు. ఆత్మనిర్భర్‌లో భాగంగా ప్రభుత్వ ప్రోత్సాహంతో రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబన సాధిస్తున్నామని ఆయన చెప్పారు. రక్షణ ఉత్పత్తుల్లో 2028-29 నాటికి రూ. 50 వేల కోట్ల ఎగుమతుల లక్ష్యాన్ని చేరుకుంటామని డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్ ధీమా వ్యక్తం చేశారు.

6 పాక్ యుద్ధ విమానాలు కూల్చేశాం

(మొదటిపేజీ తరువాయి)

వాహనాలు సహా డ్రోన్లు, క్షిపణులను కూడా నేలమట్టం చేశామని, అవి భారత భూభాగంలోనే కూలిపోయాయని తెలిపారు. ప్రధానంగా సుక్కూర్ వైమానిక స్థావరంపై జరిపిన దాడిలో యూఏవీ హ్యాంగర్, రాడార్ వ్యవస్థను ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని వీడియోలను ప్రదర్శించి.. పాక్‌లోని సుక్కూర్ వైమానిక స్థావరంలో దాడి తర్వాత నెలకొన్న పరిస్థితిని వివరించారు. సర్గోధా స్థావరంలోని ఎఫ్-16ఎస్ యుద్ధ విమానాలపై జరిపిన దాడి గురించి వివరిస్తూ.. తన రిటైర్మెంట్‌కు ముందు లభించిన అవకాశంగా పేర్కొన్నారు. ఇటీవల భారత ప్రభుత్వం సేకరించిన ఎస్-400 రక్షణ వ్యవస్థ గేమ్ చేంజర్ వంటిదన్నారు. పాక్ యుద్ధ విమానాలు, మానవ రహిత విమానాలను ఈ వ్యవస్థ బలంగా ఎదుర్కొంటుందని తెలిపారు. అంతేకాదు.. అసలు భారత వైమానిక రక్షణ వ్యవస్థలోకి పాక్ చొరబడే అవకాశం కూడా ఉండదన్నారు.

సీడీఎస్‌తో అనేక మార్పులు

సైనిక కార్యకలాపాలలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) పదవి అనేక మార్పులు తీసుకువచ్చిందని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. సీడీఎస్ అన్ని వేళలా అందుబాటులో ఉండి.. తమకు ఎన్నో సూచనలు చేస్తున్నారన్నారు. అనేక విషయాలను కలిసి చర్చించినట్టు తెలిపారు. అదేవిధంగా 'ఆపరేషన్ సిందూర్'లో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్ కీలక పాత్ర పోషించారని చెప్పారు. భద్రతా దళాలు, ఇతర ఏజెన్సీలు సంయుక్తంగా ముందుకు నడిచేందుకు దోహదపడ్డారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత వైమానిక శక్తి సామర్థ్యం అందరికీ తెలిసిందన్నారు.

అందుకే స్వేచ్ఛగా..!

'ఆపరేషన్ సిందూర్' విషయంలో కేంద్రం సుస్పష్టమైన రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించిందని అమర్ ప్రీత్ సింగ్ అన్నారు. అందుకే ఆపరేషన్ విజయవంతమైందన్నారు. వైమానికదళంపై ఎలాంటి నిబంధనలు పెట్టలేదని, తాము స్వేచ్ఛగా పని పూర్తి చేశామన్నారు. "సైనిక దళాలపై ఎలాంటి నిబంధనలు పెట్టలేదు. స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మేం స్వేచ్ఛగా వ్యవహరించాం. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకున్నాం. పక్కా ప్రణాళికలు రూపొందించుకున్నాం. రాజకీయ సంకల్పం సుస్పష్టంగా ఉండడం మరింత కలిసి వచ్చింది. అందుకే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది" అని అన్నారు.

ఏ ఒత్తిడి పనిచేసింది?: కాంగ్రెస్

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన ఆరు యుద్ధ విమానాలు కూల్చేశామని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ చెప్పిన విషయంపై విపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెబుతున్న సమయంలో ఆపరేషన్ సిందూర్‌ను ఎందుకు అంత హఠాత్తుగా నిలుపుదల చేయాల్సి వచ్చిందని ప్రశ్నించింది. దీనికి ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ సహా, లోక్‌సభలో విపక్ష ఉప నేత గౌరవ్ గొగోయ్ అన్నారు. "ఎయిర్ చీఫ్ మార్షల్ వెల్లడించిన కొత్త విషయం.. దిగ్భ్రాంతికి గురిచేసింది. హఠాత్తుగా ఆపరేషన్ సిందూర్‌ను ఎందుకు ఆపేశారు. ఎక్కడ నుంచి ఒత్తిడి వచ్చింది? " అని ప్రశ్నించారు.

ఒక్క విమానాన్నీ కూల్చలేదు

- భారత్‌ది అసంబద్ధ వాదన: పాక్

'ఆపరేషన్ సిందూర్'లో పాకిస్థాన్‌కు చెందిన ఆరు విమానాలను కూల్చివేశామన్న భారత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ వ్యాఖ్యలను పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తోసిపుచ్చారు. ఆ వాదనలో పసలేదని, అదొక అకాల, అసంబద్ధమైన వాదనని ఎదురు దాడి చేశారు. తాము ఒక్క విమానాన్నీ నష్టపోలేదంటూ నమ్మించే ప్రయత్నం చేశారు. అంతేకాదు.. స్వతంత్ర ధ్రువీకరణ కోసం ఇరు దేశాల విమానాల జాబితాను బహిరంగ పరుద్దామని సలహా ఇచ్చారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు.

కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావుకు గంగాశరణ్ సింగ్ పురస్కారం



న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో హిందీ సాహిత్యం, భాషల పురోగతికి విశిష్టమైన సేవలు అందించినందుకు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావుకు బిహార్ ప్రభుత్వ ప్రతిష్టాత్మకమైన గంగాశరణ్ సింగ్ పురస్కారం లభించింది. ఈ నెల 23న బిహార్ సీఎం నితీశ్‌కుమార్ చేతుల మీదుగా ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేస్తారు. పురస్కారంలో భాగంగా ఆయనకు లక్ష రూపాయల నగదును బహూకరించి సత్కరిస్తారు. దేశ తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ అనుయాయుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు గంగాశరణ్ సింగ్ హిందీని జాతీయ భాషగా గుర్తించేందుకు చేసిన కృషి రీత్యా ఆయన పేరిట ఏటా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు.

చేతక్, చీతా చాపర్లకు స్వస్తి!

- వాటి స్థానంలో ఆధునిక లైట్ హెలికాప్టర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: కాలంతీరిన చేతక్, చీతా చాపర్ల స్థానంలో ఆధునిక హెలికాప్టర్లను ప్రవేశపెట్టడానికి ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ ప్రయత్నాలు ప్రారంభించాయి. దీనికోసం 200 ఆధునిక తేలికపాటి హెలికాప్టర్లను కొనుగోలు చేస్తున్నాయి. వీటిలో 120 ఆర్మీకి, 80 వాయుసేనకు కేటాయించారు. 1960 దశకం నాటి చేతక్, చీతా హెలికాప్టర్లలో ఆధునిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే మిగ్-21 ఫైటర్ జెట్లలా వీటి క్రాష్ రేటు కూడా ఎక్కువ. పైలట్లకు విజిబిలిటీ సమస్య కూడా ఎదురవుతోంది. అందువల్ల వీటి స్థానంలో ఆధునిక హెలికాప్టర్లను ప్రవేశపెట్టడానికి నిర్ణయం తీసుకున్నారు.

సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టుల్లో రూ.80 వేల కోట్ల పెట్టుబడులకు సిద్ధం

» సీఎంకు వివరించిన ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి రంగంలో పెట్టుబడులకు సుముఖంగా ఉన్నామని ఎన్టీపీసీ తెలిపింది. శనివారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టుల్లో సుమారు రూ.80 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎంకు గురుదీప్ సింగ్ వివరించారు. ఫ్లోటింగ్ సౌర విద్యుత్తు ఉత్పత్తికి సంబంధించి రాష్ట్రంలో 6700 మెగావాట్ల సామర్థ్యానికి అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి చూపిన ఎన్టీపీసీకి అన్ని విధాల సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు.

ఎంత ఉన్నత స్థాయికెదిగినా అస్తిత్వాన్ని మరువొద్దు

» కార్పొరేట్ హోటళ్లలో పూర్వీకుల ఆహారం లభ్యం
» ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క
» గిరిజన సంస్కృతి, సంక్షేమానికి సర్కారు ప్రాధాన్యం
» గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్
» డప్పు చప్పుళ్లతో హోరెత్తిన ఆదివాసీ భవన్

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మనం ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా.. మన అస్తిత్వాన్ని, పూర్వ స్థితిని మరిచిపోవద్దని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క పేర్కొన్నారు. ఒకనాడు పేదవారి ఆహారంగా పరిగణించిన మన పూర్వీకుల తిండి.. ప్రస్తుతం కార్పొరేట్ హోటళ్లలో లభ్యమవుతోందని, దీన్ని బట్టే మన ఆహారం ఎంత బలవర్థకమైందో తెలుస్తోందన్నారు. హైదరాబాద్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో శనివారం జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడుతూ.. కరోనా వేళ పట్టణాల్లో ధనవంతుల కంటే గ్రామాల్లోని ఆదివాసీలే ఆరోగ్యంగా ఉన్నారని గుర్తు చేశారు. విద్య ఎంతో ముఖ్యమని చెంచుపేటల్లోనూ పాఠశాలలు ఏర్పాటు చేశామన్న సీతక్క.. బాగా చదువుకుని ఎంత ఉన్నత స్థాయికెళ్లినా సొంతూరిని మర్చిపోవద్దని హితవు చెప్పారు. గిరిజన ఆదివాసీలతో కలిసి బోనం.. విల్లు ఎక్కుపెట్టడంతోపాటు నృత్యం చేస్తూ వారిని ఉత్సాహ పరిచారు. ఆదివాసీ, లంబాడ, కోయ, గోండు, చెంచు, కొలం తదితర జాతుల ప్రజలు సంప్రదాయ కళారూపాలు, నృత్యాలతో అలరించారు. ఆదివాసీ భవన్ కళాకారుల డప్పుచప్పుళ్లతో మార్మోగింది. అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ తన ఆటపాటలతో ఆకట్టుకున్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం పలు నూతన పథకాలతో గిరిజన సంస్కృతి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అందులో భాగంగానే ఆదివాసీలకు భూహక్కుల నుంచి విద్య, ఆరోగ్యం, సంస్కృతి వరకూ పెద్ద పీట వేశామన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం అంటే వేడుక మాత్రమే కాదని, గిరిజన జాతి హక్కులను కాపాడే పండుగ అని పేర్కొన్నారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రాంచంద్ర నాయక్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి గిరిజన శాఖను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే తండాల అభివృద్ధి, ఉపాధి హామీ, ఆదివాసీలకు పోడు భూములు సాధ్యమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, వికలాంగుల సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి అలగు వర్షిణి, అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, ఎస్టీ గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి, టీసీఆర్ డైరెక్టర్ సముజ్వాల తదితరులు పాల్గొన్నారు.

రూ.1000 కోట్ల అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఇండెంటు పెట్టింది. 35 ఏళ్ల కాల పరిమితితో ఈ అప్పు సెక్యూరిటీ బాండ్లను రిలీజ్ చేసింది. ఈ నెల 12న ఆర్‌బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించనుంది. రాష్ట్రంతో కలిపి దేశంలోని 6 రాష్ట్రాలు మొత్తం రూ.8,450 కోట్ల అప్పుల కోసం ఇండెంట్లు పెట్టాయి.

ప్రత్యేక బస్సుల్లో రేపటి దాకా అదనపు చార్జీలు

» రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే: ఆర్టీసీ

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగ సందర్భంగా వేసిన ప్రత్యేక బస్సుల్లో పెంచిన టికెట్ ధరలు సోమవారం వరకు (ఆగస్టు 11) అమల్లో ఉంటాయని ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారమే ప్రత్యేక బస్సులకు చార్జీలు పెంచినట్లు అధికారులు తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకే ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రత్యేక బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది అద్భుతంగా పని చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రశంసించారు. సోదరభావానికి ప్రతీక అయిన రాఖీ పండుగను త్యాగం చేసి.. నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. గత రాఖీ పండుగ సందర్భంగా ఒక్కరోజే 63 లక్షల మంది, మూడు రోజుల్లో రికార్డు స్థాయిలో 1.77 కోట్ల మంది ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించారని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్ల వివరాలు ఇక ఆన్‌లైన్‌లో లబ్ధిదారులకు సులభమైన సేవలు

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పారదర్శకతను పెంచుతూ, లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. indirammaindlu.te-lan-gana.-go-v.in వెబ్‌సైట్‌ను నవీకరించి, ఇళ్ల పురోగతి, బిల్లుల చెల్లింపుల స్థితి వంటి సమాచారాన్ని తెలుసుకునే అవకాశం కల్పించామని గౌతమ్ పేర్కొన్నారు. లబ్ధిదారులు కార్యాలయాలకు వెళ్లకుండానే తమ ఫోన్ నంబరు, రేషన్ కార్డు నంబరు, అప్లికేషన్ నంబరు ఉపయోగించి ఎక్కడి నుంచైనా సమాచారాన్ని పొందవచ్చని ఆయన వివరించారు.


33 ఏళ్ల తర్వాత పదోన్నతులు ఇచ్చారు

» ప్రభుత్వానికి హైదరాబాద్ ఇంజనీర్ల సంఘం ధన్యవాదాలు

నీటిపారుదలశాఖలో 33 ఏళ్ల తర్వాత శాశ్వత ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వడమే కాకుండా దక్షిణ, ఉత్తర తెలంగాణ ప్రాంతాల అధికారులకు పోస్టింగుల్లో సమన్యాయం చేశారంటూ హైదరాబాద్ ఇంజనీర్ల సంఘం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాపోలు రవీందర్, చక్రధర్ దన్యవాదాలు తెలిపారు. పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా పదోన్నతులు ఇచ్చారని, ఎక్స్‌టెన్షన్‌లకు ప్రాధాన్యం ఇవ్వకుండా పదోన్నతులతో మేలు చేశారని చెప్పారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తుహిన్ కుమార్, జస్టిస్ గోపాలకృష్ణారావు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యపల్లి నంద శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.


తిరుమల ఆలయం వద్ద జస్టిస్ సూర్యపల్లి నంద

గేట్ వే ఆఫ్ హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

టవర్ నిర్మించాలని.. అందుకు తగిన డిజైన్లు రూపొందించాలని సీఎం సూచించారు. ఈ రెండు ప్రాంతాలకు పర్యాటకులు చేరుకునేలా ఎలివేటెడ్ గేట్‌వే నిర్మించి దాన్ని గేట్ వే ఆఫ్ హైదరాబాద్‌గా డిజైన్ చేయాలని ఆదేశించారు. బాపూఘాట్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఆకట్టుకునేలా డిజైన్ చేయాలన్నారు. హిమాయత్ సాగర్ వద్ద అప్రోచ్‌రోడ్డు నుంచి అత్తాపూర్ వైపు వెళ్లేందుకు కొత్త ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలని, గాంధీ సరోవర్ చుట్టూ ఈ వంతెన కనెక్టివ్ కారిడార్‌లా ఉండాలని చెప్పారు. విమానాశ్రయం నుంచి నేరుగా గాంధీ సరోవర్‌కు చేరుకునేలా కనెక్టివిటీ ఉండాలని స్పష్టం చేశారు. గాంధీ సరోవర్ వద్ద నిర్మించే ఐకానిక్ టవర్ ప్రపంచంలోనే ఎత్తైనదిగా ఉండాలని, ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని అధికారులను సీఎం నిర్దేశించారు.

తాగు, వరద నీటి నిర్వహణకు అనుగుణంగా..

హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలో చేపట్టే మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును బహుళ ప్రయోజనాలు ఉండేలా అత్యంత అధునాతనంగా అభివృద్ధి చేయాలని సీఎం పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవనం పనులు తాగునీటితోపాటు వరద నీటి నిర్వహణకు వీలుగా ఉండాలని, ఈ మేరకు వివిధ దేశాల్లో అమల్లో ఉన్న ప్రాజెక్టుల నమూనాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నీటిని హైదరాబాద్ నగర అవసరాలు తీర్చేందుకు వీలుగా మరింత సమర్థవంతంగా వినియోగించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. స్థలం వృథా కాకుండా.. మూసీ పరివాహక ప్రాంతం ఇరువైపులా భూగర్భంలో భారీగా నీటి నిల్వ సదుపాయాలను నిర్మించటం, అక్కడి నుంచి నీటిని తరలించటానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రెండు నెలల్లో టెండర్లు పిలిచేందుకు వీలుగా పనుల్లో వేగం పెంచాలని సీఎం అధికారులను ఆదేశించారు.

తెలంగాణలో బీసీ సీఎం ఖాయం

కాంగ్రెస్ హయాంలోనే అది సాధ్యం.. రేవంత్ పదేళ్ల ముఖ్యమంత్రిననడం తప్పుకాదు

» ప్రజల్లో విశ్వాసం పెంచేందుకే ఆ వ్యాఖ్యలు
» 23 తర్వాత మళ్లీ జనహిత పాదయాత్ర
» బండి, ఈటల నోరు విప్పకపోతే బీసీలకు అన్యాయం: మహేష్ గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఏదో ఒక రోజు బీసీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆ కల సాకారం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనకు మధ్య విభేదాలు ఉన్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. సీఎంతో సత్సంబంధాలు ఉండటం వల్లే రిజర్వేషన్లపై సమన్వయంతో పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. పదేళ్లు తానే ముఖ్యమంత్రినని రేవంత్‌రెడ్డి చెప్పడంలో తప్పు లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసాన్ని మరింత పెంచడం కోసం అలా మాట్లాడారని అన్నారు. రేవంత్‌రెడ్డి గతంతో పోలిస్తే ముఖ్యమంత్రి అయ్యాక చాలా మారారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేర్వేరని చెప్పారు.

బీఆర్ఎస్ కోసమే బండిని తొలగించారు

నాలుగైదు రోజుల్లో పార్టీ రాజకీయ సలహా సంఘం(పీఏసీ) సమావేశం ఉంటుందని, బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు సాగాలన్నది అందులో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇచ్చిన బీజేపీ ఢిల్లీలో మాత్రం దాన్ని పాస్ చేయనివ్వడం లేదని విమర్శించారు. కిషన్‌రెడ్డి భయంతోనే బండి సంజయ్, ఈటల రాజేందర్, అరవింద్ బీసీ రిజర్వేషన్లపై మాట్లాడటం లేదన్నారు. వారి మౌనం బీసీలకు నష్టం చేస్తోందని వ్యాఖ్యానించారు. గుజరాత్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లలో ముస్లింలకు ఇచ్చిన రిజర్వేషన్లపై కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌తో కుదిరిన ఒప్పందంలో భాగంగానే బండి సంజయ్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించారని, సికింద్రాబాద్ ఎంపీ టిక్కెట్‌ను, బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీల నుంచి కిషన్‌రెడ్డి లాక్కున్నారని ఆరోపించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి సంస్థలను నిర్వీర్యం చేస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఈడీ, సీబీఐ కేసులన్నీ ప్రతిపక్షాలపైనే పెడుతున్నారన్నారు. ఒకే వ్యక్తికి నాలుగు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉండడం దేశంలో ఎన్నికల వ్యవస్థలో నెలకొన్న పరిస్థితికి నిదర్శనమని చెప్పారు. ఎస్ఐఆర్ పేరిట పెద్ద ఎత్తున ప్రతిపక్షాల సానుభూతి పరుల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు.

పాదయాత్ర నాదే

ఆగస్టు 23 తర్వాత మళ్లీ జనహిత పాదయాత్ర మొదలు పెడతామన్నారు. పాదయాత్ర తన నిర్ణయమని, కొందరు కావాలని మీనాక్షి పాదయాత్రగా ప్రచారం చేశారని చెప్పారు. మొదట బస్సు యాత్ర అనుకున్నామని, తర్వాత పాదయాత్రగా మార్చామని వివరించారు. పాదయాత్రలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు సైతం మధ్యలో పాల్గొంటారని చెప్పారు. భారత్ జోడో యాత్రను తలపించేలా తమ పాదయాత్ర సాగుతోందన్నారు. యాత్రలో కొత్త పెన్షన్లు ఇవ్వాలనే విజ్ఞప్తులు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు.



రైటప్- గాంధీభవన్‌లో క్విట్ ఇండియా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, డిప్యూటి సీఎం భట్టి, మంత్రి పొన్నం, వీహెచ్ తదితరులు

త్వరలో పదవుల పంపకం

పార్టీ ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డిల వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. పార్టీలో పదవుల భర్తీపై కసరత్తు పూర్తయిందని, త్వరలోనే ప్రకటన ఉంటుందని తెలిపారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపికపై సర్వే జరుగుతోందని వెల్లడించారు. నోటిఫికేషన్ వెలువడిన తర్వాతే అభ్యర్థి ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే చనిపోతే పోటీ పెట్టకుండా ఉండే సంప్రదాయాన్ని కేసీఆరే బ్రేక్ చేశారని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు నల్లేరు మీద నడకేనన్నారు.

క్విట్ బీజేపీ అంటేనే దేశానికి భవిష్యత్తు

» బీజేపీకి అనుబంధ సంస్థగా మారిన ఈసీ
» మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపణలు

హైదరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కులాలు, మతాల పేరిట బీజేపీ భవిష్యత్తు లేకుండా చేస్తోందని, క్విట్ బీజేపీ అంటేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని జెండా ఆవిష్కరించారు. బీజేపీ దేశ రాజ్యాంగం మార్చాలని చూస్తుందని, రాజ్యాంగ సంస్థలను ప్రతిపక్షాలపై ఉసిగొల్పుతోందని ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్ బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందన్నారు. స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పోరాడిందని, దేశ రక్షణకు అదే దీక్షతో పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాభవన్‌లో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ గుండెకాయలాంటిదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో గాంధీభవన్ ఆవరణలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం ఉత్సాహంగా పని చేయాలన్నారు. మరోవైపు పలు రాష్ట్రాల్లో ఎన్నికల్లో జరుగుతున్న అవకతవకలకు సంబంధించి ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ ఎన్నికల కమిషన్‌పై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను గాంధీభవన్‌లో ప్రదర్శించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు పొన్నం, జూపల్లి, మాజీ ఎంపీ వీహెచ్ తదితరులు ఈ ప్రెజెంటేషన్‌ను చూశారు.



అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తెలంగాణ

» పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు
» టాప్ 5 స్థానమే లక్ష్యం
» రూ. 15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా కొత్త విధానం
» మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టులకు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తల నుంచి రూ.15 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించేలా ప్రభుత్వం ఒక ప్రత్యేక విధానాన్ని రూపొందించిందని ఆయన వివరించారు. శనివారం లక్డీకాపూల్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సదరన్ ట్రావెల్స్ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. 2025- 30 పర్యాటక నూతన విధానం లో భాగంగా తెలంగాణను ప్రపంచంలోని టాప్ 5 పర్యాటక గమ్యస్థానాలలో ఒకటి నిలపడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. ప్రస్తుతం గుర్తింపు పొందిన పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు కొత్తగా జలపాతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, వారసత్వ ప్రాంతాలు, ఏకో-టూరిజం, వెల్నెస్ కేంద్రాలు, క్రాఫ్ట్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. దీనితో పాటు మరో 27 ప్రాంతాల్లో పర్యాటక కేంద్రాల ఏర్పాటుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామని తెలిపారు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు, ప్రాంతీయ రింగ్ రోడ్ల వెంట డ్రై పోర్టులు, గోదావరి, కృష్ణా నదులపై రివర్ బెస్ట్ టూరిజం, నగరాల్లో వాటర్ ఫ్రంట్ హబ్‌ల వంటి ప్రత్యేకతలతో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని వివరించారు. పర్యాటక ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తామని, పర్యాటక రంగ అభివృద్ధికి సదరన్ ట్రావెల్స్ భాగస్వామ్యం కావాలని మంత్రి కోరారు. ఈ కృషిలో భాగంగా డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటుకు కూడా ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు.





హయత్‌నగర్ ప్రధాన రహదారిని ముంచెత్తిన వాన నీరు; మలక్‌పేట్ బ్రిడ్జి వద్ద భారీగా చేరిన వరద

హైదరాబాద్‌లో కుండపోత

మహానగరంలోని చాలా ప్రాంతాల్లో దంచికొట్టిన వాన.. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం

» రాకపోకలకు తీవ్ర అంతరాయం
» 13, 14, 15 తేదీల్లో రాష్ట్రంలో అతి భారీ వర్షాలు
» ఆది, సోమ, మంగళవారాల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను శనివారం రాత్రి వర్షం ముంచెత్తింది. హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా అబ్దుల్లాపూర్‌మెట్, ఎల్బీనగర్, హయత్‌నగర్, వనస్థలిపురం, తార్నాక, అబిడ్స్, చార్మినార్ తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. కుండపోతగా కురిసిన వర్షానికి రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం అవ్వగా.. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం రాత్రి 11 గంటల సమయానికి అబ్దుల్లాపూర్‌మెట్‌లో అత్యధికంగా 13..5 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. నాంపల్లి-బేగంబజార్ ప్రాంతంలో 12..4 సెం.మీ వర్షం కురిసింది. భారీ వర్షానికి యూసుఫ్‌గూడ కృష్ణానగర్ ప్రాంతంలో వరద పోటెత్తింది. వరద నీటిలో చిక్కుకున్న వారిని హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చాయి. మలక్‌పేట రైల్వే వంతెన వద్ద పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇక, సంగారెడ్డి, సిద్దిపేట, నారాయణపేట, గద్వాల, వనపర్తి, వికారాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో శనివారం ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. నారాయణపేట, గద్వాల జిల్లాల్లోని వాగులు పొంగి పొర్లగా పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో పత్తి, వరి పంటలు వరద ముంపునకు గురయ్యాయి. నారాయణపేట జిల్లాలోని సంగంబండ రిజర్వాయర్ రెండు గేట్లు తెరిచి నీటిని దిగువకు వదులుతున్నారు. గద్వాలలో ఓ ఇల్లు కూలి ఇద్దరు గాయపడ్డారు. వికారాబాద్ జిల్లాలోని పలు మండల్లాలో కూడా పంట నష్టం సంభవించింది. మరోపక్క, నారాయణపేట జిల్లా మక్తల్‌లో శనివారం 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్రంలో అతి భారీ వర్షాలు కురుస్తాయని శనివారం ప్రకటించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్ కూడా జారీ చేసింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఇక ఆది, సోమ, మంగళవారాల్లోనూ పలు జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఆదివారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.


నిండుకుండలా నాగార్జునసాగర్ జలాశయం


జోగుళాంబ గద్వాల జిల్లా బొంకూరులో నీట మునిగిన పత్తిపంట

నేడు సాగర్ గేట్లు ఎత్తివేత

నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను ఆదివారం ఉదయం 6గంటలకు ఎత్తనున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ మల్లికార్జున్‌రావు శనివారం ప్రకటించారు. రెండు క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తామని తెలిపారు. ఈ నీటి సంవత్సరంలో (ఈ ఏడాది జూన్ 1 నుంచి వచ్చే ఏడాది మే 31వ తేదీ వరకు) సాగర్ గేట్లు ఎత్తడం ఇది రెండోసారి కావడం విశేషం. సాగర్ నీటిమట్టం శనివారం సాయంత్రానికి 589.70 అడుగులుగా ఉంది. కాగా, శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరుగుతోంది. 1.30 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 183.41 టీఎంసీలు నిల్వ ఉన్నది. జూరాల ప్రాజెక్టుకు 1.25 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఇందులో భీమా నది నుంచి 22 వేల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. మరోపక్క, సింగూరు ప్రాజెక్టు వద్ద శనివారానికి నీటిమట్టం 21.223 టీఎంసీలకు చేరింది.



ఎన్ఐఏబీ శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేసిన కిట్‌లను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

'బయోటెక్నాలజీ' రంగంలో

అపార అవకాశాలు

- భారత్‌ను తీర్చిదిద్దడంలో విద్యార్థులే కీలకం: కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్
- ఎన్ఐఏబీ శాస్త్రవేత్తల ఐదు విప్లవాత్మక సాంకేతిక పరిజ్ఞానాల ఆవిష్కరణ
- దేశంలోనే మొట్టమొదటి 'జంతు మూలకణాల బయో బ్యాంక్' ప్రారంభం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బయోటెక్నాలజీ రంగం భారత దేశాన్ని 'ఫ్యూచర్ రెడీ ఇండియా'గా నిలుపుతుందని.. నేటి యువతకు ఆ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. గచ్చిబౌలిలోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ) సంస్థ అభివృద్ధి చేసిన ఐదు కిట్‌లను శనివారం ఆయన జాతికి అంకితం చేశారు. దేశంలోనే తొలి జంతు మూలకణాల బయో బ్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన.. ఎన్ఐఏబీ ఆవిష్కరణలు రైతులకు మేలుచేస్తాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. పశువుల ఉత్పాదకత మెరుగుపడడంతోపాటు రైతుల జీవనోపాధికి భరోసా కల్పించడంలోనూ ఇవి తోడ్పతుతాయని భావిస్తున్నట్టు చెప్పారు. అందుబాటు ధరల్లో ఉండే ఈ ఆవిష్కరణలు పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. జునోటిక్ (జంతువుల నుంచి సంక్రమించే) వ్యాధులతో పోరాడేందుకు ఈ తరహా పరిశోధనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులను దేశ భవిష్యత్తుగా పేర్కొన్న ఆయన.. దేశాన్ని తీర్చిదిద్దడంలో వారిదే కీలకపాత్ర అని స్పష్టం చేశారు. అలాగే.. విద్యార్థులకు డిజిటల్ హెల్త్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. పొదుగు వాపు వ్యాధి బారిన పడుతున్న పశువులను గుర్తించడం కోసం ప్రత్యేకంగా క్యాంప్‌లను చేయాలని రైతులు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో.. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని ఎన్ఐఏబీ డైరెక్టర్‌కు సూచించారు. కాగా.. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రత్యేకమైన సంస్థ ఎన్ఐఏబీ అని కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ సెక్రటరీ, బీఆర్ఐసీ డీజీ రాజేశ్ ఎస్ గోఖలే అన్నారు. తమ ఇన్‌స్టిట్యూట్ ప్రస్థానంలో తాజా ఆవిష్కరణలు కీలక మైలురాయిగా నిలుస్తాయని ఎన్ఐఏబీ డైరెక్టర్ తరు శర్మ అన్నారు.

ఆ 5 ఆవిష్కరణలు..

పశువుల్లో కనిపించే పలు వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు, పాల నాణ్యత మెరుగుపరిచేందుకు, వాటికి ఏవైనా వ్యాధులు వచ్చినప్పుడు ఉపయోగించాల్సిన యాంటీ బయాటిక్‌లను గురించి తెలిపే కిట్‌లను ఎన్ఐఏబీ శాస్త్రజ్ఞులు శనివారం విడుదల చేశారు. వాటి పూర్తి వివరాలు..

టీకా తీసుకోని పశువుల్ని గుర్తించే.. బ్రూ డివా



డాక్టర్ గిరీష్ రాధాకృష్ణన్ బృందం ఎనిమిదేళ్ల పాటు కష్టపడి అభివృద్ధి చేసిన ఈ కిట్‌తో... బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్ తీసుకున్న పశువులు, తీసుకోని పశువులను వేరు చేయడం సాధ్యమవుతుంది. బ్రూసెల్లోసిస్ అనేది బ్యాక్టీరియా వల్ల వచ్చే వ్యాధి. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే బ్యాక్టీరియా ఇది. సాధారణంగా బ్రూసెల్లోసిస్ టీకాలను ఆరు-ఎనిమిది నెలల వయసున్న దూడలకు వేస్తారు. ఆ తరువాత వ్యాక్సిన్ వేసినా ఫలితాలు తక్కువగా ఉంటాయి. ఈ టీకా తీసుకున్న, తీసుకోని పశువులకు తదతనంతర కాలంలో పరీక్షిస్తే, రెండింటికీ పాజిటివ్ అనే పరీక్షలు చూపుతాయి. అలా కాకుండా ఈ పశువులను టీకా తీసుకున్న/తీసుకోని వాటిగా వేరు చేయాలంటే బ్రూ డివా కిట్ తోడ్పడుతుంది. ఒక్క రక్తపు చుక్క లేదంటే పాల చుక్క ద్వారా ఈ వ్యాక్సిన్ తీసుకున్న పశువులు, తీసుకోని పశువు ఏదో కనిపెట్టవచ్చు. ఖర్చు కేవలం 50 రూపాయలు!

గోండి పరాన్నజీవిని గుర్తించే కిట్

రక్తం లేదంటే ప్లాస్మా, సీరమ్‌లో యాంటీ టోక్సోప్లాస్మా గోండి యాంటీబాడీస్‌ను కనుగొనేందుకు రూపొందించిన కిట్.. టోక్సో ర్యాపిడ్ యాంటీబాడీ డిటెక్షన్ కిట్ ఇది. పశువులతో పాటు మనుషులకు కూడా వ్యాపించే గోండి పరాన్నజీవి ఒక్కోసారి ప్రాణాంతకం కావొచ్చు. దీనివల్ల పశువులు, మనుషుల్లో గర్భస్రావం అయ్యే ప్రమాదం ఉంది. ప్రధానంగా పిల్లులు వాటి నుంచి ఇతర క్షీరదాలకు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ కిట్‌తో 10 నిమిషాల్లోనే ఫలితాలను పొందవచ్చు. ఈ కిట్‌ను డాక్టర్ అభిజీత్ దేశ్‌ముఖ్ బృందం తయారుచేసింది.

జబ్బు పడ్డ పశువుకు ఏ మందు వేయాలో చెప్పే.. క్యూర్ చెక్

పశువులు జబ్బు పడినప్పుడు.. తొలుత ఒక యాంటీ బయాటిక్ వాడడం, తగ్గకపోతే మరో యాంటీ బయాటిక్ వాడటం వల్ల యాంటీ బయాటిక్ రెసిస్టెన్స్ పెరిగే ప్రమాదం ఉంది. ఇండియాలో మనుషులకే కాదు పశువులకూ ఇది ఓ సమస్యగానే ఉందిప్పుడు. ఆ సమస్యకు పరిష్కారమే క్యూర్ చెక్ కిట్. ఈ కిట్‌తో కేవలం రెండు గంటలలో ఫలితాలను తెలుసుకుని, సరైన యాంటీ బయాటిక్ మందును పశువుకు అందించవచ్చు. పరీక్ష ఖరీదు 50 రూపాయల్లోపే ఉంటుంది. దీనిని కూడా పంకజ్ సుమన్, బృందమే రూపొందించింది.

జపనీస్ ఎన్‌సెఫలైటిస్‌ను గుర్తించే.. ర్యాపిచెక్స్

డాక్టర్ సోను గాంధీ బృందం తయారుచేసిన ఈ కిట్ ద్వారా.. జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వైరస్‌ను కనుగొనడం సాధ్యమవుతుంది. ఈ జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వైరస్ పందుల నుంచి దోమల ద్వారా మనుషులకు వ్యాపించి, మెదడువాపు వ్యాధికి కారణమవుతుంది.

పొదుగువాపు వ్యాధిని గుర్తించే.. అడర్ కేర్

పశువులలో పొదుగు వాపు వ్యాధి (మస్టైటిస్)ని కనుగొనేందుకు ఉపయోగించే కిట్. పశువులకు పొదుగు వాపు వ్యాధి వస్తే.. పాల రంగు మారడం, పాలు నిల్వ ఉండకపోవడం, చెడువాసన వంటి లక్షణాల ద్వారా రైతులు ఆ విషయాన్ని తెలుసుకుంటారు. అయితే ఆ స్థితికి వచ్చేసరికి పశువు పొదుగులో బ్యాక్టీరియా గణనీయంగా పెరిగిపోతుంది. దీనివల్ల పాల దిగుబడి తగ్గడంతో పాటుగా నాణ్యత కూడా గణనీయంగా తగ్గిపోతుంది. పశువుతో పాటుగా రైతుకూ నష్టం కలుగుతుంది. అలా కాకుండా.. పొదుగు వాపు వ్యాధిని ముందగానే గుర్తించే కిట్ అడర్ కేర్. కేవలం 20-50 రూపాయల ఖర్చుతో ఈ పరీక్షను రైతులే స్వయంగా చేసుకునే అవకాశం ఉంది. ఈ కిట్‌ను ఇప్పటికే పలు డెయిరీ ఫార్మ్‌లు పరీక్షించి సంతృప్తిని వ్యక్తం చేశాయి. ఈ కిట్‌ను డాక్టర్ పంకజ్ సుమన్ బృందం ఐదేళ్ల పాటు కష్టపడి రూపొందించింది.

ఆయుష్షు పోస్తున్న అవయవదానం

- రాష్ట్రంలో 12 ఏళ్లలో 6,309 అవయవాల మార్పిడి
- 2024లో దేశంలోనే అగ్రస్థానం



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కోమాలోకి వెళ్లిన ఒక విద్యార్థినికి.. 48 గంటల్లోగా కాలేయ మార్పిడి చేయకపోతే బతికే అవకాశాలు లేవన్నారు ఉస్మానియా వైద్యులు. కాలేయ దానానికి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చినప్పటికీ.. వారిలో ఎవరి కాలేయమూ ఆమెకు సరిపోలలేదు. దీంతో 'జీవన్‌దాన్'లో 'సూపర్ అర్జంట్ కేటగిరీ'లో ఆమెకు ఓ బ్రెయిన్‌డెడ్ రోగి నుంచి సేకరించిన కాలేయాన్ని అమర్చారు. దీంతో ఆమె ఆరోగ్య పరిసితి మెరుగుపడింది. ఆ ఒక్క విద్యార్థినే కాదు.. ఇలా రాష్ట్రంలో ఏటా కొన్ని వందల మంది అవయవదానం కారణంగా మృత్యుకోరల నుంచి క్షేమంగా బయటపడుతున్నారు. తమ దైనందిన జీవితాన్ని సాఫీగా కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో 'జీవన్ దాన్' ద్వారా గడిచిన 12 సంవత్సరాల్లో.. 1,673 మంది డోనర్ల నుంచి సేకరించిన 6,309 అవయవాలను, టిష్యూలను మార్పిడి చేయడం ద్వారా వైద్యులు వేలాది మందికి కొత్తజీవితాన్ని ప్రసాదించారు. అంతేనా.. తెలంగాణ రాష్ట్రం 2024లో అవయవదానంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ అవార్డు అందుకుంది. అవయవదానం పట్ల ప్రజల్లో పెరిగిన అవగాహనే రాష్ట్రంలో అవయవదానాల సంఖ్య ఎక్కువగా ఉండడానికి కారణమని వైద్యనిపుణులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమమైన జీవన్‌దాన్‌లో భాగంగా అవయవదానం చేస్తున్నవారి జాతీయ సగటు 2024 లెక్కల ప్రకారం.. ప్రతి పది లక్షల మందికిగాను 0.8 మంది (అంటే ప్రతి కోటి మందిలో ఎనిమిది మంది) కాగా.. తెలంగాణలో ఆ రేటు ఏకంగా 4.88 (ప్రతి పదిలక్షల మందిలో దాదాపు ఐదుగురు)గా ఉండడం గమనార్హం.

కిడ్నీలు అత్యధికం

జీవన్‌దాన్ కార్యక్రమంలో భాగంగా గడిచిన 12 ఏళ్లలో అత్యధికంగా 2,516 మందికి కిడ్నీల మార్పిడి జరిగింది. ఇక.. రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటికే 464 అవయవమార్పిడి శస్త్రచికిత్సలు జరగ్గా.. 2024లో ఆ సంఖ్య 725గా, 2023లో 729గా ఉంది. జీవన్‌దాన్ ద్వారా కేవలం బ్రెయిన్‌డెడ్ రోగి నుంచే అవయవాలను సేకరిస్తారు. రక్తసంబంధీకులకు సంబంధించిన అవయవదానాలను వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షిస్తుంది. ఏదైనా ఆస్పత్రిలో రోగి బ్రెయిన్ డెడ్ అయితే అతనికి సంబంధించి సమాచారం జీవన్‌దాన్‌కు చేరుతుంది. వెంటనే కో-ఆర్డినేటర్స్ ఆస్పత్రికి వెళ్లి రోగి పరిస్థితి పూర్తిగా తెలుసుకున్న తర్వాత అవయదానం పరిస్థితి గురించి కుటుంబ సభ్యులకు వివరిస్తారు. అవయవదానానికి కుటుంబ సభ్యులు అంగీకరించిన తర్వాత ఆ వివరాలను వెంటనే జీవన్‌దాన్ కమిటీకి అందజేస్తారు. ఈ కమిటీ అత్యవసరంగా అవయవాలు కావాల్సినవారిని గుర్తించి మార్పిడికి అవకాశమిస్తారు.

నిమ్స్‌లో నోడల్ కేంద్రం

తెలంగాణలో జీవన్‌దాన్‌కు సంబంధించి నోడల్ కేంద్రాన్ని నిమ్స్‌లో ఏర్పాటు చేశారు. దీనికి డీఎంఈ చైర్మన్‌గా, నిమ్స్ డైరెక్టర్ కో-చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రి వర్గాలకు కూడా ఇందులో భాగస్వామ్యం ఉంది. అలాగే కాలేయం, కిడ్నీ, గుండెకు సంబంధించిన కమిటీలు ఉంటాయి. ఈ కమిటీ పర్యవేక్షణలో అవయవ మార్పిడి కేటాయింపులు జరుగుతాయి. కాగా.. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రీ తప్పనిసరిగా జీవన్‌దాన్‌లో రిజిస్టర్ అయి ఉండాలి. అలా నమోదైన ఆస్పత్రికే అవయవాలు కేటాయించి అక్కడే మార్పిడి నిర్వహిస్తారు. ఇలా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి ఆస్పత్రిలో ఓ కో-ఆర్డినేటర్‌ను నియమించాల్సి ఉంటుంది. అవయవాలు అవసరమైన వారు ముందుగా తమ పేర్లను జీవన్‌దాన్‌లో నమోదు చేసుకోవాలి. బాధితులు 040-23489494 నంబర్‌కు ఫోన్ చేసి కూడా సమాచారం తెలుసుకోవచ్చు. jeevandan.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా కూడా వివరాలు తెలుసుకోవచ్చు.

తెలంగాణలో 12 ఏళ్లలో జరిగిన అవయవ మార్పిడి వివరాలు

ఊపిరితిత్తులు	కాలేయం	గుండె	గుండె కవాటాలు	పాంక్రియాస్	కార్నియా
396	1,534	226	170	14	1,453

పంచాయతీ నుంచి సచివాలయం వరకూ సౌర విద్యుత్ ప్లాంట్లు

- పెద్ద ఎత్తున సోలార్ పవర్ ఉత్పత్తికి చర్యలు
- వేగిరంగా ఇందిర సౌర గిరిజల వికాసం పథకం అమలు
- కలెక్టర్లకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశం



హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్తును ప్రోత్సహించేందుకు చర్యలు ముమ్మరం చేసింది. గ్రామపంచాయతీ నుంచి సచివాలయం వరకూ అన్ని ప్రభుత్వ భవనాల మిద్దెలపై సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటుతో పెద్ద ఎత్తున సౌర విద్యుత్తు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. అలాగే ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం అమలును వేగిరం చేయాలన్నారు. అటవీ హక్కుల రక్షణ చట్టం (ఆర్ఓఎఫ్ఆర్) కింద రైతులు పట్టాలు పొందిన భూముల వివరాలను పంపాలని ఏజెన్సీ ప్రాంత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం అమలుపై జిల్లా కలెక్టర్లతో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీతో కలిసి సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపైనా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలనూ పంపాలని కలెక్టర్లను మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. పార్కింగ్, క్యాంటిన్లతోపాటు కలెక్టరేట్ కార్యాలయాల ప్లాన్లను హైదరాబాద్‌కు పంపాలని సూచించారు. కలెక్టరేట్లన్నీ ఒకే నమూనాలో నిర్మించినందున సౌర విద్యుత్ ప్లాంట్ డిజైన్ కూడా హైదరాబాద్ నుంచే పంపుతామన్నారు. సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలను వారం లోపు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయంలో సమర్పించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నీటి పారుదల, రోడ్లు భవనాల శాఖల పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీగా ఉన్న స్థలాల వివరాలనూ అందించాలని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద పట్టాలు పంపిణీ చేసిన 6.70 లక్షల ఎకరాల భూముల్లో 'నల్లమల డిక్లరేషన్' అమలు చేస్తున్నామన్న మల్లు భట్టి విక్రమార్క.. ఆ భూముల్లో కింద ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం ద్వారా ఉచిత సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్లకు వివరించారు. అచ్చంపేటలో ప్రారంభమైన నల్లమల డిక్లరేషన్.. త్వరలోనే ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించేందుకు ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం అమలుకు అవసరమైన వివరాలను అలసత్వం లేకుండా వారం లోపు అందజేయాలని ఆయన చెప్పారు. ఈ విషయంలో సందేహాలుంటే ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలు, రెడ్‌కో వీసీఎండీని సంప్రదించాలని డిప్యూటీ సీఎం కలెక్టర్లను ఆదేశించారు.

చట్టవిరుద్ధంగా రేడియల్ రోడ్డు భూసేకరణ

- హైకోర్టులో యజమానుల పిటిషన్
- అంతా నిబంధనల ప్రకారమేనని ప్రభుత్వం సమాధానం.. రేపు విచారణ

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) రావిర్యాల్ ఇంటర్ ఛేంజ్ వరకు నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు కోసం జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్ చట్టవిరుద్ధమని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్, కందుకూరు మండలం తిమ్మాపూర్, లేమూర్ తదితర గ్రామాలకు చెందిన దాదాపు 45 మంది రైతులు, భూయజమానులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. భూసేకరణ కోసం ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చినట్లు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, పత్రికల్లో చూసి తెలుసుకున్నామని పిటిషనర్లు పేర్కొన్నారు. ఎవరి భూమి ఎంత సేకరిస్తున్నారనే వివరాలు లేకుండా తమ పేర్లు, సర్వే నెంబర్లతో నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. అభ్యంతరాలు దాఖలు చేయడానికి, వ్యక్తిగతంగా వాదన వినిపించేందుకు అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం సమాధానం ఇస్తూ గతేడాది అక్టోబర్ 28న నోటిఫికేషన్ ఇచ్చామని, గ్రామసభ కూడా నిర్వహించామని తెలిపింది. పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరిస్తూ ప్రొసీడింగ్స్ సైతం ఇచ్చామని పేర్కొంది. చట్టంలో పేర్కొన్న ప్రక్రియను అనుసరిస్తున్నట్లు తెలిపింది. అన్ని వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని పేర్కొంది. ఈ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ జరపనుంది.

గోపన్‌పల్లి ఎన్‌జీఓ హౌసింగ్ సొసైటీ భూములపై స్టే

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన భూమిగా పేర్కొంటున్న 17 ఎకరాలను నిషేధిత జాబితాలో నుంచి తొలగిస్తూ రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి పరిధిలోని సర్వే 36 ఏఏ, 36ఈ లోని 17 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో తొలగించడంపై ఆ హౌసింగ్ సొసైటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ భూములపై స్టేటస్ కో ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ నిషేధిత జాబితాలో నుంచి తొలగించడం చెల్లదని పేర్కొంది. వాదనలు విన్న జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించింది.

సంజయ్‌ను పిచ్చాసుపత్రిలో చేర్చాలి: రావుల

బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఉండడం రాష్ట్ర దౌర్భాగ్యమని.. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు ఆయన్ను పిచ్చాసుపత్రిలో చేర్పించాలంటూ బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మీడియాలో సంచలనాల కోసం, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉండడానికి సంజయ్ చిల్లర వాగుడు వాగుతున్నారని దుయ్యబట్టారు. 'ఏం ఘన కార్యం చేశావని నీకు ఊరేగింపులు, నీ లాంటి వాళ్ల ఉండటం వల్ల కేంద్రమంత్రి వర్గంపైనే నమ్మకం పోతోంది. పార్లమెంటులో ఎప్పుడైనా తెలంగాణ అభివృద్ధి గురించి మాట్లాడావా? బీజేపీని కాంగ్రెస్‌కు బీ టీమ్‌లా మార్చింది నీలాంటి సన్నాసులే' అంటూ సంజయ్‌నుద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

వ్యభిచార ముఠా చెరలోని బంగ్లా బాలికకు విముక్తి

- మాయమాటలు చెప్పి 15 ఏళ్ల అమ్మాయిని భారత్‌కు తెచ్చిన బంగ్లా మహిళ
- హైదరాబాద్‌లో వ్యభిచార ముఠాకు అప్పగింత
- 6 నెలలుగా బలవంతంగా వ్యభిచారం
- విటుల వద్దకు తీసుకెళుతుండగా ఆటో నుంచి దూకి పోలీసుస్టేషన్‌లోకి బాలిక పరుగు
- సాయం చేయమని పోలీసులకు వేడుకోలు

మదీన, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లి వచ్చే దారిలో పరిచయమైన మహిళ మాయమాటలు నమ్మి దేశం కానీ దేశమొచ్చి వ్యభిచార కూపంలో ఇరుక్కొని ఆరు నెలలుగా నరకయాతన అనుభవిస్తోన్న ఓ బంగ్లాదేశీ బాలికను హైదరాబాద్ పోలీసులు రక్షించారు. ఆ బాలికతో బలవంతంగా వ్యభిచారం చేయించిన బండ్లగూడ ఇస్మాయిల్‌నగర్‌కు చెందిన హాజీరా బేగం(41), మెహదీపట్నం మురాద్‌నగర్‌కు చెందిన షహనాజ్ ఫాతిమా (32), హాఫిజ్ బాబానగర్ సీ బ్లాక్‌కు చెందిన మహ్మద్ సమీర్(23)ను అరెస్టు చేశారు. చాంద్రాయణగుట్ట ఏసీపీ ఏ.సుధాకర్ కేసు వివరాలను వెల్లడించారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాకు చెందిన బాధిత బాలిక(15) తొమ్మిదో తరగతి విద్యార్థిని. రోజూ పాఠశాలకు వెళ్లొచ్చే క్రమంలో రూప అనే మహిళతో ఆమెకు పరిచయమైంది. కొద్దిరోజుల్లోనే బాలికకు దగ్గరైన రూప.. తనతో వస్తే భారత్‌లోని పర్యాటక ప్రదేశాలను చూపిస్తానని నమ్మబలికింది. తల్లిదండ్రులు, స్నేహితులకు విషయం చెప్పవద్దని చెప్పింది. రూప మాటలు నమ్మిన బాధిత బాలిక ఆమె వెంట వచ్చేందుకు సిద్ధమైంది. దీంతో ఓ రోజు తల్లీ కూతుళ్లమంటూ రూప, బాధిత బాలిక అర్ధరాత్రి వేళ ఓ పడవలో నదిని దాటి కోల్‌కతా చేరుకున్నారు. అక్కడి నుంచి రైలు మార్గంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో హైదరాబాద్ వచ్చారు. అనంతరం వ్యభిచారం నిర్వహించే మెహదీపట్నానికి చెందిన షహనాజ్ ఫాతిమాకు ఆ బాలికను అప్పగించి రూప వెళ్లిపోయింది. ఆ మరుసటి రోజు షహనాజ్ ఆ బాలికను హాజీరా బేగంకు అప్పగించింది. కొద్దిరోజులు బాలికను ఇంట్లో బంధించిన హాజీరా.. నువ్వు అనుమతులు లేకుండా భారత్‌లోకి వచ్చావు, ఎవరికైనా తెలిస్తే జైలుకి వెళతావు.. అంటూ భయపెట్టి బలవంతంగా వ్యభిచారంలోకి దింపింది. అనంతరం మహ్మద్ సమీర్ ఆటోలో నిత్యం విటుల వద్దకు పంపించేంది. ఇలా, ఆరు నెలలుగా నరకయాతన అనుభవిస్తున్న బాలిక.. రోజు ఆటోలో వెళ్లేటప్పుడు ఓ పోలీసుస్టేషన్‌ను చూసేది. ఈ క్రమంలో శుక్రవారం ఆటోలో నుంచి దూకి పోలీసుస్టేషన్‌లోకి పరుగుతీసి తనకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు చెప్పి సాయం కోరింది. బాలిక ఇచ్చిన సమాచారం మేరకు మురాద్‌నగర్‌లోని షహనాజ్ ఫాతిమా స్థావరంపై దాడి చేసిన పోలీసులు అక్కడ పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురు మహిళలను గుర్తించారు. వారితోనూ బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నట్టు గుర్తించారు. ఇక, హాజిరా, ఫాతిమా, సమీర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. రూప, హైదరాబాద్‌కు చెందిన సర్వర్ కోసం గాలిస్తున్నారు. బాధిత బాలికను సంరక్షణ కేంద్రానికి తరలించారు. బాలిక తల్లిదండ్రులను సంప్రదించేందుకు బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం ద్వారా ప్రయత్నిస్తున్నారు. కాగా, హైదరాబాద్, పాతబస్తీ ప్రాంతంలో వ్యభిచారం చేస్తున్న వారిలో వందలాది మంది బంగ్లాదేశీ మహిళలతోపాటు బెంగాల్ మహిళలు ఉన్నట్టు సమాచారం ఉందని పోలీసులు చెబుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.